శ్రీ

భాస్కరోదంతము

(ప్రథమభాగము)

ఇది

కాశీభట్ల బ్రహ్మయ్యచే

విరచింపఁబడినది.

"వినవలె నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపఁదగున్
గనికల్ల నిజము దెలిసిన
మనుజుఁడె పో నీతిపరుఁడు మహిలో సుమతీ"

కాకినాడ

సుజనరంజనీ ముద్రాక్షరశాల

కలియుగాబ్దము ౪౯౯౯ అగు హేమలంబి వత్సర ఫాల్గుణమాసము.

1898

Copy right.

వెల ౮ అణాలు.

పీఠిక.

కవుల చారిత్రాంశములను రత్నాకరమును పఱచి చూచినకొలఁది విబుధాభీష్టదాయకములగు సద్వస్తుజాలము లుత్పన్నములగుననుట కంగీకరింపని వారుండరు. ఇందలి కగ్గు లేల్పుటకిదియ మంచి సమయము. ఈవఱకును నీయమృతనిధిని జక్కఁగాఁ దఱచుటకుఁ దగిన యుపకరణము లేర్పడినవే కాని యింకను నమృతోత్పన్నము కాలేదు. దీనియందు సుధను బుట్టించుటకై మనదేశ చారిత్రాంశములను వ్రాసిన పశ్చిమదేశీయ విద్వాంసుల గ్రంథసమితియను నాదికూర్మమును క్షీరసాలయమున నుంచి యాపై "<u>కవిజీవితములు</u>" అను మందరమును నెలకొలిపి దానికి "<u>కవులచరిత్రలు</u>" అను గూఢపాత్రికమును బెట్టి మథింపవలయును. ఇట్టిమంచి సాధనసామగ్రి సిద్ధముగానున్నప్పు డుపేక్ష చేయుట న్యాయము కాదు. నా సామర్థ్యమంతగా లేకపోయినను నీమథనక్రియయందు విబుధులును, బుణ్యజనులును సన్నిహితములఁబూని తోడ్పడుదురను నమ్మకముండుటచే <u>నీభారోదంత చర్యయను</u> త్రిప్పను ద్రిప్పఁదలపెట్టితిని. ఇట్టి మథనమువలన మొదట ననిష్టదాయకములగు హాలాహలము లెన్ని పుట్టినను దుదకు నమృతముత్పన్నము కాకపోదు. కావున నీకార్యమును విజ్ఞులంగీకరింతురనియు బాసట యగుదురనియు నమ్ముచున్నాఁడను.

మఱియు నీగ్రంథమును ముద్రింపించుటలోఁ దగు సాహాయ్య మొసంగిన బ్ర॥ మ॥ రా॥ రా॥ పోతాప్రగ్గడ బ్రహ్మానందరావుగారు, మ॥ రా॥ రా॥ పురంచిన వేంకటనారాయణగారు, మ॥ రా॥ రా॥ నార్కెడమిల్లి శాస్త్రులుగారు మొదలగు మిత్రవరుల యెడ నెంతయుఁ గృతజ్ఞుఁడనగుచున్నాను.

శా॥ బ్ర॥

శ్రీరస్తు.

భాస్కరోదంతము.

ప్రథమభాగము.

శతాబ్దములలోనికెల్ల నీపందొమ్మిదవ శతాబ్దము మిక్కిలి విచిత్రమైనది. ఇందు ముందులేని తెలివి మనుజుల కెంతయో కల్గినది. ఇందదివఱకు గోచరములు కాని వానినిగూడఁగనిపెట్టు నద్భుతసామర్థ్యము మానవులకుఁ గలిగినది కావునఁ గడచిన శతాబ్దములన్నిటికంటె దీనినుత్తమమైనదానినిగాఁ బరిగణింపవలసి యున్నది. నరునకు నూతనముగాఁగలిగిన యీమహాద్భుతశక్తి మూలముగా నవాఙ్మానసగోచరములగు నద్భుతకార్యములు జరుగుచున్నవని చెప్పుటకెంతయు సంతోషముగానున్నది. మర్త్యులందు విమర్శజ్ఞానము హెచ్చుటచేఁ బదార్థములు మునుపున్న రీతిని నిలుచుటలేదు. ఒకటియని యిదివఱకుఁ బ్రజలనుకొనిన వస్తువిపుడు రెండగుచున్నది. ఇంతవఱకు భిన్నములనుకొనినవి యిప్పుడు ఒకటియగుచున్నవి. పెక్కులు అనంతములగు నద్భుతములు జరుగుచున్నవి, కాని యీశతాబ్దమహిమల నిట్లూరక వర్ణించుటవలనలాభములేదు ఈకనిపెట్టుటలలోఁ బెక్కులసత్యములుకూడ నుండి లోకమునకు హానినిగూడఁగలిగించుచున్నవని వివేకులందఱును నంగీకరించుచున్నారు. ఈకనిపెట్టుటలనువితర్కించి చూచినంగాని యేది సత్యమో, యేది యసత్యమో తేలుటలేదు, కావున నూతనముగా బయలువెడలు నుపజ్ఞములు విమర్శనార్హములై పెక్కులున్నవికాని, వానిలోమనము చేపట్టదగిన విషయము నొకదానిని విమర్శించి చూతము.

ఈకాలమహిమవలన నద్భుతమగు స్థితికివచ్చినవాఁడు రామాయణభాస్కరుఁడొకఁడు. ఈతఁడు మొన్నమొన్నటివఱకును నేకపదార్థముగానేయున్నాఁడు. ఇతని కిప్పటివఱకును "హాళక్కిభాస్కరుఁడు" అను నామము కలదు. ఇట్లిప్పటివఱకును సూక్ష్మపదార్థముగా నెంచఁబడుచువచ్చిన యీ "హాళక్కిభాస్కరుఁడు," లేనిపదార్థములఁ గనిపెట్టుసామర్థ్యము లోకమున హెచ్చిన తరువాత, పదార్థవి

మర్శనసామర్థ్యము అతిశయించినవెన్క, నాగరికత మితిమీఱినవెంట, స్థూలభూతముగాఁ గనిపెట్టఁబడినాఁడు. ఇప్పటి వివేకులలోఁ గొందఱీ పదార్థమును నిప్పుడు మంత్రి భాస్కరుఁడనియు, హుళక్కి భాస్కరుఁడనియు రెండు సూక్ష్మపదార్థములుగా విడఁదీయుచున్నారు. ఈవిభజనమును నిప్పటి వివేకులలో నొకరిద్దఱు చేసిరి, కాని యింకనొక యేవిమర్శకులును నీవిషయమును విమర్శించిచూచినట్లు కన్పడదు. ఇది పల్వురచే విమర్శించి స్థాపింపఁబడక యే శాస్త్రవిషయమై యాంధ్రలోకమునే శాస్త్రసిద్ధమైనట్లుగా నంగీకరింపఁబడుస్థితికి వచ్చుచున్నది. యథార్థము తఱచిచూచినంగాని తేలనేరదు. లోకమునకుఁ దెలియవలసినది యథార్థముగాని నూతనకల్పనామాత్రము కాదు. పూర్వపుటూహలలోను నిప్పటి యూహలలోనుఁ గాలమును బట్టి ప్రాశస్త్యము నీయక దేనియందు సత్యముండిన దాని నంగీకరించుట వివేకిలక్షణము. సత్యమును గనుగొనఁ బ్రయత్నించుట యుత్తమమగు మానవధర్మము. సత్యనిర్ధారణము, లోకమునకు లాభకరము నైయున్నది కావున సత్యమును గనుఁగొనుట యందలి యాసక్తి చేతను, భాషావిశేషములయందలి యభిరుచిచేతను, గప్పియే ఫలిగామి యన్యాయముగాన నెవరుకష్టపడి శ్రీమద్రామాయణమును దెనిఁగించి యాంధ్రలోకమునకు మహోపకారంబొనర్చిరో వారికి న్యాయముగాఁ దద్యశస్సు చెందుగాక యను తలంపుతోడను నీవిభజనముయొక్క యాథార్థ్యమును గనుఁగొనఁ బ్రయత్నింతము.

శ్రీమద్రామాయణమును దెనిఁగించిన కవులు నలుగురు. బాల కిష్కింధా సుందరకాండముల భాస్కరపుత్రుఁడైన మల్లికార్జునభట్టును, అయోధ్యాకాండమును కుమారరుద్రదేవుఁడును, అరణ్యకాండమును, యుద్ధకాండములోఁ గొంతభాగమును భాస్కరుఁడును, యుద్ధకాండములో మిగిలినభాగమును భాస్కరమిత్రుఁడగు నయ్యలార్యుఁడును విరచించినట్లు కాండాంతపద్యములవలనను, గద్యలవలనను దెలియవచ్చుచున్నది. లోకప్రతీతియు నిట్లేయున్నది. ఇట్లుండ నిప్పటివారు కొందఱు అరణ్యకాండమును వ్రాసినవాఁడు మంత్రిభాస్కరుఁడనియు, యుద్ధకాండములో మొదటిభాగమును వ్రాసినవాఁడు హుళక్కిభాస్కరుఁడనియు చెప్పుచున్నారు.

భాస్కరరామాయణమును, తత్కర్తలును పూర్వులు- ఇప్పటికి బహుశతాబ్దములనాటివారు. ఈవిభజనమును జేసినవారన్నో యిప్పటివారు. ఈనూతనవిభ

యనును మొదటివెలిగ్రక్కినది బహుజనపల్లి సీతారామాచార్యకృతమైన శబ్దరత్నాకరము నిఘంటువు. రెండవది రావుబహదర్ వీరేశలింగ కవికృతమగు కవులచరిత్రి. ఈనూతనగ్రంథములు పుట్టువఱకును నీభాస్కరుఁడొక్కఁడుగానే యున్నాఁడు. బహుకాలమునుండి యొక్కఁడుగానున్నవాఁడు నేఁడిద్దఱగుటచే సవిమర్శముగా నీవిషయమును తర్కించి చూడవలసిన యవసరము కలిగినది. ఈనఱకును నొక్కఁడేభాస్కరుఁడైనందులకు నేటివఱకునున్న గ్రంథములలోని కవి స్తుతులలో నొక్కభాస్కరుఁడుండుటయే నిదర్శనము, కావున నీరామాయణ కవియగు భాస్కరుఁడు హుళక్కి భాస్కరుఁడా? మంత్రిభాస్కరుఁడా? లేక యిద్దఱునునా? యను సారాంశముల నేర్పరచుకొని చక్కఁగా విషయ విమర్శనమును జేసి చూడఁగా హుళక్కిభాస్కరుఁడే యీరామాయణమును విరచించినట్లును, మంత్రిభాస్కరునికిని రామాయణమునకును నేవిధమగు సంబంధమును లేనట్లును సమస్త విధములఁ దెలుచున్నది. ఎట్లన :—

గ్రంథ దృష్టాంతము.

(1) ఈవిషయమున మొదటఁజూడవలసినది గ్రంథ దృష్టాంతము. అది హుళక్కిభాస్కరుని పక్షమునఁ బ్రబలసాక్ష్యమిచ్చుచున్నది. ఈతఁడురచించినట్లుగా రామాయణమే సాక్ష్యమిచ్చుచున్నది. ఇంతకన్న నేమిసాక్ష్యము కావలెను? రామాయణమునందు స్పష్టముగా "సకలసుకవిజనవినుత యశస్కర భాస్కరప్రణీతంబైన రామాయణము" అని వ్రాయఁబడి యున్నది. ఈగద్యమందు "భాస్కర" అని మాత్రమున్నది కాని "హుళక్కి" యను నుపపదము లేనప్పుడు ఈగద్యమువలన హుళక్కిభాస్కరుఁడు రామాయణమును విరచించినట్లుగా నెంచుటయెట్లు? అని ప్రతిపక్షులడుగుదురు, కాన సమాధానమును జెప్పెదము ఈగద్యమునందు భాస్కరుఁడెవరో విస్పష్టముగాఁ దెలుపఁబడకపోయినను నీరామాయణమునందే గల యీక్రింది యయ్యలార్యుని పద్యము దానిని స్పష్టము చేయుచున్నది.

చ॥ అమరహుళక్కి భాస్కరమ - హాకవిచెప్పగనున్న యుద్ధకాం
డము తరువాయిచెప్పె వික - టుప్రతిభాషణుఁడప్ప నార్యస
త్తమసుతుఁడయ్యలార్యుఁడుకృ - తస్థితి నార్యులు మెచ్చునట్లుగా
హిమకరతార భాస్కరమ - హీవలయుస్థిరలక్ష్మిచేకుఱన్.

అని రామాయణ కవులలో నొకఁడగు నయ్యలార్యుఁడు చెప్పియున్నాఁడు ఇట్లు రామాయణమే హుళక్కి భాస్కరునివిషయమై సాక్ష్యమిచ్చుచుండఁగా నింక సందేహింపవలసిన యవసరమే కాన్పించుటలేదు, కాని యీపద్యమునందు "హుళక్కిభాస్కరమహాకవి చెప్పఁగనున్న యుద్ధకాండము తరువాయి" యనియుండుట, నీభాస్కరుఁడు యుద్ధకాండమును మాత్రము వ్రాసెనని ప్రతిపక్షులు పూరమాలోచింపక తలంచుచున్నారు. ఆతలంపు న్యాయమైనదికాదు. ఈవాక్యము యుద్ధకాండమునకును, హుళక్కి భాస్కరునికిని గల సంబంధమును నిష్కర్షగాఁ జెప్పుచున్న మాటసత్యమేకాని యీభాస్కరుఁడొక్కయుద్ధకాండమునుమాత్రమే విరచించెనని చెప్పుటలేదు; కానఁ దక్కినకాండములవిషయమై యీభాస్కరునకు సంబంధముకలదా లేదాయని చర్చించుటలో నీపద్యము కొంతయీభాస్కరునివిషయములో సహాయమొనరించుచున్నది ఎట్లన:—ఆరణ్యకాండాంతముననున్న గద్యములో "భాస్కర" యనిమాత్రమే యున్నట్లె, బాల, కిష్కింధా, సుందర కాండాంత గద్యములలో "భాస్కరసత్కవిపుత్ర" యనియు యుద్ధకాండాంతగద్యములో "భాస్కరసత్కవిమిత్ర" యనియు నొక "భాస్కర" శబ్దము కాన్పించుచున్నది. వీనియందును నుపపదమేదియును లేదు. ఇట్లుండఁగాఁ బైపద్యము నాధారము చేసికొని యీభాస్కరుఁడు హుళక్కి భాస్కరుఁడని ప్రతిపక్షులే నిశ్చయించుకొని మల్లికార్జునభట్టు హుళక్కి భాస్కరుని పుత్రుఁడైనట్లును నయ్యలార్యుఁడు తన్మిత్రుఁడైనట్లును వాకొనుచున్నారు. ఈపద్యము ఆరణ్యకాండమునకు నీవలనున్న బాలకాండాంతమందలి భాస్కరుఁడు హుళక్కి భాస్కరుఁడనియు, నావలనున్న కిష్కింధా, సుందరకాండావసానమందలిభాస్కరుఁడు హుళక్కిభాస్కరుఁడేయనియు తెల్పుచుండగా నడుమనున్న యారణ్యకాండము తుదినున్న భాస్కరుఁడీ హుళక్కి భాస్కరుఁడే యనిన మిక్కిలి సమంజసముగానుండును. అయినను బ్రతిపక్షులుకొన్ని కారణాభాసములనుజూపి యిట్లధిక సంబంధముగల హుళక్కిభాస్కరుని లాగివైచి సంబంధము లేశమును లేని మంత్రిభాస్కరుని దెచ్చి యారణ్యకాండ భాస్కరునిగా నొనరించుచున్నారు. ఈసాహసమునకు వారికిఁగల కారణాభాసములీక్రిందివై యున్నవి.

(౧) పైపద్యములో హుళక్కిభాస్కరుఁడు యుద్ధకాండమును జెప్పెననియుండుటయే కాని యారణ్యకాండమును రచించెననియుండకుండుట.

(b) ఆరణ్యకాండాంత గద్యములలో "సకలసుకవిజనవినుత యశస్కర భాస్కర" అని యుండఁగాఁ దక్కిన కాండాంత గద్యములలో "అష్టభాషా కవి మిత్త్రభాస్కరసత్కవిపుత్త్ర" ల్యాదులుండుట, అనఁగా గద్యలందు భేదముండుట.

(c) భాస్కరునికి సకల సుకవి జన వినుతుండను విశేషణముండుట.

(d) ఆరణ్యకాండము తక్కిన కాండములవలెఁగాక యాశ్వాసములఁగలిగి యుండుట.

(e) ఆరణ్యకాండ కవిత్వమునకును, దక్కిన కవిత్వములకును భేదముండుట.

(f) ఆద్యంతపద్యముల విషయములోఁ దక్కిన కాండములకును నారణ్యకాండమునకును భేదముండుట.

(g) తిక్కనసోమయాజి తనతాతయగు మంత్త్రిభాస్కరుఁడు కవియని తెల్పుట, తానుత్తర రామాయణమును వ్రాయుట.

ఈయేడు కారణములనుబట్టి ప్రతిపక్షులు ఆరణ్యకాండమును మంత్త్రిభాస్కరుని పరముచేయుచున్నారు కావున ముందు వీని బలాబలములను చర్చింతము.

(a) ఇది కారణాభాసమే కాని సత్కారణ మెంతమాత్రమును గాదు. ఏలయన:—అయ్యలార్యుఁడు, హుళక్కిభాస్కరుఁడు యుద్ధకాండమునుమాత్రమే వ్రాసెనని చెప్పలేదు. అతఁడు యుద్ధకాండమును మాత్రమే వ్రాయుటచేత నయ్యలార్యుఁడిట్లు చెప్పినాఁడనుటకాధారమేవియును లేవు. పైఁగాఁ దాను భాస్కరుఁడు వ్రాయఁగా మిగిలిన యుద్ధకాండమును మాత్రమే చేసియుండుటచేత యుద్ధకాండము మాటమాత్రమె అతఁడు చెప్పినట్లు తలఁచుట యెంతయో న్యాయముగానున్నది కావున నితర కాండములందలి భాస్కరుని హుళక్కి భాస్కరునిగా నెంచినట్లే యారణ్యకాండమునందలి భాస్కరునిఁగూడ సామీప్య సంబంధము చేత నాహుళక్కిభాస్కరుఁడే యనుట యెంతయుచితమో చదువరులే యూహించుకొనవలయును. మఱియొక ప్రబలకారణమేదియును లేకయే యత్యంతసంబంధముగల యీభాస్కరునికిఁ గల హక్కును ద్రోసివేయరాదు. అట్టికారణమేదియును లేదు. మఱియొకరుగాని మంత్త్రిభాస్కరుఁడుగాని యాకాండమును రచించినట్లెచటను విస్పష్టముగాఁ గాని, సూచనముగాఁ గాని చెప్పఁబడియుండలేదు. ప్రతిపక్షుల విమర్శనకాలమునుబట్టి చూచిన హుళక్కి భాస్కరుఁడు మల్లికార్జున భట్టారకుని తండ్రియనియు నయ్యలార్యుని మిత్త్రుఁడనియును గూడ పలుకుటకుపపత్తి లేకపోవును. ఏలయన నయ్యా

లార్యుఁడు పద్యములో హుళక్కి భాస్కరుఁడు తనమిత్రుఁడని చెప్పలేదు. యుద్ధకాండము పూర్వభాగమును జెప్పిన హుళక్కి భాస్కరుఁడు మహాకవియని నుడివి తన మిత్రుఁడు ‘‘సుకవి’’ యని పలికినాఁడు; కావున యుద్ధకాండమును వక్కాణించిన మహాకవియగు హుళక్కి భాస్కరుఁడు వేఱియు, సుకవియగు తనమిత్రుఁడు వేఱనియు నూహింపవలసినది. అట్లూహింపక యయ్యలార్యుని మిత్రుఁడైన భాస్కరుఁడు హుళక్కి భాస్కరుఁడేయని పైపద్యమునుబట్టి ప్రతివాదులే యంగీకరించుచున్నారు. అట్లంగీకరించినప్పుడు ఆరణ్యకాండము విషయములో మఱియొకలాగున తలంచుటకవసరములేదు. దానికుండినఁ దక్కిన కాండములవిషయమునను పై కారణమును బట్టి మఱియొకలాగున నెంచవలసియుండును. ఇది న్యాయము కానియట్లైన యదియును న్యాయము కాదని చదువరులు గ్రహింపవలయును. కాన నీవిషయము హుళక్కి భాస్కరునికే యుపబలముగానున్నది.

(b) గద్యలందు భేదముండుటచే నారణ్యకాండ భాస్కరుఁడు యుద్ధకాండభాస్కరునికంటె భిన్నుఁడని తలఁచెదమనుట యతిసాహసవాక్యము. ఏలనన నారణ్యకాండమునందుఁ దక్క తక్కినచోట్ల భాస్కరుని గద్యలే లేవు. ఆరణ్యకాండాంతమున నొక భాస్కర గద్యమును, మఱియొక కాండమునందు వేఱొక భాస్కర గద్యమును నుండెనేని దానికిని దీనికిని భేదముకనుపట్టినచో నప్పుడా యుభయభాస్కరులును వేఱనిన బాగుండునుగాని యిక్కడనదిలేదు కాఁబట్టి యట్లు తలంచుటకువీలులేదు. తక్కిన కాండాంతములనున్న గద్యలు ఏ భాస్కరునివియును గావు. ఈ భాస్కరునివనినను, నా భాస్కరునివనినను నొక్కయారణ్యకాండమునందున్నవే. విషయమిట్లుండ గద్యములందు భేదమున్నను భాగవతమును విరచించిన పోతనయు, వీరభద్రవిజయమును విరచించిన పోతనయు నొక్కరని తలఁచిన కవులచరిత్ర, గద్యములందుఁ దలిదండ్రుల దగ్గఱ నుండియు భేదమున్నను వసుచరిత్రమును విరచించిన భట్టుమూర్తియును, నరసభూపాలీయమును నిర్మించిన మూర్తికవియు నొక్కరని యూహించిన కవుల చరిత్ర, తండ్రి గద్యమునకును, కొడుకు గద్యమునకునుగల భేదములనుబట్టి భాస్కరులిద్దఱని తలఁచుట యతిసాహసమనుటకు సందియము లేదు. చదువరులారా! యీవింతనుజూడుఁడు! మల్లికార్జునభట్టు గద్యయందు ‘‘అష్టభాషాకవిమిత్ర భాస్కర సత్కవిపుత్ర’’ యని యుండుటచేత హుళక్కి భాస్కరు

ని గద్యము అష్టభాషాకవి మిత్రేత్యాదియే కాని యారణ్యకాండమందున్నట్లు సకల సుకవిజన వినుతేత్యాది కాదంటు! ఆహా! యేమి యీతెలివి! ఇది కేవల మవిమృశ్యకారిత్వము. "అష్టభాషాకవిమిత్ర భాస్కర సత్కవి పుత్ర" అనినపుడు "అష్టభాషాకవిమిత్ర" అను విశేషణము భాస్కరపుత్రునితో నన్వయించుట న్యాయము కాని భాస్కరునకాకాంక్షించుట గద్య రచనా క్రమవిరుద్ధము. మనవారు తరుచుగా గద్యలలో నంత్యనియమమునకొఱకుఁ జూచుచుందురు. కావుననే "యశస్కర భాస్కర" అనియు "విధేయ తిక్కన నామధేయ" "విరాజి తిక్కన సోమయాజి" యనియు నీవిధముగా మన కవులు వ్రాయుచుందురు. అట్లే మల్లికార్జున భట్టును అయ్యలార్యుఁడును నంత్యనియమమందలి యభిలాషచే మొదటి యాతఁడు "భాస్కరసత్కవిపుత్ర" అనివ్రాయఁదలఁచినాఁడు కాఁబట్టి "అష్టభాషాకవిమిత్ర" అనియు, రెండవయాతఁడు "భాస్కర సత్కవిమిత్ర" యని వ్రాయుచు "అష్టభాషాకవిమిత్ర" అనియు పుత్రమిత్రల యంత్యనియమముకొఱకై 'మిత్ర' యని తమగద్యములందుపాడుకొనిరి "కొమ్మనామాత్యపుత్ర" అని వ్రాసికొనుచు నంత్యనియమముకొఱకై "ఉభయకవిమిత్ర" అని తిక్కన యెట్లు వ్రాసికొనినాఁడో యట్లే భాస్కరపుత్రుఁడగు మల్లికార్జునభట్టును వ్రాసికొనెను. ఈరెండుగద్యలను నొకచోటనిడి చూతుముఁగదా?.

ఉభయ కవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర (తిక్కనది.)

అష్టభాషాకవిమిత్ర భాస్కర సత్కవి పుత్ర (మల్లికార్జునభట్టుది.)

ఈరెండు గద్యములును నొక్కవిధముగానున్నవని బాలుఁడైనను జెప్పఁగలఁడుగదా ?. ఇఁక రెండవదానినిబట్టి "అష్టభాషాకవిమిత్ర" అనునది భాస్కరుని విశేషణమగునెడల మొదటి దానినిబట్టి "ఉభయకవిమిత్ర" అనునది కొమ్మనామాత్యునిదని నిస్సందేహముగాఁ జెప్పవలయును. కొమ్మనయు, నొక గ్రంథమును విరచించినట్లు గాఁగవుల చరిత్రనుడువుచున్నది కాఁబట్టి యాగ్రంథమునందుఁగొమ్మన గద్యమిట్లుండునని యూహింపఁదగియున్నది. ఎట్లన- ఉభయ కవిమిత్ర భాస్కరమంత్రిపుత్ర అని, మరల నీకొడుకగు కొమ్మన గద్యవలనఁ దండ్రియగు మంత్రిభాస్కరుని గద్య "ఉభయకవిమిత్రే" త్యాది యైనట్లూహించుటుప పన్నమైయున్నది కాఁబట్టి సకలసుకవిజనవినుతేత్యాది గద్యము మంత్రిభాస్కరునిదని చెప్పటకును

ననుపు గాదు. ప్రతిపక్షులే యుక్తిరాజమును చెప్పి హుళక్కి భాస్కరుని పని హుళిక్కి చేయఁజూచిరో దానినిబట్టియే మంత్రిభాస్కరుని పనియు హుళిక్కియే యైనది. ఏలయున, పుత్రుని గద్యమునుబట్టి హుళక్కి భాస్కరుని గద్య అష్టభాషా కవిమిత్రేత్యాదియని యూహించినచోఁ బౌత్రునిగద్యనుబట్టి మంత్రిభాస్కరునిగద్య ఉభయకవిమిత్రేత్యాదియైనట్లు గాఁదేలి సకలసుకవిజనవినుతయశస్కరుఁడగు భాస్కరుఁడు భయులును గూడఁ గాకుండుట తటస్థమైనది ఒకనిగద్యమును తత్పుత్రమిత్రాదుల గద్యలనుబట్టి యూహింపవలసియున్నయెడల నుభయపక్షములకును గూడ భంగము తటస్థించినది. అట్లుకానిచో సకలసుకవిజనవినుతేత్యాది హుళక్కి భాస్కరుని దైనట్లును, అష్టభాషా కవిమిత్రేత్యాది మల్లికార్జునభట్టుదైనట్లును తలఁచుటకెంతయు నభ్యంతరము లేదు. ఇదియే గద్యల నన్వయించురీతి. ఉభయకవిమిత్త్రుఁడు తిక్కనయే కాని కొమ్మన కాఁడని ప్రతిపక్షులే యంగీకరించినారు. కావున నీవిషయమున హుళక్కిభాస్కరుని కేవిధమగు నష్టమును లేదు. మంత్రిభాస్కరునికి లాభమును లేదు.

(c) ఆరణ్యకాండ గద్యములో భాస్కరునికి "సకలసుకవిజన వినుతుఁడ" ను విశేషణముండుటచే నాతఁడు మంత్రిభాస్కరుఁడే కాని హుళక్కి భాస్కరుఁడు కాఁడని కవుల చరిత్ర వక్కాణించుచున్నది. ఇది సాహసాతిసాహస వాక్యము. అజ్ఞునకైనను నుడువరాని యీపలుకు కవులచరిత్ర పలుకుట చూడఁగా వింతగానున్నది. సకలసుకవిజన వినుత యశస్కరుఁడు మంత్రిభాస్కరుఁడే కాని హుళక్కిభాస్కరుఁడు కాఁడఁట! ఏమి యీచిత్రము! ఈవాక్య రత్నమును లిఖించిన కవుల చరిత్ర, యిప్పుడే కాక నాఁడు భాస్కరుని కాలములోఁగూడ నున్నదని తోఁచుచున్నది. లేకున్న నేయాధారమును లేకయే యశస్కరుఁడు మంత్రిభాస్కరుఁడుగాని హుళక్కిభాస్కరుఁడు కాఁడని యంత నిష్కృష్టముగా నుడువఁగలదా! ఇటులపలుకుట కేమి కారణము? మంత్రిభాస్కరుని కీర్తినిగూర్చిన పద్యములుండుటనా? ఉండుఁగాక, మంత్రిభాస్కరుఁడు యశస్సుకలవాఁడైన హుళక్కిభాస్కరుఁడు కాఁగూడదని రాజాజ్ఞ కలదా! మంత్రిభాస్కరునిగూర్చి వేలకొలఁది స్తుతిపాఠములుండిన నుండుగాక, వానిచే మంత్రిభాస్కరుఁడు గొప్పకీర్తికలవాఁడని మనము తలఁపవచ్చునుగాని హుళక్కి భాస్కరునికి యశస్సు లేదనుటకు మనకెక్కడనధికారమున్నది?. రాయన భాస్కరుని గూర్చిన పద్యములుండి హుళక్కిభాస్కరునిగూర్చిన పద్యములావిధమైనవి లేవు కావున మొదటియాతఁడు యశస్కరుఁడ

నియు రెండవ యాతఁడు కాఁడనియు, దలఁచితిమందురా? అట్లయిన రాయనభాస్కరుని విషయముననున్న స్తుతిపాఠములవంటి స్తుతులు ఏమహాకవి విషయమునను లేవు కావున కవులందఱును గీర్తిలేనివారనియే చెప్పవలసివచ్చును. మఱియు శ్రీనాథుఁడు “నిర్వంచిత కీర్తివైభవవిరాజి తిక్కన సోమయాజి” యని చెప్పియున్నాఁడు ఇట్టికీర్తిగల తిక్కన యెవరు? అనిన మన ప్రతిపక్షులు చెప్పు యుక్తులనుబట్టి చూచినఁ గవితిక్కన కాఁడనవలయును. “సుకవి జనులచేత నుతిపొందిన వాఁడు రణతిక్కఁడుగాని కవితిక్కఁడు కాఁడు. రణతిక్కన స్తుతించిన పద్యమొకటి యిందుఁబ్రచురించుచున్నాఁడను :—

చ॥ గరళపు ముద్దగోహమవ - గాఢమహాశనికోట్లు సమ్మెటల్
హరునయనాగ్ని కొలిమి యురవ - గాధిపు కోదలుపట్టు కాలుఁడా
క్కురటిశిరంబు డాయి, లయ - కాలుఁడు కమ్మరి వైరివీరసం
హరణ గుణాభిరాముఁడగు - మైలమతిక్కన ఖడ్గసృష్టికిన్.

భీమనచాటుధార.

రణతిక్కని స్తుతిపాఠములు లెక్కకు మిక్కిలిగాఁగలవు గాని గ్రంథ విస్తర భీతిచే వానినిచట వ్రాయుటమానెదను” అని మనమెవరైన వ్రాసిన ప్రతిపక్షులంగీకరింపవలసినదే కదా! ఇదియెట్లు న్యాయముకాదో యట్లే రాయన భాస్కరుని స్తుతిపాఠములఁజూపి హుళక్కిభాస్కరుఁడు యశస్కరుఁడు కాఁడనుట యుక్తియుక్తము కాదు. హుళక్కిభాస్కరుఁడపయశస్సు కలవాఁడని గాని యశస్సు లేనివాఁడని గాని యెచటనైన వ్రాయఁబడిన నతఁడు యశస్కరుఁడు కాఁడనిన ననవచ్చునే. మోకాని యూరకయిట్లు కవివరుఁడైన మహనీయుని యశస్సులేనివాఁడని వివేకింపక పలుకవచ్చునా? లేక యశస్సు కలవాఁడేయైనను సకల సుకవులును వినుతించియుండలేదందురా? మంత్రిభాస్కరునిమాత్ర మొక్కఁడైనఁ దప్పిపోకుండ నందఱు కవులును స్తుతించిరని మీరు చెప్పఁగలరా? ఇంతయేల ఇది యనాలోచన పూర్వకముగా వ్రాసిన వెఱ్ఱివ్రాత న్యాయముచే మొదట నీవిషయమున సకలసుకవి జనవినుత యశస్కరుఁడు హుళక్కిభాస్కరుఁడా? మంత్రిభాస్కరుఁడా? యని ప్రశ్న వేసికొనుటయే తప్పు. ఏలనన నీవిషయము కవితానుస్వయముగా వ్రాసికొనినదికాని యొరులు వ్రాసినది కాదు. పరులెవరైన సకలసుకవిజనవినుతుఁడైన భాస్కరుఁడు రామాయణమును రచించెననిన నట్టి యశస్సుగల భాస్కరుఁడెవరని మనము వితర్కించు

కొనవచ్చును. స్వయముగాఁ గవి వ్రాసికొనిన యిట్టివాక్యములను మనము విమర్శింపఁజనము. లోకమునఁ బ్రతిమనుజుఁడును బరులకెట్టివాఁడుగాఁ గాన్పించినను దనకుఁదాను మంచివాఁడే యగును గదా? అటులకాదు, కవి వివేకియై యుండును గాన నిజముగాఁదనకు విశేషమైన యశస్సుండినంగాని యటులవ్రాసికొనఁడనియు నట్టియశస్సు ఏభాస్కరునికుండిన నాభాస్కరుఁడే యారణ్య కాండమును వ్రాసెననియు నెంచెదమందురా? మంచిది, అట్లేయగునుగాక, అట్లయినను హుళక్కిభాస్కరుఁడే యీపదమునకు న్యాయమగు "హక్కు" కలవాఁడైయుండును. ఇట హుళక్కి భాస్కరుని యశస్సుమాట కొంతసేపటుంచి ముందుగా నీఘనుని గాదని మనప్రతిపక్షులు మంత్రిభాస్కరు నీవిషయములో ముందిడిరి కావున నాతని కీర్తిని గూర్చి చర్చింతము.

మంత్రి భాస్కరుఁడు సకలసుకవిజనవినుత యశస్కరుఁడని చెప్పుటకై ప్రతిపక్షులు, ఈక్రింది రావిపాటి తిప్పరాజు పద్యము నుదాహరణముగా నిచ్చిరి.

మ॥ సరిబేసైరిపుడేల? భాస్కరులు భాషానాథ పుత్రా వసుం
ధరయందొక్కఁడు మంత్రియయ్యె నినుకొండన్రాయయామాత్యభా
స్కరుఁడో యా నయినన్ సహస్రకర శాఖల్లేవచే యున్నచే
తిరమై దానము చేయుచో రిపులహేతిన్వ్రేయుచో వ్రాయుచోన్.

కంటిరా! హుళక్కిభాస్కరుఁడు యశస్సుకలవాఁడు కాఁడనియు మంత్రి భాస్కరుఁడే యీసకలసుకవిజన వినుత యశస్కరత్వమునకు మూర్ధాభిషిక్తుఁడనియు మనప్రతిపక్షులు వ్రాయుటకుముఖ్యాధారములిట్టిబూతుపలుకులఁట! పోనీఁ, బోలు, అవుగాక బ్రహ్ములచే విశేషముగాఁ బొగడ్తనుగన్న యీరాయన భాస్కరుని యశస్సునుగూర్చి నేనేమియు సందేహింపను. అతఁడు మంచి యశస్సు కలవాఁడనుటకు సందియమించుకయును లేదు. కాని యిదియేవిషయమున వచ్చిన యశస్సు? దాతృత్వ విషయమున; వితరణమున రాయన భాస్కరుఁడు మిక్కిలి ప్రసిద్ధికెక్కెనుగాని ప్రస్తుతవిషయములోనిట్టిప్రఖ్యాతియా చూచుకొనవలసినది? ఒక కవి గ్రంథమును వ్రాయుచు దాను సకలసుకవి నుతుఁడనని యందు వ్రాసికొనిన నది కవిత్వ విషయమగు యశస్సు కావలయును గాని యన్యమగునా? నన్నపార్యుఁడు తనగద్యములో సకల సుకవిజన వినుతుఁడనని వ్రాసికొనెను గదా? దానినిబట్టి యాతఁడు గుడులను, గోపురములను గట్టించియో మఱియే యితరకార్యమును జేసియో

కీర్తిని సంపాదించెనని చెప్పవలసినదే నా? అట్లైకాని కీర్తి రాదా? ఇటు పల్వుర తలలు నఱకుటవలన వచ్చిన యశస్సును సొమ్ము వమ్ము చేయుటవలన వచ్చినకీర్తియు నా చూచుకొనవలసినవి? ఎంతమాత్రమును గావు; అట్లనుటవలనఁ గొంత హానికూడఁ గలదు. దాతృత్వవిషయకమగు యశస్సును దాత తాను స్వయముగాఁ జెప్పుకొనవలసినది కాదు, అట్లెన్నఁడును నెవ్వరును జెప్పుకొనరు. కుడిచేతి దాతృత్వ మెడమచేతికైనను దెలియరాదని మనవారందురు. దీనిభావమును జదువరులు చక్కఁగా గ్రహింతురుగాక. ప్రజ్ఞావిషయకమగు ప్రసిద్ధి యట్టిదికాదు. దానిని జెప్పుకొనవచ్చును, అందులోఁ గవిత్వ సంబంధమగు కీర్తిని గవులు తామే వర్ణించుకొనుట లోకమునఁ దరచుగాఁ గలదు. కావున ప్రస్తుతము వివాదములోనున్న యశస్సు కవిత్వవిషయకమైనది కాని దాతృత్వ సంబంధమైనది కాదు. రాయని భాస్కరుఁ డీవికెఁ బ్రసిద్ధికెక్కెనే కాని కవిత్వమునకెంతమాత్రమును గాదు.

అదియటుండఁ, నెందులకుఁ బేరువడినను రాయని భాస్కరుఁడు మంత్రిభాస్కరుఁడు కాఁడు. ఇక నాతఁడెట్టివాఁడైన నేమిలాభము. మన ప్రతిపక్షులు మంత్రిభాస్కరుఁడు మిక్కిలి ఖ్యాతికలవాఁడని తెల్పుటకై యాతనిని రాయనభాస్కరులోఁ బరకాయప్రవేశము చేయించిరి! ఆహా! పందొమ్మిదవ శతాబ్ద మహిమ! దానికేమి, మంత్రిభాస్కరుఁడు రాయని భాస్కరుఁడు కాఁడనుటకుఁ గల కారణముల నీక్రిందవివరించి చదువరుల సందియముల నివారింతము.

రాయన, మంత్రిభాస్కరుల భేదము.

కులము.

మంత్రిభాస్కరుఁ డాంధ్రనియోగిక బ్రాహ్మణుఁడు. తత్సంతతివారిప్పటికిని కృష్ణామండలములోని పాతూరునందుఁ గలరు. వారాఱువేలనియోగులతో సంబంధముకలవారై యున్నారు.

రాయనభాస్కరుఁడు :— నందవరీక నియోగి బ్రాహ్మణుఁడు. సునందాపరిణయమును రచించిన చింతకుంట కోదండరామకవి యీభాస్కరుఁడు తన వంశములోనివాఁడని యీరీతిగా వర్ణించినాఁడు :—

సీ॥ ఘనతరాచార్య దీక్షాకల్పితానల్ప కరనిబద్ధసువర్ణకంకణుండు
ఆసేతుశీతనగాంతర రాట్సభామధ్య విశ్రుతకీర్తిమండలుండు
కొండపల్లివినుకొండ దుర్గద్వయీదేశ ప్రజావనధియుతుండు
సకలావనీపక సంతానయాచిత వస్తుప్రదాన ప్రవర్తనుండు

గీ॥ అన్నవేమమహీశ కృత్యాగ్రహార । మదకలాందోళికాశ్వ సన్మణి విశేష
భూషణాద్యష్టభూతివిభూషితుండు । భాను తేజుండు రాయనభాస్కరుండు.

ఈపద్యమునుబట్టి రాయనభాస్కరుఁడెందులకుఁ బ్రసిద్ధికెక్కెనో యేశాఖ వాఁడో స్పష్టముగాఁ దెలియఁగలదు. కోదండరామకవి నంవవరికుఁడుకావున రాయనభాస్కరుఁడును నావంశమువాఁడేయని యొఱుంగునది.

గృ హ నా మ ము.

మంత్రిభాస్కరుని యింటిపేరు కొత్తరువువారు లేక గుంటూరివారు.

రాయన భాస్కరు నింటిపేరు రాయనవారు.

వా స స్థ ల ము.

మంత్రిభాస్కరుని వాసస్థలము గుంటూరు.

రాయని భాస్కరుని వాసము వినుకొండయందు. ఈతఁడు గుంటూరునందుండినట్లు గాని, యచట నుద్యోగము చేసినట్లు గాని చెప్పుటకేయాధారములును లేవు.

సం తా న ము.

మంత్రిభాస్కరుని కుమారుఁడు కొమ్మన, మనుమఁడు తిక్కన.

రాయనభాస్కరుని పుత్రుఁడు కొండన పౌత్రుఁడు రామలింగన్న.

కవులచరిత్ర కొమ్మన్ననే కొండన్నయందురని సాహసించి పలుకుచున్నదికాని యదివిశ్వాసార్హమైన పలుకుగాదు. ఏలయన, "కొమ్మన, కొండన" శబ్దములందు "బాదరాయణ సంబంధము" గా "కొమ్" ఒకటి సంబంధించి యున్నను నీరెండుశబ్దములును వ్యుత్పత్తిచేతఁ గాని, యర్థముచేతఁగాని యొకటికావు "కొమ్మన్న" "కూర్మన్న" శబ్దభవమైన తద్భవ శబ్దము. తాఁబేలర్థము "కొండన్న" యనుశబ్దము కేవలమును దేశ్యపదము. పర్వతమర్థము. ఉచ్చారణము చేతఁ జూచినను కొండ, కొమ్మ శబ్దములందలి 'డ' కార 'మ' కారములు సంబంధము లేని యక్షరములు కావున "కొమ్మన్న" ను "కొండన్న" యనుట పొసఁగనేరదు. ఒకటి రెండక్షరముల సంబంధమున్నంత మాత్రమున, నేయాధారమును లేకయే వారిని వీరందురనుట న్యాయము కాదు. ఈవఱకును బ్రచురింపఁబడియున్న గ్రంథములలోఁ దిక్కన సోమయాజితో సంబంధించినంతవఱకును నాశబ్దము "కొమ్మన" గానే వాడఁబడుచున్నది. రాయని భాస్కరునితో సంబంధము గల

యీశబ్దము "కొండన" గానే వ్రాయఁబడి యున్నది. తిక్కన సోమయాజికి సంబంధించిన "కొమ్మన" లనుగూర్చిన పద్యములలో "నెమ్మితోఁ నతనికి కొమ్మఘనుఁడు" అని చెప్పఁబడియుండుటచేత నీకొమ్మనను గొండన యనుటకు వీలులేదు. అట్లనిన యతిభ్రంశము కలిగి పద్యము చెడును. అట్లే రాయన భాస్కరుని "కొండన" ను గూర్చిన పద్యములలో "దండి భాస్కరుసూతి కొండమంత్రి" యనివి రచింపఁబడియుండుటచేత నీకొండనను గొమ్మన యనుటకును వీలు లేదు. అట్లనిన నిచటనుగూడ యతిచెడి పద్యము పాడగును కావున తిక్కన సోమయాజికి సంబంధించిన వారందఱును "కొమ్మన" లనియు రాయన భాస్కరునికి సంబంధించినవా రందఱు కొండనలనియు గ్రహింపవలెను.

స్థితిగతులు.

మంత్రిభాస్కరుఁడు గుంటూరి విభుఁడును, గవియు నైయున్నాఁడు.

రాయన భాస్కరుఁడు వినుకొండ రాజ్యమున మంత్రియు, గొప్పదాతయు నైయున్నాఁడు. ఈతని వంశమంతయు నౌదార్యమునకు మిగుల బ్రసిద్ధికెక్కినది. ఈ విషయమును దెల్పుపద్యముల నేకములున్నను గ్రంథవిస్తరభీతిచే ముప్పదియిద్దఱు మంత్రులపద్యమును మాత్ర మిందున కుదాహరణముగా నిచ్చెదను.

సీ॥ కవులిచ్చి భూపతి గాచి పట్టుగ నిల్పె బ్రజలకై రాయన భాస్కరుండు
వరదాతయై మణీవలయముల్ కవికిచ్చె దండి భాస్కరుసూతి కొండమంత్రి
భాస్కరువలెఁ గీర్తిఁ బడసెఁ దత్పుత్రుఁడౌ ఘనరామలింగభాస్కరుఁ డొకండు.

మంత్రిభాస్కరుని వంశమిట్టిదని తెల్పుటకాధారము లేవియును లేవు. తిక్కన తన తాతను, దండ్రిని వర్ణించుకొనియునుగూడ వారు దాతలని నుడువ లేదు. ఇట్లే రాయన భాస్కరుఁడు కవియనుటకును నాధారము లేవియు లేవు.

కాలము.

మంత్రిభాస్కరుఁడు తిక్కనసోమయాజికి తాతగాన నిప్పటికేడెనిమిది వందల యేండ్లనాటివాఁడు. పదునొకండవ శతాబ్దాంతమందును, పండ్రెండవ శతాబ్దాదియందును నున్నవాఁడు.

రాయన భాస్కరుఁడు :—పైనుదాహరింపఁబడిన పద్యమునుబట్టి యీతఁడనవేమక్ష్మాధీశుని కాలమువాఁడని తెలియవచ్చుచున్నది. అనవేమారెడ్డి హూణశకము 1340 మొదలుకొని 1366 వఱకును రాజ్యము చేసినట్లు కవులచరిత్రయే నుడువు

చున్నది. కొందఱీతఁడు కృష్ణదేవరాయల కాలమువాఁడని చెప్పుచున్నారు. ఎట్లు చూచినను నితఁడు మంత్రిభాస్కరునికంటె రెండు మూడు వందల సంవత్సరములి టీవలివాఁడైయున్నాఁడు.

ఇట్టిభేదముగల మంత్రిభాస్కర, రాయనభాస్కరుల నిద్దఱిని నొకటిచేయ ప్రయత్నించు కవులచరిత్ర మహిమ నేమని పొగడవలయునో, యీపందొమ్మిదవశతాబ్దము నేమని వర్ణింపవలయునో, చదువరులే నిశ్చయింప వలయును. దానికేమి, పైదానినిబట్టి రాయన భాస్కరుఁడు మంత్రిభాస్కరుఁడు కాఁడని విస్పష్టముగాఁ దెలిసినది కాఁబట్టి మంత్రిభాస్కరుఁడు మిక్కిలి యశస్సుకలవాఁడని తెల్పుటకుఁగల యాధారమూడి ప్రతిపక్షులమాట నీటిలోని మూటయైపోయినది. పైఁగా సకల సుకవిజనవినుత యశస్కరుఁడు కాఁడని తెల్పుటకుఁగూడ సందు దొరుకుచున్నది. ప్రస్తుత విషయములోఁ గవిత్వవిషయకమగు యశస్సు ప్రధానమని చెప్పియున్నాను గదా? అట్టిఖ్యాతి యీతనికిఁ గలదా యన లేదనవలసి యున్నది కాని యున్నదనుట కవకాశము లేదు. ఏలయన, అతిపూజనీయమై యాదిమహాకావ్యమగు శ్రీమద్రామాయణమును దిక్కనకుఁబూర్వమే మంత్రిభాస్కరుఁడు ఆంధ్రీకరించి యున్న యెడల, నతఁడు మహాకీర్తిశాలియైన యెడల, అది పదుమూఁడవ శతాబ్ద మధ్యమునకుఁ బూర్వమే తెనిగింపఁబడియున్న యెడల, పదుమూఁడవ శతాబ్దము మొదలుకొని యున్న కవులీకవిని స్తుతింపకుండుటకుఁ గారణమేమి? పదునేనవ శతాబ్దమువఱకున్నకవులెవ్వరును నీభాస్కరుఁ బొగడియుండ లేదేమి? రెండు మూఁడు శతాబ్దములవఱకు నీభాస్కరుఁడు అంధకార నిమగ్నుఁడైయుండుట యెట్లు సంభవించెను? ఇతర కవులందఱిమాటయటుండ తిక్కనకుఁ బుత్రుఁడో పుత్రతుల్యుఁడగు శిష్యుఁడోయైయున్న మారన యైనను నన్నప తిక్కనలను మాత్రము స్తుతించి యూరకుండెనేమి? ఇవి యన్నియు నాలోచించి చూడఁగా మంత్రి భాస్కరుఁడు ప్రసిద్ధకవి కాఁడనియే చెప్పవలసియుండును. ఈతఁడు వినుతుఁడేయైన యెడల, తిక్కన, యఱ్ఱనాదుల వినుతించిన కవులీతని నేల స్తుతింపరైరి.

ఇఁక హుళక్కి భాస్కరుఁడన్ననో సుకవిజనవినుత యశస్కరుఁడనుటకుఁ బెక్కు కారణములు కలవు. ఇతఁడు తిక్కనకుఁ దరువాతివాఁడు గాని పూర్వుఁడు కాఁడు. ఈమహాకవి పదుమూఁడవ శతాబ్దాంతమునను బదునాలవ శతాబ్దాదియందును నున్నాఁడు. పదునాలవ శతాబ్దమునందు శ్రీమద్రామాయణమును దెనుఁ.

గున వికచించి ప్రసిద్ధిఁగాంచినాఁడు. అప్పటి నుండియుఁ గవిపుంగవులందితఁడెక్కుడే యున్నాఁడు. కావున నితఁడు మొదటి నుండియుఁ దగు ప్రసిద్ధిని గలిఁగియే యున్నాఁడు. మఱియును సోమదేవరాజీయమునందు, ప్రతాపరుద్రుఁడు కొలువు తీర్చియున్నప్పుడు దర్శింపవచ్చినవారి వర్ణించుటలో "హాళక్కి భాస్కరుఁడు మొదలుగాఁ గల ప్రబంధ కవీశ్వరులిన్నూఱుగురును" అని వ్రాయఁబడి యున్నది. ప్రతాపరుద్రుని యాస్థానమందిన్నూఱుగురు కవులుండఁగా వారిలో భాస్కరుని మాత్రముగ్గడించి ముందిడి "భాస్కరాది ప్రబంధకవులిన్నూఱుగుర"ని తెల్పుట వలన నీతని యప్పటిప్రసిద్ధి స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. దీనికిఁదోడై హాళక్కిభాస్కరుని వదంతిని దెల్పునది యొక కథ కలదు అది తద్వంశస్థులచే నిప్పటికిని వాఁడుకొనఁబడుచున్నది. అది యేదియన "మొదట భాస్కరుని యింటిపేరు "మంగళపల్లి" వారఁట, ఈమంగళపల్లిభాస్కరమహాకవి రాజాస్థానమందుఁ గవిత్వవిషయమున నగ్రతాంబూలము నందెనఁట, రాజొకనాఁడు రత్నఖచితమైన బంగారు పళ్ళెరమున నమూల్యాభరణాదియుతంబగు కర్పూర వీటిక నిడి అందఱుకవులలోను నెక్కుడు రసవంతముగా నేకవి కవిత్వమును జెప్పునో వానికా యమూల్యమగు విడెయము నిచ్చెదనని చెప్పినట్లును, అప్పుడు భాస్కరుఁడు అందఱికన్నను మిన్నగాఁ గవిత్వమును జెప్పి యా యగ్రతాంబూలము నందినట్లును అందుమూలముచే భాస్కరునికిని, తరువాత తత్సంతతికిని గూడ "హాళక్కి" యను నుపపదము గలిగినట్లును జెప్పుదురు. "హాళకి" యను కర్ణాటక పదమునకుఁ దాంబూలమర్థము దీనినే యరవములో "హాడకాయం" దురు. మనవారు బిరుదులందును గౌరవార్థకములగు నుపపదములందును కర్ణాటక పదములను, ద్రావిడ శబ్దములను, సంస్కృతోక్తులను వాడుచుందురు. తెలుఁగుభాషకన్న వానిని గౌరవముతోఁ జూతురు. పరగండభైరవ, మూరురాయరగండ, మొదలగు బిరుదులను, రాయన భాస్కర, అళియరామరాజాది నామములను పరికించిన నీయర్థము తేటపడఁగలదు. కావున మంగళపల్లి భాస్కరుఁడగ్రతాంబూలమంది హాళక్కిభాస్కరుఁడాయెనను కథ నమ్మతగినదై యాతని కీర్తిని బ్రకటించునదియైయున్నది.

కాఁబట్టి సకల సుకవిజన వినుతుఁడు హాళక్కి భాస్కరుఁడుకాని మంత్రిభాస్కరుఁడు కాఁడనవొప్పును.

(d) ఆరణ్యకాండము తక్కిన కాండములవలెఁగాక యాశ్వాసములు గలి

గియుండుటనుగూర్చి చర్చింతము :—శ్రీమద్రామాయణములో గొప్ప కాండములు రెండు. అవి యారణ్య యుద్ధకాండములు. వానిలో భాస్కరుఁడు తెనిఁగించినవి కూడ నీరెండే యైయున్నవి. మొదటిదానిని రెండాశ్వాసములుగా విభజించినాఁడు, యుద్ధకాండమునుగూడఁ బూర్తిగాఁ దెనిఁగించిన నెన్నియాశ్వాసములుగా రచించునో గాని యట్లాతఁడు చేయక కొంతవఱకే యుద్ధకాండమును వ్రాసియుండుటను, మిగిలినది యయ్యలార్యుఁడు వ్రాయుటను నది యేకాశ్వాసమైనది. హుళక్కి భాస్కరుఁడు యుద్ధకాండమునంతను విరచించియుండి దానినాశ్వాసములుగాఁ జేయకపోయిన, నప్పుడు అరణ్యకాండమును విరచించిన భాస్కరుఁడే యుద్ధకాండమును విరచించి యున్నయెడల రెండవ దానిని గూడ నేల యాశ్వాసములుగా విభజించియుండలేదను ప్రశ్న చెల్లునుగాని యిప్పుడుచెల్లదు, కావున నారణ్యకాండమాశ్వాసములు గలిగియుండుటచే నది హుళక్కి భాస్కరేతరుఁడు విరచించె ననుట సందర్భశుద్ధిగా లేదు.

(e) ఆరణ్యకాండ కవిత్వమునకును దక్కిన కాండముల కవిత్వములకును భేదముకలదని వాదముకొఱకు నుడువువారే కాని యాభేదమేదో తెల్పఁగలవారుమాత్రము లేరు. ఈతారతమ్యమెంచఁ బోయినవారిలో బహుజనపల్లి సీతారామాచార్యులవారు మొదటివారు. వీరు తమ నిఘంటువులో రామాయణ కవులనుగూర్చి వ్రాయుచు బాలాదికాండములు హుళక్కి భాస్కరుఁడును దత్పుత్రాదులును రచించినట్లు తెల్పి, ఆరణ్య కాండమును మాత్రము వీరెవరును దెనిఁగింపలేదనియు, దాని తిక్కనసోమయాజి తాతయు మహాకవియు నైన మంత్రి భాస్కరుఁడు విరచించెననియు తెల్పిరి. ఆవ్రాతనుబట్టి చూడఁగా హుళక్కి భాస్కరునికంటె మంత్రి భాస్కరుఁడు చాల గొప్ప కవి యని తెల్పు నూహతో వ్రాసినట్లు తోఁచుచున్నది. మఱియు నట్లనుటకుఁ గల కారణములను జెప్పుచు కవిత్వమునుబట్టి కూడ అరణ్యకాండము హుళక్కి భాస్కరాదులచే రచియింపఁబడలేదని తెలిసికొనవచ్చునని వ్రాసిరి. అన్నియు బాగుగనే యున్నవికాని, కవిత్వములనుగూర్చి తెల్పునపుడు మాత్రమీభేదమేదో తెల్పఁజాలక యీయాచార్యులవారే, యానిఘంటువులోనే రామాయణ కవులనందఱిని నొక గుంపుగాఁ జేసి వీరి నందఱిని మూఁడవ తరగతిలోని కవులనుగాఁ జెప్పిరి. ఏదీ మంత్రిభాస్కరుని యాధిక్యత యెక్కడనున్నది? తారతమ్యమెక్కడనున్నది? ఇఁక నీవిషయమున రెండవ వారు రావుబహదర్ వీరే

శలింగము పంతులువారు, వీరు శైలీభేదము కలదని వ్రాయుటయే కాని భేదమును మాత్రముచూపలేకపోయిరి. వీరు మల్లికార్జునభట్టు శైలికిని నితర శైలులకును గల తారతమ్యమును జూపిరి కాని యది ప్రకృతానుపయోగి. మనకుఁ గావలసినది యారణ్యకాండమునకును, యుద్ధకాండము యొక్క మొదటి భాగమునకును గల శైలీభేదమై యున్నది. అది వీరు చూపలేదు. హేతువేమియుఁజూపకయే పంతులవారు "మంత్రి భాస్కరుని కవిత్వము తరువాత హుళక్కి భాస్కరుని కవిత్వము మనోహరముగానుండును" అనివ్రాయుటయేకాని యారణ్యకాండమందుఁ గల యతిశయమేమో తరువాత యుద్ధకాండము యొక్క మనోహరత యెట్టిదో తెల్పరైరి. భేదబుద్ధి యిదివఱకే కలదుగాన దానినిబట్టి పంతులవారి వాక్యమును వ్రాసినట్లున్నది కాని వేఱుకాదు. పంతులవారు రహస్యముగా దూరి చూచి, పైకి మంత్రిభాస్కరుని కవిత్వము ప్రశస్తమైనదనియు, దాని తరువాతిది హుళక్కి భాస్కరునిదనియు నుడువుటకన్నఁ దామెట్టితారతమ్యమును దీసిరో తెలిపిన బాగుండును. ఇది స్వపక్షమును నిలుపుకొనుటకు ముఖ్యమైన విషయము. ఇట్టి ముఖ్యవిషయమును విడిచిన నేమిలాభము ?. హేతువు చెప్పలేకుండ భేదబుద్ధితో పంతులవారాడిన మాటలయందైనను మంత్రిభాస్కరుని కవిత్వము తరువాత హుళక్కి భాస్కరుని కవిత్వము మనోహరముగానుండుననుటచే రామాయణములో అరణ్యకాండమును, యుద్ధకాండముయొక్క మొదటి భాగమును నితర కాండములకన్న మనోహరములైనవని తేలి యీరెండు కాండములకును శైలినిబట్టి యితరములకన్న నెక్కుడు సంబంధముకలదని స్పష్టపడుచున్నది. ఇది వారి వాదమునకు బలహీనతను గలిగించునదే కాని బలమును గలిగించునదికాదు. ఏమన భేదమునుజెప్పఁబోయి దానికన్న నిది కొంచెము మెఱుఁగు దీనికన్న నది కొంచెము లొక్కు అనుట భేదమును దెల్పలేకపోవుటలో నిది కాని వేఱుకాదు. పంతులవారు శైలీభేదమును జూపుటకై యిచ్చిన పద్యముల నిందుదాహరించెదను వానినిబట్టి బుద్ధిమంతులేమి తారతమ్యమును దీయుదురో చూతము :—

ఉ॥ ఓరినిశాచరాధమ, మ - దోద్ధతిఁ బాపవిప్రకారముల్
వారక చేసి తాఫలమ - వశ్యముఁ బొందకపోవునే ? యమా
గారగతుండవై కుడువఁ - గాలము సేకిఱె చేరె; నింకనా
ఘోరశరంబులం బసుని - కొఱ్ఱలుదీఱఁగ నిన్నుఁ ద్రుంచెదన్.

ఉ॥ ఈకొరగాని కార్యమిటు - లెవ్వఁడొకో యనుకూలశత్రుఁడై
నీకుఁ బ్రియంబుగాఁ బలికె - నీవును నిత్తెఱఁగాచరింపఁగా
రాకతలంచిచూడ నిది - రాక్షసవంశ వినాశకాలమో
కాకటుగాన నీకొనునా - కాదనగీదృశ మెవ్వఁడేనియున్.

చ॥ చనను మహద్విరోధమని - చక్కటి చెప్పిన నింత తప్పనన్
గనలితి; నీతిశూన్యులకుఁ - గార్యము లేటికిఁదోఁచు? నిప్డు వే
యును బనిలేదు; నీవలన - నొప్పని నావచనంబులెల్ల నీ
వవిమెన రాముచేఁ బడిన - యప్పుడెఱింగెదు గాక పోయెదన్.

శా॥ కామక్రోధ మదాతిరేకమున నే - కగ్రాహివైయున్న ని
న్నేమార్గంబునఁ దెల్పవచ్చు? నధికుం - డెగ్గేలసైఁచున్? బర
స్త్రీమాయం గొని వచ్చుటేతగవు? నీ - చేగాక సామంతమి
త్రామాత్యాదులు నేఁడు శాత్రవులచే - నాచచ్చి రూహింపఁగన్?.

మనసు మాచెడ్డది. ఇందుభేదమున్నది; చూడు? మనసేదా యవాఙ్మానస గోచరమగు భేదమును గనిపెట్టఁగలదు. ఒకని కవిత్వములోనివే, యొక యాశ్వాసములోనివే మూఁడు, నాల్గుపద్యములిచ్చి, యివి వేఱు వేఱు కవులవి, ఇందుశైలీభేదముకలదు, చూడుఁడన చదువరుల మానసముల నేక చమత్కారములకులోనగుట తటస్థమగును. ఉభయభాస్కరులును భిన్నులను నభిప్రాయముగల వీరేశలింగముపంతులవారికీ రెండుతావులను గవిత్వమునందించుక భేదము కాన్పించుచున్నది. ఉభయులును నొకరను తలంపుగల శ్రీరామమూర్తి పంతులవారికి కవిత్వములు రెండును నొకటిగాఁగాన్పించుచున్నవి. చూడుఁడీచమత్కృతి! "ఇదమిత్థమ్మ"ని చెప్పఁదగిన భేదమేమైననున్న యెడల నిందరిట్లుతలఁచుటకు వీలుండక పోవునుగాన భేదభావమతిస్వల్పమగుటచే దాని మనోవికారముగ నెంచి త్రోసివైచుదము.

(f) కాండాద్యంత పద్యములనుబట్టి యారణ్యకాండ కవి తక్కిన వారికంటె భిన్నుఁడని తెలిసికొనవచ్చునని సీతారామాచార్యులవారు వ్రాసిరి. కాని యది సరియైన తలంపుకాదు. ఏలయన నారణ్యకాండము హుళక్కి భాస్కరునిది కాని యెడల నిఁక నీకరివగు కాండాంత పద్యములే లేవు. ఇతర కాండాంత పద్యములకును, నారణ్యకాండాంత పద్యములకును భేదముకలదు గాని యది హుళక్కి భాస్కరేతరులు రచించుటవలనఁ గలిగినది. అది యారణ్యకాండ కవి యేభాస్కరుఁడైన

ను గూడఁ గలుగునదియే యైయున్నది కావున నీవిషయమునం జూడవలసినవి యారణ్య యుద్ధకాండములై యున్నవి. యుద్ధకాండమును హుళక్కి భాస్కరుఁడు పూర్తిగా విరచించి యుండ లేదు గాన దానియంతమునందున్న పద్యమయ్యలార్యునిది కాని హుళక్కి భాస్కరునిది కాదు. దీనికిని నారణ్యకాండాంత పద్యములకును భేదముండుట యుభయపక్షములకును గూడ సమ్మతమే యైయున్నది. ఇఁక యుద్ధకాండాదిని గల పద్యమన్ననో హుళక్కి భాస్కరునిది అది యారణ్యకాండాదినిగల పద్యముతో సర్వవిధములఁ బోలియే యున్నది. రెండును సాహిణిమారుని సంబోధించుచునే యున్నవి. ఆ రెండుపద్యములను నిందు క్రిందనిచ్చుచున్నాఁడను :—

క॥ శ్రీహితనయవిలసితవా । గ్దేహితమృదువచన ధామ - దేహితగుణసం
దోహా త్రివిక్రమ విక్రమ । సాహసవగధైర్యసార - సాహిణిమారా.

ఆరణ్యకాండము॥ ఆ ౧.

క॥ శ్రీకర కరుణారసరవి । లోకన లీలావికాస - లోలవిపక్షీ
ల్లోకవివేక కలాశ్రీ । ష్టాకశలామేరుధీర - సాహిణిమారా.

యుద్ధకాండము.

ఈ రెండుపద్యములను బట్టి చూచిన కవులు భిన్నులనుటకన్న నొక్కరే యనుట స్పష్టమగుచున్నది, కావున నాచార్యులవారిమాట పాటింపఁదగినది కాదు.

(౮) ఇఁక తిక్కన సోమయాజి తన తాత కవియని తెల్పుకొనుటయు, దానుత్తర రామాయణమును వినిర్మించుటయు, మంత్రిభాస్కరునికీవిషయమున నేమైన లాభము చేయునా ? యను విషయమును వితర్కింతము.

తిక్కన సోమయాజి తన యుత్తర రామాయణమున :—

గీ॥ సారకవితాభిరాము గుంటూరువిభుని । మంత్రిభాస్కరు మత్పితామహు నెఱదలఁచి
యైన మన్నన మెయిలోక మాదరించు । వేఱ నాకృతి గుణములు వేయునేల.

అని వ్రాసియున్నాఁడు. ఇది, దేవస్తుతి, కవినుతి, కుకవితిరస్కృతి యుత్తరరామాయణమును దెనిఁగించుటకుఁగల కారణమును దెల్పుటయైన తరువాత తన వంశము నభివర్ణించుకొనఁబోవుచు ముందుగాఁ దాతఁగారిని గూర్చి పైపద్యమును వ్రాసి తరువాత

మ॥ అమలోదాత్తమనీష నేనుభయ కావ్య ప్రౌఢిఁ బాటించుశి
ల్పమునన్ బారఁగుడన్ గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ

తమగోత్రుండు మహేశ్వరాంఘ్రి కమలధ్యానైక శీలుండన
న్నమకున్ గొమ్మన మంత్రికిన్ సుతుఁడు దిక్కాంకుండు సన్మాన్యుఁడున్.

అని చెప్పినాఁడు తన తాతనుగూర్చి వర్ణించుకొనుచు నాతఁడు కవియని చెప్పినంతమాత్రమున నాభాస్కరుఁడు ఒక మహాకవి యనియు, నొకగొప్పగ్రంథమును విరచించి యుండవలయు ననియు, నది తప్పక రామాయణములోని యారణ్యకాండమై యుండుననియు వెనుక ముందులాలోచింపక చెప్పవచ్చునా? తాతను వర్ణించుకొనునప్పుఁడాతఁడు గొప్పవాఁడని చెప్పక యెవ్వఁడైన మఱియొకలాగున నుడువునా? తిక్కనసోమయాజి వ్రాసినదంతయు నున్నది యున్నట్లు నిజమని నమ్మవలెనా? నిజముగా నతఁడు తన కవిత్వము మంచిదైనను గాకున్నను దన తాతయొక్క మహాకవిత్వమును జూఁచియైనఁ దనకవిత్వమును లోకము మెచ్చునని తలఁచెనా? అట్లు పిచ్చివాండ్రయిన నెంతురా? ఎంతమాత్రమును నట్లు తలంపవలసినది కాదు. తిక్కన భారతమునందుఁ దనకుఁ గలలో జరిగినట్లు వ్రాసిన వృత్తాంతము నంతను మనము నమ్మవలసినదా? ఎంతమాత్రమును గాదు. అవియన్నియుఁ దనయుఁ దనపెద్దలయు గొప్పను వర్ణించుకొనుటకుఁ జెప్పినవే కాని వేఱు కాదు తన తాత తండ్రులను, గోత్రము మొదలైనవి తెల్పుచు భాస్కరుఁడు కవికూడనైయుండుటచేత తాతగారియందలి గౌరవముచేఁ దన కవిత్వమును మించిన కవిత్వమనియెనే కాని మఱియొకటి కాదు. ఒకవేళ నిజముగా నాతఁడు గొప్పకవియే యందము. అయినను నాపద్యమునందు రామాయణమును జేసెనని చెప్పెనా? లేదు. అట్లుండ నీపద్యము నాధారము చేసికొని రామాయణములో మంత్రిభాస్కరునకు భాగమును బంచిపెట్టుట యేమిన్యాయము? మంత్రిభాస్కరుఁడు చేసిన గ్రంథమేదియును గనుపడక పోయినంతన రామాయణమును బద్దలుకొట్టి పంచిపెట్టుటయేనా? ముందు వెనుకలాలోచింప నక్కఱలేదా? తుదకంత గొప్ప భాస్కరునకు రామాయణములో నొక్క యారణ్యకాండము మాత్రమా పంచిపెట్టితిరి, ఆహా! అయ్యలార్యుని పద్యమే లేకపోయిన హుళక్కిభాస్కరునిపని పూర్ణగా హుళిక్కియే యగును గాఁబోలు!!! దానికేమి యీరామాయణలేశము నొక్కదానిని బట్టి తిక్కన తన తాతనుగూర్చి యంతవిశేషముగ వ్రాసెననుట న్యాయము కాదు, మన ప్రతిపక్షులకు మంత్రిభాస్కరునందెంత యభిమానమున్నను నీయారణ్యకాండ కవిత్వము నంతశ్రేష్ఠమైనదానినిగా వీరంగీకరించుయుం

డలేవు. హుళక్కిభాస్కరాదుల నడఁగఁద్రొక్కి మంత్రిభాస్కరుని పైనఁబెట్టుటలో నీవు వెనుదీయలేవుగాని యీయారణ్యకాండకవిత్వము నుత్తమమైనదానినిగా మాత్రము నీవు చెప్పియుండలేవు. ఈకవిత్వమునందు దోషములుకూడఁ గలవని వ్రాయుచున్నారు. ఇట్లుండ నుత్తమోత్తమ కవియైన కవిబ్రహ్మనిర్దుష్టమై యతిరసవంతమైన తనకవిత్వమునకు వన్నె తెచ్చునది తన తాత కవితయైన రామాయణ కవిత్వమని నుడివినాఁడనుట యెట్లుపొసఁగును. తిక్కనకవిత్వముతోఁబోల్చిన నీరామాయణకవిత్వము—అనగా సారహీనములగు హుళక్కిభాస్కరాదులకవిత్వములుకావు—ఆరణ్యకాండ కవిత్వమొక కవిత్వమేకాదని మన ప్రతిపక్షులే తలంచెదరు. అట్లుండ నీయారణ్యకాండమందలి దోషయుక్తమగు మూఁడవ తరగతి కవిత్వమును దిక్కన యాధారముగాఁదీసికొని “తన కావ్యము స్వగుణము చేతఁ గాకపోయినను దన తాతయైన మంత్రిభాస్కరుని సారకవిత్వ మహిమచేత నయినను లోకాదరణమునకు పాత్రమగునని చెప్పియున్నాఁడు”. అనుట న్యాయమా? ఈయారణ్యకాండకవిత్వమే మంత్రిభాస్కరుని కవిత్వమయిన యెడల మనము మొదట చెప్పినరీతిగాఁ దిక్కన తన తాతను విశేషముగాఁ బొగడుకొనినాఁడను మాట రూఢి పడుచున్నది. అటుగాక తిక్కనమాటబందే మనమునమ్మకముంచి మంత్రిభాస్కరు కవిత తిక్కన కవిత్వమునకుఁగూడ మర్యాదఁ దేఁజాలినదని నిజముగా మనము నమ్మునెడల, ఆమహాకవిత్వము రామాయణ కవిత్వమనదగదు. ఏలనన నిదియే మంత్రిభాస్కరుని కవిత్వమైనయెడలఁ దిక్కన కవిత్వమునుజూచి యిది మంచిదనవలెనుగాని దీనినిజూచి దాని మంచిదనవలసినదికాదు. కావునఁ దిక్కనమాట మనము నిలుపఁబెట్టఁదలఁచిన యెడలఁ జల్లఁగా రామాయణ కవిత్వము విడచి మఱియొకటి చూచుకొనవలెను. ఇఁకనేమిచేయుదము, భాస్కరాచార్యుల గ్రంథములే మంత్రిభాస్కరునివందుమా? అవి సంస్కృతగ్రంథములు. అవిగాక అవియైనను గవిత్వ నైపుణ్యము జూపునవికావు. పోనిండు, భాస్కరపంతులే యీమంత్రిభాస్కరుఁడందుమా? ఆదియును గొప్పకవిత్వము కాదు. ఏమిచేయుదము? తిక్కన కవిత్వముకంటె మెఱుఁగైనది నాచనసోముని కవిత్వమని మన ప్రతిపక్షులు చెప్పుచున్నారు కావున నాకవిత్వములోఁగొంత మంత్రిభాస్కరునికి బంచిపెట్టుదము. అట్లయినఁ దిక్కనచెప్పినది నిజమగును. అట్లుచేయఁదగదు కదా, అట్లయిన తిక్కన యభిమానముచేఁ దన తాతను అతిశయముగా వర్ణించెననవలయును. కాన నిఁక రామా

యణమువఱకును బోనక్కఱలేదు. ఏభాస్కరశతకమునో రచించుటచేత నభిమానముచే దానినే గొప్పగా వర్ణించుకొనెననవచ్చును. ఏలయన రామాయణమును జేసినట్లు చెప్పలేదు కావున. తిక్కన తన తాత రామాయణమును రచించెనని చెప్పకపోయినను దాని నాతఁడు రచించెనని తలఁచవలసిన యవసరములేదు. తమ తాతలు గొప్పకవులని పొగడుకొనిన కవులు పల్వురు కలరు. ఆ తాతల గ్రంథములును మంత్రిభాస్కరుని గ్రంథములవలెనే యెచటను గాన్పించుటలేదు మంత్రి భాస్కరునికిఁ దన మనుమని మాటలనుబట్టి రామాయణములో భాగమును బంచిపెట్టు న్యాయమునకు మనము వచ్చినప్పుడు వారి వారి తాతలకుఁగూడఁ గొంత గతి కల్పింపవలసినవార మగుదుము. అనంతామాత్యుఁడు తన ముత్తాతయగు బయ్యన గొప్పకవి య యుఁ గవిత్వమును జెప్పి తిక్కన సోమయాజిని మెప్పించెననియుఁ దన భోజరాజీయములో నిటుల వ్రాసికొనినాఁడు :—

చ॥ క్షితిఁ గ్రతుకర్త నావినుతిచేకొని పంచమవేదమైన భా
రతముఁ దెనుంగుబాస నభిరామముగా రచియించినట్టి యు
న్నతచరితుండు తిక్కకవి నాయకుఁడాదట మెచ్చి భవ్యభా
రతి యనఁ జేయఁగన్న కవిరత్నము బయ్యనమంత్రి యల్పుఁడే.

ఈబయ్యన వ్రాసిన గ్రంథములేవియును గాన్పించుటలేదు. కావున మల్లికార్జున భట్టు విరచించిన మూఁడు కాండములలోను నొకదాని నితనికిఁ బంచిపెట్టుదము. దీనికొక యుక్తినిగూడఁ జెప్పుదము : అది యేదియన :—గ్రంథమును ద్వరగాఁబూర్తిఁజేయు తలంపుతో బూనుకొని మహాకవియగు మంత్రిభాస్కరుఁడొక్క కాండమునుమాత్రము రచించియుండు, నంతకన్న తక్కువ వాఁడే యైనను దక్కినవారికన్న ఘనుఁడగు హుళక్కి భాస్కరుఁడొక కాండములోఁ గొంతభాగమును మాత్రమే వ్రాసియుండఁ జిన్నవాఁడగు మల్లికార్జునభట్టు మూఁడు కాండములు రచించెననుట నమ్మఁదగినది కాదు. కావున నొక కాండమును బయ్యన వ్రాసెనందము. అది సుందరకాండమని చెప్పుదము. ఏలయనఁ దక్కిన రెండు కాండములవలెఁ గాక యిందు సాహిణిమారుఁడు సంబోధింపఁబడియున్నాఁడు. కావున సుందరకాండము తప్ప క బయ్యనదే యందము. బయ్యన, మల్లికార్జునభట్టు శబ్దములందు బకార నకార సంబంధమున్నది కాఁబట్టి మల్లికార్జునభట్టునే బయ్యన యందురు అందము. ఇది తగదా ? అట్లయిన రామాయణములో మంత్రిభాస్కరునకు భాగమును బంచిపె

ట్టుటయుఁదగదు. మాతాత కవియని తిక్కన యనుటచేత నేకదా? యింతటి సాహసమునకొడిగట్టినారము. ఇది న్యాయముకాదు.

తిక్కన యుత్తర రామాయణమును రచించుటకూడఁ దమయూహను బలపఱచుచున్నదని ప్రతిపక్షులు తలంచుచున్నారు. తన తాత రామాయణమును జేయఁబట్టియే తానుత్తర రామాయణమును జేసెనని నుడువుచున్నారు. కాని యుత్తర రామాయణమును దిన్నఁగాజూడక వీరీతలంపునకు లోనైరి. భారతమును బూరించుచు నన్నపార్యుఁడు రచింపఁగా మిగిలినదాని రచించుచున్నానని చెప్పినట్లుగాఁ దిక్కన యిందు మంత్రిభాస్కరుఁడు వ్రాయఁగా మిగిలినదానిని తెల్పుచున్నానని తెల్పియుండలేదు. అయినను బ్రతిపక్షులు ఊహలమీఁద నింతటి సాహసవాక్యము నైనఁ బలుకుచున్నారు. అదియే నిజమైన యెడల నట్లేల వ్రాయకుండును. తన తాత పేరెత్తియునుగూడ నీమాటవ్రాయలేదు. దానికేమి, యూపపయనుటుగడనిందు, ఇతరులు వ్రాయఁగా మిగిలిన యుత్తరకాండమును బూరించుచున్నానని చెప్పకపోవుటయే కాక తానుత్తర రామాయణమును వ్రాయుటకుఁగల కారణమును గూడ నందు స్పష్టముగాఁ జెప్పియున్నాఁడు. రామాయణమదివఱకు రచింపఁబడని యెడ నుత్తర రామాయణము నీతఁడు వ్రాయుటకుఁ గారణమేమని ప్రతిపక్షులడుగుచున్నారు. దానికి సమాధానము, మనము శ్రమపడనక్కఱలేకుండ, అతఁడే యుత్తర రామాయణమునందుఁ దెల్పియున్నాఁడు. అది మన ప్రతిపక్షులు తొందరచేఁ దిన్నఁగా చూచినారుకారు. ఇట్టి ప్రశ్నము లోకమువలన వచ్చునను తలంపుననే తిక్కన:—

క॥ ఎత్తెఱనైనను ధీరో । దాత్తనృపోత్తముఁడు రామధరణీపతి స
ద్వృత్తము సంభావ్యమగుట । నుత్తర రామాయణోక్తి యుక్తుఁడ నైతిన్.

అని స్పష్టముగాఁ దానుత్తర రామాయణము వ్రాయుటకుఁగల హేతువు ధీరోదాత్తనృపోత్తముఁడగు రాముని సచ్చరిత్రమెచటనైనను సంభావ్యమే యనుటయని వ్రాసియున్నాఁడు. తాత రామాయణమును వ్రాసియుండి మిగిలినభాగమును దాను పూర్తిచేయుచుండిన నిట్లు వ్రాయునా? మాతాత రామాయణమును వ్రాసెఁగాన నేనుత్తర రామాయణమును వ్రాయుచున్నాననునుగాని, “నేనుత్తర రామాయణము నెందునకు వ్రాయుచున్నాననఁగా ఎచటనైనను రాముని సచ్చరిత్ర సంభావ్యమే కనుక చెప్పుచున్నాను.” అని నుడువునా? ఇతని తాత రామాయణమే యదివఱకుఁ జేసియుండినఁ దిక్కన యుత్తర రామాయణమును వ్రాయుటకుఁ గా

రణమేమను ప్రశ్న యుండదునా? తాత వ్రాయఁగా మిగిలిన భాగమును బూరించుట యితనికి న్యాయమగు పనియేకదా; అదిగాక యెచ్చటనైననేమి రాముని చరిత్రమును వ్రాయుటకనుమాట యదివఱకు రామాయణము వ్రాయఁబడి యుండినఁ బొసఁగునా? అదివఱకు రామాయణమే వ్రాయఁబడియుండిన నిఁక తిక్కనకు మిగిలినది యుత్తరకాండమే యగును గదా? ఇఁక నెత్తరినైన నడుటకు నవకాశమేది? లేదు కావున నీపద్యము ప్రతిపక్షుల యూహకు భంగమును దెచ్చుటయ కాక మన పక్షమునకు మిగుల నక్కఱకు వచ్చుచున్నది. ఎట్లన, తిక్కన నాటికి రామాయణము తెనిఁగింపఁబడలేదు. అట్లుండ, నతండుత్తర రామాయణమును దెనిఁగించుట నారంభించినాఁడు కావున రామాయణమంతయునుండఁగా నుత్తర రామాయణమెత్తుకొనుటకుఁ గతమేమను శంక కలిగినది. దానికి, ఎక్కడనైన నేమి రాముని కథను వర్ణించుటకు, రామాయణమే వ్రాయవలెనను నియమము లేదు. ఏభాగమును వ్రాసినను రాముని కథ సంభావ్యమే యగును గాన నుత్తరకాండమును వ్రాయుచున్నాను'' అని సమాధానము చెప్పినాఁడు. ఈతఁడుత్తరకాండమును మాత్రము వ్రాయుటకుఁ గల రహస్యమీక్రిందిదైయుండును. తిక్కన సోమయాజికి నన్నయభట్టారకుని యూహల ననుసరించు టయందాసక్తి విశేషముగాఁ గలదు. ఈయుత్తర రామాయణమును నన్నయ భారతమెట్లు ప్రారంభింపఁ బడినదో యట్లే ప్రారంభించినాఁడు. నన్నయ తనకాశ్రయుఁడగు రాజరాజ నరేంద్రుఁడు చంద్రవంశస్థుఁడు కావునఁ దద్వంశ్యుల చారిత్రమగు భారతము నాతఁడు తెనిఁగింపఁగాఁ దనకాశ్రయుఁడైన మనుమసిద్ధి సూర్య వంశస్థుఁడగుటచేఁ దద్వంశస్థుల చారిత్రమగు రామాయణమును దాఁ దెనిఁగింపనెంచె.

సీ॥ సకలలోక ప్రదీపకుఁడగు పద్మినీమిత్రు వంశమున జన్మించెననియు

అని మనుమసిద్ధి సూర్యవంశస్థుఁడని తిక్కన తన యుత్తర రామాయణమున వ్రాసియున్నాఁడు. భారతము చంపువగుటచే నన్నయభట్టారకుఁడు కూడఁ దన భారతమును చంపువుగా వ్రాసినాఁడు. రామాయణము పద్యకావ్యమగుటచేఁ దిక్కన తానును గేవలము పద్యకావ్యమును విరచింప నెంచినాఁడు కాని గ్రంథమంతయు నిర్వచనముగా వ్రాయుటకష్టమని యూహించి యుత్తర రామాయణమును మాత్రము ప్రారంభించి దానినైనను మిక్కిలి సంగ్రహపఱచి వ్రాసినాఁడు. ఈతనికి వచనము లేకయు వర్ణనమును జెప్పుట కష్టమను దలంపు కలదనుటకీ క్రింది యుత్తర రామాయణములోని పద్యము సాక్ష్యమిచ్చుచున్నది.

క॥ వచనములేకయు వర్ణన । రచియింపఁగఁగొంతవచ్చుఁ బ్రౌఢులకుఁగథా
ప్రచయముఁ బద్యములన పొం । దుచితంబుగఁ జెప్పుటార్యులొప్పిదమనరే.

పద్యకావ్యరచన కష్టమైనదనియుఁ గావుననే యెక్కుడు గౌరవనీయమైన దనియు మనవారు తలఁచుచున్నారు. కంకంటి పాపరాజు తన యుత్తర రామాయణములో :—

మ॥ వరుసం దిక్కన యజ్వ నిర్వచన కావ్యంబై తగంజేసె ను
త్తర రామాయణమందునన్మఱి ప్రబంధంబూని నిర్మించుటే
సరసత్వంబని ప్రాజ్ఞులార, నిరసింపంబోకుఁడీ రాఘవే
శ్వరు చారిత్రము లెందఱెన్ని గతులన్వర్ణించినన్ గ్రాలవే.

అని ప్రబంధము కంటె (చంపువు కంటె) నిర్వచన కావ్యమంచు పండితులు ఎక్కుడు గౌరవమును గలిగి యుందురని తెల్పుచున్నాఁడు.

తమలో గద్య పద్య కావ్యము లెక్కుడగుటచే నాంధ్ర కవులు పద్యకావ్యము లెక్కుడు సరసముగానుండునని తలఁచుచున్నారు. మఱియుఁదమలో పద్యకావ్యము లెక్కుడగుటచే సంస్కృత కవులు చంపువులు ఎక్కుడు సరసముగా నుండునని ఎంచుచున్నారు. వేంకటాధ్వరి తన విశ్వగుణాదర్శమునందు :—

శ్లో॥ పద్యం యద్యపి విద్యతే బహుసతాం హృద్యం విగద్యం న త
ద్గద్యంచ ప్రతిపద్యతే న విజహత్పద్యం బుధాస్వాద్యతాం
అథ త్రైహి తయోః ప్రయోగ ఉభయో రామోద భూమోదయం
సంగః కస్యహి నస్వదేత మనసే మాధ్వీక మృద్వీకయోః.

ఈవిధముగానే సంస్కృతమునఁ బ్రబంధముల (చంపువుల) వ్రాసినవారందఱు పద్యకావ్యములకంటె చంపువులు హృద్యములని వ్రాసియున్నారు. ఇట్టితలంపే కంకంటి పాపరాజునకును నుండిన పద్యకావ్యముకంటె చంపువు హృద్యముగానఁ దిక్కన పద్యకావ్యము నిదివఱకు విరచించియున్నను నేను ప్రబంధమునువినిర్మించుచున్నానని నుడువును. అట్లు చెప్పలేదు. పద్యకావ్యమును వ్రాయుటకష్టమను తలంపుననే కఠిన నియమములలో నిర్వచన నియమమునుగూడ మనవారు చేర్చుకొనియున్నారు. కష్టమను తలంపుండుటనే హృద్యమను నూహయున్నను నిర్వచన కావ్యములంతగాఁ బుట్టినవికావు. నిర్వచన నియమముండుటచేతనే తిక్కయజ్వ కథను సంగ్రహపఱచెననియు, భారతమంత రసవంతముగా వ్రాయలేకపోయెననియు

లోచించుచున్నారు. కావునఁ దిక్కనకీభయము కలదని చెప్పకొనవచ్చును. అందుచే రామాయణమునంతను వ్రాయుటకు బంకే, విడిగానున్న యుత్తర రామాయణమును వ్రాసినాఁడని తోఁచుచున్నది. ఉత్తర రామాయణము కేవలమును రామాయణములో నొక భాగముగానుండక విడిగా వేఱొక గ్రంథముగా నుండుటయు కాక రాముని యవతార కారణాదులతో నిండియుండి భక్తుల కెక్కుడు రంజకముగా నుండుటచేత రామాయణము తెనిఁగింపఁబడకపోయినను దీనిని ముందు తెనిఁగించెనని తోఁచుచున్నది, ఎట్లయిన నేమి, పైపద్యము తిక్కన యుత్తర రామాయణము వ్రాయునాటికి రామాయణము తెనిఁగింపఁబడలేదని సూచించుచున్నది. కావున నుత్తర రామాయణము హుళక్కి భాస్కరుని పక్షముననే వినియోగించుచున్నదని చెప్పవచ్చును.

అరణ్యకాండమందలి యాద్యంత పద్యముల గమనిక, యుత్తర రామాయణమందలి యాద్యంత పద్య గమనికను బోలియున్నది కాఁబట్టి రామాయణారణ్యకాండమును దిక్కన తాతయే చేసెననియు దాని ననుసరించియే తిక్కన యుత్తర రామాయణమును విరచించెననియుఁ గొందఱు పలుకుచున్నారు. ఇదియు మన కెంతమాత్రమును బాధకమయినది కాదు. తనకుఁ బూర్వము రామాయణము విరచింపఁబడి యుండి యది తన తాతచే వ్రాయఁబడి తదభిమానముతోఁ దాను మిగిలిన భాగమును బూర్తిచేయనుద్యమించిన యెడలఁ దిక్కన, తాత గమనిక ననుసరించినది యొక్క యాద్యంత పద్యనిర్మాణముననా? తన యుత్తర కాండమును మిగిలిన వానివలె నుండుటకై గద్యపద్యాత్మకముగానే చేసియుండును. తాత గమనికలో హృద్యమైనగమనికనువిడిచి యాద్యంతపద్యములరీతిని ఏమి యెక్కుడు సరసముగా నున్నదని యవలంబించినాఁడు? అరణ్యకాండమందున్న యాద్యంత పద్యముల యొక్క గాని, నిర్వచనోత్తర రామాయణమునందలి వాని యొక్క గాని గమనిక యంతగా సరసమైనది కాదు. కనుకనే తరువాతి కవులెవరును దీని ననుసరింపరైరి. ఈప్రశ్నము మనకు లాభించునదియే కాని ప్రతిపక్షులకుఁ గాదు. ఏమన రామాయణ మేడు కాండలై యుండ నందు నాలు కాండములదివఱకు గద్య పద్యాత్మకముగా వ్రాయఁబడి యుండ మిగిలిన భాగమును బూరించు నాతఁడు పెక్కిరించునట్లుగాఁ దుది కాండమును నిర్వచనముగా విరచించునా? చదువరులు చక్కఁగా నాలోచింతురుగాక. తిక్కన నిర్వచన కావ్యమును విరచించుట ప్రౌఢత్వ

మను తలంపుఁ గలిగి తన మొదటి గ్రంథము నట్లు చెప్పినవాఁడే యైనను దన రెండవ గ్రంథమగు భారతమునుగూడ నట్లు రచింపక నన్నయ గమనిక ననుసరించి దానిని బూర్తి జేసినాఁడు. తరువాత ఎఱ్ఱాప్రగ్గడయును రామాయణమునకుత్తర కాండమెట్టిదో భారతమునకు నట్టిది యగు హరివంశము వ్రాయుచు :—

ఉ- నన్నయభట్టు దిక్కకవినాథులు చూపిన త్రోవ పావనం
బెన్న, పరాశరాత్మజ మునీంద్రుని వాఙ్మయ, మాదిదేవుఁడౌ
వెన్నుని వృత్త, మీవుఁ గడువేడుక త్రోవను నాయకుండవై
కన్నియు సంఘటించె మదభీప్సిత సిద్ధికి రాజపుంగవా.

అని తాను నన్నయభట్టు తిక్క కవీంద్రుల త్రోవను వెళ్ళుట తేటస్థమైనది కదాయని సంతసించుచున్నాఁడు- వారు మొదటి భాగమును రచించుటచేత వారి త్రోవను జనఁ గుతూహలపడుచున్నాఁడు. నాచన సోమనయును భారతపు త్రోవను జనెదనని సూచించినాఁడు. రంగనాథ రామాయణమునకుత్తర కాండమును విరచించిన కాచవిభుఁడును, విఠ్ఠలరాజును మొదటిదానివలెనే ద్విపదకావ్యముగా విరచించిరి. తిక్కన యుత్తర రామాయణములోఁ గొంతకథ మిగిలియుండగా దానినేకాశ్వాసముగా ముగించిన జయంతి రామభట్టుకవి తనభాగమును నిర్వచనముగానే వ్రాసె. ఇవియన్నియు నాలోచించి చూడఁగాఁ బ్రధానవిషయమున తిక్కన రామాయణము ననుసరింపక వేఱుత్రోవను దన గ్రంథమును విరచించెను కాన రామాయణమునిటకుఁ దన తాత రచించియుండఁగా మిగిలిన యుత్తరకాండమును దాను పూరించెననుట న్యాయముకాదు. ఆద్యంత పద్యములవిషయమొక ప్రధాన విషయముకాదు. ఈయాద్యంతపద్యములందు తిక్కన సాహిణిమారనుద్దేశించిన యెడల ప్రతిపక్షులకనుకూలముగాఁ గొంత యుండునుగాని యట్టిది లేదు. ఇంక సంబోధనలను బెట్టక యితర విభక్తులను బెట్టుట యను పోలిక యొకటి కొంత కలదు. తిక్కననుజూచి తరువాత హళక్కి భాస్కరుఁడట్లు వ్రాసెననుటకభ్యాంతరమెంతమాత్రమును లేదు గావున దీన మనకు బాధలేదు. ఆశ్వాసాంత పద్యగమనిక లోకక్రమ వ్యతిరేకముగానుండుట యొక్క యారణ్యకాండమున నేకాదు మల్లికార్జునభట్టు భాగమునందును గలదు. "సాటింపందగు నీదు కీర్తి రథినీ పాలాగ్రణీ సాహిణీ" యను నదియును నూతన మార్గమేయై యున్నది-

ఈరీతిని జక్కఁగా విమర్శించి చూచిన ప్రతిపక్షులు చెప్పు యుక్తులన్నియు

నిరాధారములును, దుర్బలములును నగుచున్నవి కాఁబట్టి యయ్యలార్యుని పద్యమును బట్టి రామాయణములోని యారణ్యకాండమునుగూడ హుళక్కి భాస్కరుఁడే విరచించెనని చెప్పనొప్పను.

కృతికర్తకును కృతిపతికిని గల సంబంధము.

(2) కృతిపతికిని గృతికర్తకును గల సంబంధమును బట్టి చూచినను హుళక్కి భాస్కరుఁడే రామాయణ కర్తగాని మంత్రిభాస్కరుఁడు కాఁడని విశదమగుచున్నది.

మంత్రిభాస్కరునకును, రామాయణమును గృతినందిన సాహిణి మారనకును సంబంధమెంతమాత్రమును గానరాదు. వీరిరువురకును సంబంధము కలదనుటకెట్టి గ్రంథ దృష్టాంతమును లేదు. మంత్రిభాస్కరుఁడు మిక్కిలి పూర్వుఁడగుటచే నాతని స్థితిగతులఁ దెలిసికొనుటకంతగా మార్గము లభింపకున్నది.

తిక్కన సోమయాజి యుత్తర రామాయణమున "గుంటూరి విభుని మంత్రి భాస్కరు మత్పితామహుని" అని తాతను గూర్చి వ్రాసియుండుట చేతఁ బ్రతిపక్షులు మంత్రిభాస్కరుఁడు గుంటూరుసీమకుఁ బాలకుఁడనియు, రాజాస్థానములందు మంత్రియనియు వ్రాయుచు మంత్రిభాస్కరునకు మిక్కిలి యుదార బుద్ధితోఁ బలు మంత్రిత్వముల నొసఁగియున్నారు. మన ప్రతిపక్షుల యుదార బుద్ధికిఁ జాలసంతోషముగానే యున్నది గాని యీయత్యౌదార్యబుద్ధి కార్యమును జెడగొట్టుచున్నదని తెల్పుటకెంతయు చింతగానున్నది. ప్రతిపక్షులొక్కొక్క పనికై యొక్కొక్క సంస్థానమునకు మంత్రినిఁగా భాస్కరు నియోగించుచువచ్చిరి. ఈతని కాలమును దెల్పుటకై యీతనిని రాయన ప్రగ్గడగా మార్చి గుంటూరు సీమకు మంత్రినిగా (సేనానాయకునిగాను గూడ) నొనరించిరి- ఈతని యౌదార్యమును దెల్పుటకై రాయన భాస్కరునిజేసి వినుకొండ రాజ్యమునకుఁ బ్రధానునిగాఁ జేసిరి. రామాయణములో సంబంధముఁ గలుపుటలో రంగనాథునకుఁ బ్రతిపక్షినిగా నొనరించి మునుమూరు సంస్థానమున బుద్ధరాజు కడఁ బ్రగ్గడగా నియమించిరి. రామాయణములో భాగమును బంచిపెట్టుటకై సాహిణి మారనకడ నమాత్యునిగా నిర్ణయించిరి. తిక్కన సోమయాజిని బట్టి నెల్లూరి సచివత్వమొకటి సిద్ధమేయైయున్నది. ఇన్ని మంత్రిత్వములుచేయఁ గలఁడా లేఁడా యని యైన నాలోచింపరైరి. ఏమి వీరి ప్రజ్ఞ! ఏమి వీరి సాహసము!! ఏమి వీరి యుదారబుద్ధి!!! ఇన్ని

మంత్రిత్వము లనొకనియం దారోపించుటచే మొదటికే మోసము రానున్నది. దీనివలన వారెంత వితరణ నిధులైయుండిరో మనమంత లుబ్ధులము కావలసి వచ్చినది. ఈయుద్యోగములలో నొకటియైన నీతనికిచ్చుట న్యాయముకాదని తోఁచుచున్నది. న్యాయముచే నొకచోటనైన నితఁడు మంత్రిగానుండిన యెడల అదియే స్థిరపడి ప్రసిద్ధమై యుండునుగాని తక్కినవేవియును లేకపోవును. అట్లుగాక యీతఁడు "కాళీ" గానుండుటచే మనవారు కావలసిన చోట్లకెల్ల "కచేరీలంపళీవాలంటి యరులను" వలెఁ దీసికొనిపోయి యొక్కొక్క చోట నొక్కొక మంత్రిత్వమును నొసఁగుచువచ్చిరి. ఈతఁడు మంత్రియని తెల్పుటకు మనకుఁగల గ్రంథాధారము తిక్కన యీతనిని మంత్రిభాస్కరుఁడనుట. తిక్కన యుత్తర రామాయణములో "సారకవితాభిరాము, గుంటూరి విభుని, మంత్రిభాస్కరు" నని వ్రాసి భారతమున "మజ్జనకుండు ✻ * * భాస్కరమంత్రి తనయుఁడు * * ✻ గుంటూరివిభుఁడు కొమ్మన దండనాథుండు" అని తండ్రినిగూర్చి చెప్పుటలో తాతమాటను వ్రాయుచు భాస్కర మంత్రి యని మాత్రము వ్రాసినాఁడు. మొదట తాతకుంచిన "గుంటూరి విభుఁడ" ను విశేషణము నిపుఁడు తాతకుఁ దీసివేసి తండ్రికుంచినాఁడు. ఉద్యోగనామమును దీసివేయఁగా మిగిలినది "భాస్కర మంత్రి" యనునది. కాఁబట్టి యది నామ మాత్రమనియును నందున్న "మంత్రి" పదము నియోగులు సాధారణముగాఁ దమ నామాంతములందుంచుకొను స్వశాఖను దెల్పు నుపపదమనియు మనము గ్రహింపవలయును. పేరునకు చివర "మంత్రి" యను పదమున్నంతమాత్రమున మంత్రిత్వము కలదని తెల్పు నెడల నియోగి మాత్రులందఱును మంత్రులే కావలసివచ్చును. ఇంతమాత్రముచేత మంత్రి భాస్కరుఁడెన్నఁడును నెచటను మంత్రిత్వమును జేయలేదని నే రూఢిగాఁ జెప్పఁజాలనుగాని యతఁడాయుద్యోగమును జేసినట్లు నిదర్శనము లేవియును లేవనియును, నామమందుగల "మంత్రి" పదమీయభిప్రాయము నిచ్చుటకుఁ జాలదనియు మాత్రము నుడివెదను. అదిగాక యితనికి గుంటూరి విభుత్వమొకటి కలిగియే యున్నది ఇది యున్న తరువాత నింక నొక యుద్యోగము కలదనుటకుఁ జాలినంత సాక్ష్యముండినంగాని దాని నమ్మనవసరము లేదు. మనవారు మంత్రిభాస్కరునం దారోపించిన మంత్రిత్వపుంజ మెంతమాత్రమును సమాదరణీయము కాదు. గుంటూరు మంత్రి బొల్లన కాని మంత్రిభాస్కరుఁడు కాఁడు. వినుకొండ మంత్రి రాయన భాస్కరుఁడు గాని యీతఁడు

కాఁడు. బుద్ధరాజు మొదలగువారు ఇతని కాలములోనివారే కారు. హనుమ సిద్ధికిని గుంటూరునకును సంబంధము లేదు.

మంత్రి భాస్కరుని వాసస్థలము గుంటూరు. ఉద్యోగము గుంటూరు విభుత్వము. ఇంతవఱకును మనకు వ్రాతమూలమైన సాక్ష్యము కలదు. ఇది యే సత్యమని నమ్మవచ్చును. మఱియును గుంటూరి విభుఁడనఁగా మన ప్రతిపక్షులు, గుంటూరి సీమకుఁ బాలకుఁడనుట యని తలఁచుచున్నారు. ఆలోచించి చూడఁగా గుంటూరు గ్రామమునకుఁ బాలకుఁడే కాని గుంటూరు సీమకుఁ గాదని తోఁచుచున్నది. గుంటూరి విభుఁడనఁగా గుంటూరి కరణమన్న మాట. గ్రామమునకుఁ గల "మునసబు కరణము" లను నిప్పటికిని గ్రామాధికారులనుట వాడికయై యున్నది. గుంటూరునకధికారి కనుక నిక్కన గుంటూరి విభుఁడని గౌరవముగాఁ బలికెనని తోఁచుచున్నది. ఏలయన మంత్రిభాస్కరునాఁటికి గుంటూరునకు వేఱుగా పాలకులు గలరు. ఏకాలమందు మంత్రిభాస్కరుఁడుండెనని ప్రతిపక్షులు తలఁచుచున్నారో యాకాలమున గుంటూరును బరిపాలించుచున్న ప్రభుఁడొకఁడు కలఁడని శాసనముల వలనఁ దెలియవచ్చుచున్నది. ఆకాలమున గుంటూరు రాజ్యమునకు పాలకుఁడు శ్రీమన్ మహా మండలీక గుంటూరి యుదయరాజు అతని మంత్రి బొల్లన సేనాని రాయన ప్రగ్గడయు నైనట్లుగా బెజవాడ మల్లేశ్వర స్వామివారి యాలయ స్తంభమునఁగల శాసనము వలనఁ దెలియవచ్చుచున్నది. ఈశాసనమును బట్టి చూడఁగా గుంటూరు పాలకుఁడుగాని, మంత్రికాని, సేనాని గాని మంత్రిభాస్కరుఁడు కాఁడని తెల్లమగుచున్నది. దీనివలననే గుంటూరునకు ప్రత్యేకముగా ప్రభువులు కలరనియు, వారే గుంటూరును పాలించుచుండెడి వారనియు స్థిరపడుచున్నది. కాఁబట్టి "గుంటూరు పరగణా" యని యొక రాజుక్రింద నొక పరగణా యనియు దాని నొకఁడా రాజునకు ప్రతినిధిగాఁ బాలించుచుండెడి వాఁడనియు నట్టి వాఁడు మంత్రిభాస్కరుఁడనియుఁ దలఁచుటకవకాశము లేకపోయినది. కావున గుంటూరి విభుఁడనఁగాఁ దద్గ్రామాధికారి యని తలఁచుట న్యాయము. మఱియు నీగుంటూరివిభుత్వమొక్క భాస్కరునందే లేదు. ఈవంశమునందుఁ బుత్రపౌత్ర పారంపర్యముగా నున్నట్లు గ్రంథముల వలనఁ దెలియవచ్చుచున్నది. గుంటూరుసీమకుఁ బాలకత్వమైనచో నట్లుండుట కష్టము. ఆగొప్పయధికారము "వారిసత్వము" నుబట్టి వచ్చునదికాదు. గ్రామకరణికము "వారిసత్వము" నుబట్టి వచ్చును. భాస్క-

రపుత్రుండైన కొమ్మన గుంటూరి విభుండైనట్లుగా భారతమువలనఁ దెలియవచ్చుచున్నది. తిక్కన పుత్రుండైన కొమ్మనయు గుంటూరి విభుండైనట్లుగా సింగన వ్రాసిన వాశిష్ఠ రామాయణమువలనఁ దెలియవచ్చుచున్నది. తిక్కన తరువాత నీవంశము తగ్గుస్థితిలోనికి వచ్చినట్లుగాను తిక్కన కొడుకొక గ్రామమునకుఁ గరణముగా నుండినట్లును ప్రతిపక్షులును సంగీకరించినారు. ఇట్టి తిక్కన పుత్రుఁడే సింగన గుంటూరు విభుఁడని తెల్పుచున్నాఁడు :—

సీ॥ అతఁడు తిక్కన సోమయాజుల పుత్రుఁడై * కొమరారు గుంటూరి కొ
మ్మ విభుఁడు

సింగనచే నిట్లు గుంటూరి విభుఁడుగాఁ జెప్పఁబడిన యీకొమ్మనను గూర్చి తద్వంశస్థుల పద్యమిరీతని తెల్పుచున్నది.

సీ॥ అతనికిఁ బుత్రుఁడై యలరు కొమ్మన మంత్రి కల్పించె పాటూరి కరణికంబు

అని గుంటూరి విభుఁడు పాటూరి కరణికము సంపాదించెనని చెప్పఁబడియున్న యీవిభుత నేమని పిలువ వలయునో చదువరులూహించుకొందురుగాక.

తద్వంశస్థులందఱు గుంటూరి విభులైయుండ సకల ప్రజ్ఞాధురీణుండగు తిక్కన మాత్రము విభుత్వమును మాని లెక్కలేని చిన్న సంస్థానాధిపతి యగు మనుమసిద్ధి యాస్థానమునఁ జేరుటకుఁ దగు కారణములుండఁబోలవు. కావున నీవిషయము నిటుల గ్రహించుట న్యాయము :—

మంత్రిభాస్కరుఁడు గుంటూరు గ్రామాధికారియగు నొక మంచి సంసారి. అతనికి దైవకృప వలన పుత్రరత్నములును, పౌత్రరత్నములును సంభవించి వంశమును వృద్ధిచేసిరి. వారిలో నగ్రగణ్యుఁడు తిక్కన. ఇతఁడు తన పాండిత్యమహిమ

---

* గ్రంథములందు పౌత్రుఁడై యని యున్నది. అది తప్పని యందఱునుఁ దలఁచుచున్నారు. కాని కొందఱు పితరుఁడై యనియుఁ, గొందఱు పుత్రుఁడైయనియు దిద్దుచున్నారు. పితరుఁడై యని దిద్దిన తిక్కన చెల్లెలని తెల్ప వలసినది తిక్కన తండ్రి కూతురని తెల్పుట తటస్థమగును గాన నది యసంగతమని శ్రీ శ్రీరామమూర్తి పంతులవారు మిక్కిలి సమంజసముగా నుడివిరి. తిక్కన పుత్రుఁడును కొమ్మన్నయే కనుక పుత్రుఁడై యని దిద్దుటయే న్యాయము. తిక్కన పౌత్రుఁడు కొమ్మన్నగాఁడు కనుక దిద్దుటయే యవసరము.

చే సరసుఁడగు నెల్లూరి మనుమసిద్ధి కడ నాస్థాన కవిగాఁ బ్రవేశించి తన ప్రజ్ఞావిశేషముచేఁ బుట్టిన వంశమునకును మెట్టిన యాస్థానమునకునుగూడ నౌన్నత్యమును దెచ్చినాఁడు. మనుమసిద్ధి రాజ్యము పోఁగాఁ దన పాండిత్యప్రభావముచే గణపతి దేవుని మెప్పించి మరల మనుమసిద్ధికి రాజ్యమిప్పించినాఁడు. మనుమసిద్ధి యొక సామంత రాజును నితనిచే నుపకృతి పొందినవాఁడునై యున్నాఁడు కావున రాజుకడ నాశ్రితుఁడుగానుండక యాప్తబంధువవలెనుండి మంత్రిత్వమును గూడఁ దానే నెరపుచుండెడివాఁడు. పేరు మనుమసిద్ధిదే గాని పరిపాలనము తిక్కనయే చేసెనని చెప్పవచ్చును. కవిత్వమును జెప్పి కవిబ్రహ్మయైనాఁడు. కృతులనంది కృతియైనాఁడు యజ్ఞమును జేసి సోమయాజి యైనాఁడు. పెక్కేల సర్వవిధములఁబ్రసిద్ధికెక్కినాఁడు. తన వంశస్థులఁగూడఁ దనకడఁ జేర్చినాఁడు. ఈమహనీయుని మూలముగా నావంశమంతయు ప్రసిద్ధికెక్కినది.

శ్లో॥ ఏకేనాపి సువృక్షేణ । పుష్పితేన సుగంధినా
వాసితం తద్వనం సర్వం । సుపుత్రేణ కులం యథా.

అనినట్లుగాఁ గవిబ్రహ్మ యను ఘన సుమనస్సౌరభ్యముచేఁ దద్వంశారామమంతయు నామోదభరితంబగుచున్నది. అంతటనుగూడ సువాసన యున్నట్లే తోఁచుచున్నది కాని యన్ని తావుల తావులు వెదజల్లుచున్న యాఘనసుమంబు తిక్కయజ్వయే కాని వేఱుకాదు. తిక్కన తన తాతను విశేషముగా వర్ణించియుండలేదు. మడికి సింగనఁ దద్వంశమును గూర్చి చెప్పుచుఁ దిక్కన కడ నుండియే ప్రారంభించినాఁడు. తద్వంశస్థులిప్పటికిని వాఁడుకొను పద్యమునందును.

సీ॥ భారతపర్వముల్పదియేను వరుసఁగాఁ దెనిఁగించె గుంటూరు తిక్కయజ్వ
యతనికిఁ బుత్రుఁడైయలరు కొమ్మనమంత్రి కల్పించె పాటూరి కరణికంబు
ఆకొమ్మనకుఁగల్గె హరిహరామాత్యుండు నెమ్మితో నతనికి కొమ్మఘనుఁడు
రహిమీఱ నతనికి రామన తిప్పన యారామనకు సోమనాహ్వయుండు

గీ॥ వీరమంత్రియు నిద్దఱు వేడ్కసుతులు । ప్రబలుఁడావీరమంత్రికి రామలింగ
మంత్రివకాళియువెలసిరిమహిమమీర । పరమసుగుణులు పాటూరిపురమునందు

అని తిక్కననుండియే ప్రారంభింపఁబడియున్నది. అంతకుఁ బూర్వులు గొప్పవారైయుండిన నట్లు జరుగదు. తిక్కనయును, మనుమసిద్ధియు (రాజ్యసహితముగ) పోయిన తరువాత మరల నీవంశస్థులకు గుంటూరి కరణికంబు తప్ప మఱియొకటి లేదాయె.

ఈరీతిగా నాలోచించి చూచిన మంత్రిభాస్కరుఁడు రాజులకడ గొప్ప యుద్యోగములు చేసినవాఁడైనట్లే తోఁచుట లేదు. అట్లు కాక గుంటూరి విభుఁడన గా గుంటూరి పాలకుఁడని ప్రతిపక్షులు తలఁచినట్లుగా నెంచినను అందుమూలముచే సాహిణిమారునికిని నీతనికిని సంబంధము కలుపుటకెంతమాత్రమును వీలులేదు.

హళక్కి భాస్కరుని విషయమట్టిది కాదు. ఈభాస్కరుఁడు సాహిణిమారన యాశ్రితుఁడైనట్లు అప్పకవీయమునందుదాహరింపఁబడిన యీక్రింది హళక్కి భాస్కరుని పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

క॥ అప్పలిడునతఁడు ఘనుఁడా? । యప్పడొసఁగి మరలఁ జెందునాతఁడు రాజా?
చెప్పఁగవలె సాహిణిమా । రప్పను దానమున ఘనుఁడు రాజునటంచున్.

మఱియు హళక్కి భాస్కరుఁడు సాహిణిమారన నుతించిన పద్యములనేకములు కలవని కవిజీవితములందుఁ దెల్పఁబడియున్నది. ఇంకను సోమదేవరాజీయమునందుఁ బ్రతాపరుద్రునిసభలో "హళక్కి భాస్కరుఁడు మొదలుగాఁగల ప్రబంధకవీశ్వరులిన్నూరుగురును * * * అశ్వంబుల కధికారియైన సాహిణిమారనయు" నున్నట్లు చెప్పఁబడియున్నది. దీనినిబట్టి చూచిన హళక్కి భాస్కరుఁడును సాహిణిమారుఁడును సమకాలికులని తెలియుటయేకాక యొకచోట నున్నవారని గూడ స్పష్టమగుచున్నది. అంతియకాక యీసాహిణిమారన పుత్రుఁడగు కుమారరుద్రదేవుఁడు హళక్కి భాస్కరుని శిష్యుఁడని పురాణనామచంద్రికయందుఁ దెల్పఁబడియున్నది. వీనికన్నిటికిఁ బ్రతిపక్షులంగీకరించిరి.

కాఁబట్టి సంబంధములేని మంత్రిభాస్కరుఁడు సాహిణిమారనకుఁ గృతియిచ్చి రామాయణమును రచించెననుటకన్న నత్యంత సంబంధము గల హళక్కి భాస్కరుఁడు రచించెననుటయే మిక్కిలి న్యాయము. మంత్రిభాస్కరుఁడు కూర్చెననుట యన్యాయము.

కృతికర్తలసంబంధము.

(3) రామాయణకవుల సంబంధము నాలోచించి చూచినను నేతద్యశస్సు హళక్కి భాస్కరునకు రావలసినదిగానే కాన్పించుచున్నది. బాల, కిష్కింధా, సుందర కాండముల విరచించినవాఁడు హళక్కి భాస్కరుని పుత్రుఁడు. అయోధ్యాకాండమును నిర్మించినవాఁడు హళక్కి భాస్కరుని ఛాత్రుఁడు, యుద్ధకాం

[illegible] యుండెను [illegible] హళక్కి భాస్కరుని మిత్రుఁడు [illegible] హళక్కి భాస్కరుఁడు [illegible] గావలెను. [illegible] పుత్ర మిత్రాద్యుత్కృతో హళక్కి భాస్కరుఁడను మనుజేశ్వరుడు రామాయణమును రచియించినట్లు చెప్పుచుండగ నేమి సంబంధము గలదని యడుగ మంత్రిభాస్కరుని [illegible] మంత్రిభాస్కరునకును నితఁడు [illegible] సంబంధము [illegible]. అట్లే సంబంధించి మంత్రిభాస్కరుఁడు [illegible] మంత్రిభాస్కరునకును హళక్కి భాస్కరునకును సంబంధము గలదను మాట [illegible] (సాహిణి మారనకు) [illegible] నుండియును [illegible] పుత్ర మిత్రులు [illegible] హళక్కి భాస్కరుఁడా [illegible] బడినవాఁడు గాక యతని మంత్రియని ప్రతిపక్షులచే పిలువఁబడు మంత్రిభాస్కరు నాశ్రయించి యతని [illegible] క్యము.

మంత్రిభాస్కరుఁడే [illegible] తరువాత నవి భాగవతమునకు నొసఁగె నని [illegible] హళక్కి భాస్కరుఁడు మొదలుగాఁ గలవారు దాని పూరించిరి అని ప్రతిపక్షులు వాదించుచున్నారు. ఇదియు నిరాధారమైన మాటయే. కానింతయు, [illegible] ప్రతికక్షులారా? [illegible] ఇంత [illegible] పోతన పుత్రుఁడైయుండిన పక్షమున భాగవతములోని భగ్నములైన భాగములను

* అయ్యలార్యుఁడు హళక్కి భాస్కరుని మిత్రుఁడును, సమకాలికుఁడును గాఁడనియు, రామాయణమున యుద్ధకాండములోని తుది భాగము [illegible] యుండఁగాఁ గొంత కాలమునకుఁ దరువాత నితఁడు పూరించెననియుఁ గొందఱూహించుచున్నారు, కాని యది బహుభంగ సంగతముగు తలంపు. ఏలయన, యుద్ధకాండములోఁ గొంతభాగము మిగిలి యుండిన నితర కాండముల వ్రాసిన [illegible] [illegible] భట్టారకులు [illegible] కారణముండఁ జాలదు.

[illegible] [illegible] [illegible] [illegible] వ్యాపించవలసి [illegible] [illegible] [illegible] [illegible] వ్యాపించెను. విశ్వనాథ [illegible] [illegible], [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] గొప్పకళ్యాణము, [illegible], [illegible] [illegible] మంత్రిభార్యయని [illegible] [illegible] [illegible]? కాళికేశ్వరభార్యలు [illegible] వ్యాపించవలసి వచ్చినది? [illegible] [illegible], మంత్రిభార్యకు [illegible] కాళికేశ్వరభార్యకు [illegible] [illegible] [illegible], విశ్వనాథ [illegible] [illegible]? [illegible] [illegible] తెలుపుడు. [illegible] మంత్రిభార్యయు [illegible] [illegible] [illegible] కలరు. కాళికేశ్వరభార్యకు [illegible] [illegible] పుత్రుడును, పుత్రికయును, [illegible] [illegible] [illegible] [illegible] [illegible].

[illegible] కాళికేశ్వరభార్యయు [illegible] [illegible] [illegible] [illegible] మంత్రిభార్యయు [illegible] [illegible], [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible], ఆరోగ్య సద్వంశము [illegible] [illegible] ఆరోగ్యకాంతయును [illegible] [illegible] కాళికేశ్వరభార్యయు [illegible] [illegible] వచ్చెను [illegible] [illegible] మంత్రిభార్యయు [illegible] [illegible] గా వ్యాపించినట్టి [illegible] [illegible] [illegible]. [illegible]! [illegible] [illegible]! [illegible] [illegible]. [illegible] [illegible], [illegible] [illegible] [illegible] ఆరోగ్యసద్వంశము [illegible] [illegible] [illegible] విషయమునకేని [illegible] భార్యయని [illegible] ఎక్కడ [illegible] ఆరోగ్యసత్వము [illegible] [illegible] [illegible] యుండియున్న [illegible] సంతసము నిశ్శంకముగా విరచించి యున్నాడు. [illegible] యారోగ్యకాంత విషయమునను గలపిన్న [illegible] కాళికేశ్వరభార్యకంటె మంత్రిభార్యకు [illegible] కారణముండెను. మంత్రిభార్యయని [illegible] మహా విశేషమైన విశ్వనాథ [illegible] యుండుటచేతనే యారోగ్యసద్వంశము [illegible] [illegible]

రింపక విడచి విరాట్పర్వము మొదలుకొని భారతమును తెలిఁగించినాఁడని తెల్పుదురు. ఆదినములలో నిట్టి భీతి సువివేకులకును, నవివేకులకును ధీరులకును, భీరులకును గూడ నుండెడిది గాని దాని బాఱిఁబడనివారుండెడివారు కారు. ఇట్లుండఁ బిల్లలు గల మంత్రిభాస్కరుఁడు మాత్రమీభీతికేల లొంగఁడాయెనను ప్రశ్న నిరుత్తరమగును. కావుననే యిది ప్రతిపక్షులు ధారాళముగాఁ జెప్పుయుక్తులలోఁ జేరక దొంగతనముగా లోకప్రవాదలో జేరి పనిచేయనున్నది.

రామాయణకవుల కాలము.

(4) భాస్కర రామాయణ కాలమును బట్టి చూచిన మంత్రి భాస్కరునకును రామాయణమునకును నేవిధమగు సంబంధము లేనట్లును, హుళక్కి భాస్కరునకును దానికిని బరిపూర్ణ సంబంధమున్నట్లును స్పష్టము గాక మానదు.

రామాయణము నన్నపార్యునకుఁ బూర్వమే తెనిఁగింపఁబడినదని కొందఱును నన్నయకుఁ దరువాతను దిక్కనకుఁ బూర్వమునను నాంధ్రీకరింపఁబడినదని మఱికొందఱును దలఁచుచున్నారు. అరసి చూడఁగా నీరెండును గూడ అబద్ధమని తోఁచుచున్నది. పలుకారణములనుబట్టి యిది తిక్కనకుఁ దరువాత పదునాల్గవ శతాబ్దమున విరచింపఁబడినట్లూహింపవలసి యున్నది. ఈయూహనుబట్టి చూచినఁ బ్రతిపక్షుల నీవఱకును బట్టి బాధించుచున్న చిక్కులు చాల తొలఁగిపోవును. వారి యితరవాదములకుఁ జాలబలముకలుగును. ఇది మనమిప్పుడేర్పఱచుచున్న "తృతీయః పంథ" కావున దీనిని గూర్చి చాల చర్చింపవలసియున్నది.

చరిత్రముల వ్రాయుట మన పూర్వులకంతగా నలవాటు లేకపోవుటచేఁ బూర్వకవుల కాలనిర్ణయమును జేయుటలో చాల చిక్కులుకలవు ఈవత్సరము మొదలీవత్సరమువఱకు నీకవి కలఁడని చెప్పుటకాధారములేవియు లేవు. కాఁబట్టి చదువరులును, మనమును గూడ సులభముగాఁ దెలుటకై శతాబ్దములను మాత్రము తీసికొందము. పలువురు మనుమరాజులు, అనేకులు ప్రతాపరుద్రులు, పెక్కురు రాజరాజులును గలరు కావున జాగ్రత కలిగి యుండవలయును.

ముందుగా మంత్రిభాస్కరుని కాలమునుగూర్చి చర్చింతము:—దీనిఁ దిక్కన కాలమునుబట్టి నిర్ణయింపవలెను గాని మఱియొక యాధారము లేదు. ఈతిక్కన కాలము విషయమై కవి జీవితములకును, గవుల చరిత్రమునకును జాల వివాదములు కలవు. మొదటిది నన్నయకును, దిక్కనకును నడుమ యెడము లేకుండఁ

జేయఁజూచుచుండఁగా రెండవది సాధ్యమగునంత యెడమును దెచ్చిపెట్టఁ బ్రయత్నించుచున్నది. ఈవివాదముల మూలముననే కాలనిర్ణయమునకు మనకుఁగొంత యాధారము లభ్యమగుచున్నది. వారు కొన్ని శాసనాదులను, వీరుకొన్ని శాసనాదులను జూపిరి. కావున వీనినన్నిటిని సాధ్యమగునంతవఱకు సమీక్షించి చూచుటలో వారివలె నీవలకును, వీరివలె నావలకును లాగక నడుమ నుంచుట న్యాయమని తోఁచుచున్నది.

గణపతిదేవుని యల్లుని శాసనమును, అంబర, రవి, శశి శాకాబ్దంబులను పద్యమును, సోమదేవ రాజీయాదులును, మడికి సింగన పద్యమును తిక్కన సోమయాజిని పండ్రెండవ శతాబ్దమధ్యమున నుంచుచున్నవి. గణపతిదేవుని కాలము మొదలగునవి పదుమూఁడవ శతాబ్దములోనికిఁ గూడ లాగుచున్నవని కవులచరిత్ర నుడువుచున్నది, కాని ఆలోచించి చూడఁగా మెకంజీ దొరవారు సంపాదించి చెన్నపురి రాజకీయ పుస్తకనిలయమునం దుంచిన వ్రాతప్రతులందున్న :—

క॥ అంబర రవిశశి శాకా । బ్దంబులు చనఁగాళయుక్తి భాద్రపద మా
సంబున నంబరమణిబిం । బంబునఁ బగు తిక్కయజ్వ బ్రహ్మముఁ జేరెన్

అను పద్యము యథార్థమని తోఁచుచున్నది. ఇది శాలివాహన శకాబ్దములు 1120 చన నఁగా 1121 వ శకాబ్దమున కాళయుక్తిని భాద్రపద మాసమున తిక్కన సోమయాజి మృతినొందెనని యతివివరముగాఁ దెల్పుచున్నది. ఇంతవివరముగాఁ దెల్పుచున్న యీపద్యము నిటీవలివారు కల్పించిరనుటకన్న నప్పటివారెవరో నిజమును వ్రాసిరనుటయే న్యాయముగానున్నది. లెక్కించి చూడఁగా శకవర్షము 1121 కాళయుక్తియే యగుచున్నది. తిక్కన సోమయాజి గణపతి దేవరాయని దర్శింపఁబోయెను గావునను గణపతిదేవుని రాజ్యము శా॥ 1121 నాఁటికి ప్రారంభము కాలేదు కావునను నీపద్యమును నమ్మఁజనదని కవుల చరిత్ర పలుకుచున్నది కాని యది నిరాకరణీయము. గణపతిదేవుని రాజ్యారంభ కాలమునుగూర్చి పలువురు పలువిధములఁ దెల్పుచున్నారు. వారువారిచ్చిన సంవత్సరముల నీక్రింద నుదాహరించుచున్నాఁడను.

ప్రమాణవర్షములు.

(1) విల్సను దొర	1115	1130	(4) సోమదేవరాజీయము (వచనము)
(2) ఏకామ్రనాథుఁడు	1130	1189	(5) ఔయిలరు దొర
(3) శ్రీరామమూర్తిగారు	1130	1199	(6) కవుల చరిత్ర

ష్ఠది. అది గాక మెకంజీదొరవారు కూర్చియుంచిన పుస్తకములలో [illegible]
ప్రతాపరుద్రుని శ్రీ [illegible] తిక్కన యామాత్యకవియును [illegible] తెలు
పబడియున్నది. [illegible] ఈ యాపుస్తకము
ను వ్రాసినట్లు కూడ సందేహమున్నది. తిక్కన భారత [illegible] లో —[illegible] అని [illegible]
వృత్తాంతముల గూర్చి [illegible] ప్రశంసించుటయు, నాక్క [illegible]
[illegible] అని వ్రాసిన వాక్యము కూడ [illegible]
టి గ్రంథమును వ్రాసినట్లు సూచించుచున్నది. కావున మొదటి ప్రతాపరుద్రుని
కాలమున భారతము తెనిగింపబడినదనియు తిక్కన మంత్రి [illegible] శతాబ్దమునాం
డనియు నెంచదగియున్నది. ఇంకా తిక్కన మంత్రి [illegible] శతాబ్ది మధ్యకా
నాడనియు, నతని తండ్రియగు మంత్రిభాస్కరుడు [illegible] శతాబ్దారంభ
మునను పదునొకండవ శతాబ్దాంతమునను నుండెనని యూహింపవలసి యున్నది.
మంత్రిభాస్కరునకు తిక్కన [illegible] పుత్రుని పుత్రుడు కావునను తిక్కన యుత్త
రరామాయణమును వ్రాయునప్పటికే భాస్కరుడు పరలోకమందున్నట్లు సూచి
పబడియున్నది. కావునను తిక్కనకును మంత్రిభాస్కరునకును వయస్సునందు చాల
యెడముండవచ్చును. రాయనప్రగడనే రాయనభాస్కరునిగా నెంచి [illegible]
యనభాస్కరుడే మంత్రిభాస్కరుడని, రాయన [illegible] శాసనమును బట్టి రామా
యణము పదుమూడవ శతాబ్దమందు వ్రాయబడినదని కవులచరిత్ర [illegible]
[illegible] మూడవ కులోత్తుంగ [illegible]
లచరిత్రకూడ నీమంత్రిభాస్కరుడు పదునొకండవ శతాబ్దాంతమందు" [illegible]
డ్రెండవ శతాబ్దారంభమందును నుండెనట్లొప్పుకొనుచున్నది. ఎట్లనగా:— "అతడు
(చోడగంగని) మంత్రి యని శాసనములయందున్నట్లు తెలియుచున్నది. [illegible]
[illegible] మొదలైననాటి (అనగా మంత్రిభాస్కరుని) కాలమునాటి నుండియు
మిక్కుటముగా సంభవించుచున్నది" అని కవులచరిత్ర [illegible] చెప్పుచున్నది. చోడగంగు
క్రీస్తుశకము 1077 సంవత్సరమున రాజ్యమునకు వచ్చినట్లు చెప్పబడుచున్నది. ఇ
ట్టి చోడగంగని కాలములో [illegible] మంత్రిభాస్క
రుడను పూర్వుడైనట్లు కవుల చరిత్రయే తెలుపుచున్నది. కాన మంత్రి భాస్క
రుడను పదునొకండవ శతాబ్దాంతమున నుండెననుటకు సందేహమునకు తావుండ
యేమాత్రము లేదు.

ఇఁక సాహిణి మారునిగూర్చి వ్రాయుదము. సోమదేవ రాజీయమునందలి కథలు యథార్థములని యందఱును నంగీకరించినారు. అందు హళక్కిభాస్కరుఁడును, సాహిణి మారఁడును రెండవ ప్రతాపరుద్రుని యాస్థానమందున్నట్లు దెల్పఁబడియున్నది. ఈప్రతాపరుద్రుఁడు పదుమూఁడవ శతాబ్దాంతమందును, పదునాల్గవ శతాబ్దారంభమందును రాజ్యము చేసెను. ఈప్రతాపరుద్రుని రాజ్య కాలములో సాహిణి మారప్ప దండనాథుఁడుగా నుండి ప్రతాపరుద్రుని మహమ్మదీయులుపట్టుకొని కారాగృహమునందుంచిన తరువాతఁ గొంతసీమకు (కొండవీడు కావచ్చును) రాజయ్యె. అప్పుడు రామాయణము వ్రాయఁబడినది కాఁబట్టి రామాయణము పదునాల్గవ శతాబ్దమందు వ్రాయఁబడినది.

ఇఁక మంత్రిభాస్కరుఁడు సాహిణిమారుని కాలమున నుండుటయు, రామాయణమును జేయుటయు నెట్లుపొసఁగును. పండ్రెండవ శతాబ్దారంభమందున్నవాఁడు మంత్రిభాస్కరుఁడు, పదునాలవ శతాబ్దమందున్నవారు సాహిణిమారనయు హళక్కి భాస్కరుఁడును, వీరికుభయులకును నడుమ రెండు వందలేండ్ల యెడము కలదు. మంత్రిభాస్కరుని మునిమనుమని కాలము తరువాతనున్న హళక్కిభాస్కరుని మంత్రిభాస్కరునితో సమకాలికునిజేసిన ప్రతిపక్షుల సామర్థ్యమును నేమని పొగడవలయునో తెలియకున్నది! ప్రతిపక్షులు తలఁచినట్లు మంత్రిభాస్కరుఁడు పదుమూఁడవ శతాబ్దారంభమందుండెనని వాదముకొఱకైన నంగీకరించినను నాతనికిని సాహిణి మారనకును నూరేండ్లయెడమున్నది. కావున నదియు లాభములేదు. ఇఁక నీప్రతాపరుద్రుఁడు మొదటివాఁడనియు సోమదేవరాజీయాదులందు పొరపాటునే మొదటివాఁడని వ్రాయుటకు బదులుగా రెండవ వాఁడని వ్రాయఁబడెననియు ప్రతిపక్షులొకచో వ్రాయశంకింపసైరి. ఇట్లనుకొననేల యన నిట్లనుండిన మనవారికి మంత్రిభాస్కరుని రామాయణకవులలో దూర్చుటకు వీలులేదు కాఁబట్టియే. తామేదో యొక తప్పటూహనుబడి దానిననుసరించి సిద్ధేశ్వర చరిత్ర, సోమదేవరాజీయము లోనగు గ్రంథములను దిద్దెదమనుచున్నారు. అంతియకాని చారిత్రాంశములకు లాభమేదియును లేదు. లాభము లేకపోవుటయ కాక నష్టముకూడఁగలదు. ఎట్లన సాహిణిమారుఁడు మొదట, ప్రతాపరుద్రుని కడ దండనాథుఁడే యైనను దరువాత రాజైనాఁడు. ఇతఁడు రాజనుటకుఁ బ్రతిపక్షులు చూపిన రామాయణపద్యమున్నే, నేనును నిట ఇచ్చుచున్నాఁడను.

క॥ శ్రీరామాకుచయుగళీ । హారిదోర్ల్లసితవక్షు హరిచరణసరో
జారాధ్యుఁడు మారయధర । ణీరమణోత్తముఁడు సాహిణితిలకమిలన్.

ఆరణ్యకాండము.

ఇతఁడు తరువాత రాజైన యెడల మొదటి రుద్రుని కాలమువాఁడని చెప్పుటకైతి కాదు. అప్పటివాఁడైన నితనికి రాజగుటకవకాశము లేదు. గణపతిదేవుఁడు మొదలగువారు బహు పరాక్రమము కలవారై రుద్రుని తరువాత పృథివి నేలియున్నారు. రెండవ ప్రతాపరుద్రుని తరువాత నన్ననో, యీసందు కలదు. ఈప్రతాపరుద్రుని తురుష్కులు హఠాత్తుగాఁ బట్టుకొని తీసికొనిపోయి కారాబద్ధుని చేసిన తరువాత సీరుద్రుని సేనానాయకులగువారు స్వతంత్రులై రాజులైనట్లు ప్రతిపక్షులే యంగీకరించుచున్నారు. అక్కడ సేనానిగానున్న ప్రోలయ వేమారెడ్డి వినుకొండ రాజ్యమును స్థాపించెను. అట్లు సాహిణిమారఁడును, దాను కొండవీడు రాజ్యమును స్థాపించెనని తోఁచెడిని మఱియును మొదటిప్రతాపరుద్రుని కాలములోని వాఁడు తిక్కన యని యిదివఱకు వ్రాసియుంటిమి కావున మంత్రిభాస్కరుఁడా రుద్రుని కాలములోనివాఁడును గాకుండుటచే దిద్దినను ప్రతిపక్షులకు లాభమేమియును లేదు. కావున దిద్దవలసిన యవసరము లేదు. రామాయణము పదునాల్గవ శతాబ్దమందు తెనిఁగింపఁబడినదనియే నమ్మవలయును.

ఇట్లెంచినచోఁ గవులచరిత్రకుఁ గలిగిన స్వవచనవ్యాఘాతదోషము తొలఁగిపోవును. అదియేదియన, కవులచరిత్ర "రాయనప్రగ్గడ" యని యున్న శాసనము నొకదాని నాధారము చేసికొని యారాయనను రాయనభాస్కరుని జేసి వాని మరల మంత్రిభాస్కరునొనరించి "భాస్కరరామాయణము పదుమూఁడవ శతాబ్దాదియందుఁ దెనిఁగింపఁబడినదని స్పష్టపడినది" అని పలికినది- ఇది యెంతన్యాయమో చదువరులకే యెఱుక. దానికేమి యది యట్లుండ మరలనింకొకచోట హుళక్కిభాస్కరునిగూర్చియు సాహిణిమారునిగూర్చియు ముచ్చటించుచున్న సోమదేవ రాజీయమునుబట్టి- "వీరిరువురును ప్రతాపరుద్రుని కాలములోనే యుండినపక్షమున, వీరు పదుమూఁడవ శతాబ్దాంతమందో పదునాల్గవ శతాబ్దారంభమునందో యుండియుందురు" అని నుడివినది. మొదటివాక్యములనుబట్టి రామాయణము పండ్రెండవ శతాబ్దాంతమందో పదుమూఁడవ శతాబ్దాదియందో వ్రాసినట్లు తేలె, రెండవదానినిబట్టి పదుమూఁడవ శతాబ్దాంతమందో పదునాలవ శతాబ్దాదియందో తెనిఁగింపఁబడినదాయె. ఇది

యిట్లుండ చోడగంగు కాలములోనివారు- భీమకవి, సాహిణిమారుఁడు, మంత్రిభాస్కరుఁడునని కవులచరిత్రయే తలఁచుచున్నది- కాఁబట్టి దీనినిబట్టిమంత్రిభాస్కరుఁడు పండ్రెండవ శతాబ్దాది నున్నవాఁడగుచున్నాఁడు- ఈగ్రంథమునుబట్టి చూచిన భాస్కరరామాయణము, పండ్రెండవ శతాబ్దాదిని, పదుమూఁడవ శతాబ్దాదిని, పదునాలవ శతాబ్దాదినిఁగూడ విరచింపఁబడిన దగుచున్నది! వీనిలో నేది నిజము? కవులచరిత్ర దేని, సిద్ధాంతము చేసినట్లు? ఏదియును జెప్పఁజాలక శ్లేష్మములోఁబడిన యీఁగవలెఁ గొట్టుకొనుచున్నది- ఇఁకనీబాధయెట్లుతొలఁగుననఁగా రామాయణమునందు నన్యాయముగా దూర్చఁబడిన మంత్రిభాస్కరుని లాగిపారవేయుఁడు- అప్పుడన్నియును జక్కఁబడును- రామాయణమువచ్చి పదునాలవ శతాబ్దమందుఁబడును- దానన్నియును ననుకూలమగును. సంబంధములేని పురుషుల శాసనాదులఁ బ్రమాణముగాఁగొని సంబంధముగల పురుషులనుగూర్చి ముచ్చటించుచున్న గ్రంథరాజముల దిద్దవలసిన యవసరము లేకపోవును.

మఱియును సాహిణిమారఁడు భీమకవి కాలమువాఁడైనట్లుగా నీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

ఉ॥ చక్కఁదనంబు దీవియగు సాహిణిమారఁడు మారుకైవడిన్
జొక్కపడంగలండు చలమున్బలముంగల యాచళుక్యపుం
జొక్కనృపాలుఁడుగ్రుఁడయి చూడ్కుల మంటలు రాలఁ జూచినన్
మిక్కిలి రాజశేఖరుని మీఁదికివచ్చిన రిత్తవోవునే

అని భీమకవి పల్కినట్లు ప్రజలు వాఁడుకొనుచున్నారు- కావున సాహిణిమారఁడు భీమకవి కాలమువాఁడగుచున్నాఁడు- కాన భీమనకాలమును గూర్చికూడ గొంతచర్చింతము- దాన సాహిణిమారుని కాలమును రూఢిపడును.

భీమనకాలమునుగూర్చి విచారించుటకును నాధారము లేవియును లేవు- చట్టిచాటుధారలు మాత్రమాధారముగానున్నవి- ఈచాటుధారల మనవారిష్టమువచ్చినట్లు గూర్చియున్నారు- కొన్నిగ్రంథములలోనున్న పద్యములఁగూడ దెచ్చి మఱియొకని చాటుధారలుగాఁ దేల్చియున్నారు కావునఁజాటువులందంతనమ్మకముంచుట న్యాయముకాకపోయినను మఱియొక యాధారమేదియును లేదు కావున వానినిబట్టియే చర్చింతము.

పైపద్యమునుబట్టియు నీక్రిందిపద్యమునుబట్టియు భీమన చొక్కనృపాలుని

కాలమువాఁడని తెలుచున్నది.

శా॥ ఆనీతాభ్యుపదాన శృంఖలపదాభ్యాలంచిత స్తంభమా
నేనే వేములవాడ భీమకవి నేనిం జిత్రకూటంబులో
భూనవ్యాపిత పల్లవోద్భవ మహాపుష్పగుచ్ఛంబులన్
నానా పక్వఫల ప్రదాయివగుమా నాకల్పవృక్షాకృతిన్.

అని, చోక్కరాజుద్యాన వనములో మల్లెసాల స్తంభమునఁ గాలూదుకొని కూర్చుండియుండి భీమకవినిఁజూచి యీస్తంభమును వృక్షముగాఁజేయుమని యడుఁగఁగాఁ బైపద్యమును భీమనచెప్పినట్లు లోకప్రతీతికలదు. ఈపద్యమునుగూర్చి కవులచరిత్రి యిట్లువ్రాయుచున్నది. "ఈపద్యమును భీమకవిపేరుపెట్టి యెవ్వరో యిటీవలివారు కల్పించియుందురు- ఇది భీమకవి కవిత్వమేయైనపక్షమున, ఆమహాకవి భువనమనుటకు భూనమనియు, నాకల్పవృక్షమనియు విరుద్ధప్రయోగములను జేసియుండఁడు" అని. ఇటఁ గవులచరిత్ర కేవలమునుభ్రమపడి యీవెఱ్ఱివ్రాత వ్రాసినది. ఈకవులచరిత్రతో భీమకవి భువనమనుటకు భూనమన్నాఁడని యెవరుతెల్పిరి? ఇది యెక్కడిపదవిభాగజ్ఞానము?! భూనవ్యాపితపల్లవ &c. అనినప్పుడు భూ*నవ్య*ఆపిత*వల్లవ &c అని పదవిభాగము. భూమియందు, నూతనముగా, వ్యాపింపఁజేయబడిన, చిగుళ్ళు &c అని యర్థము. అంతియకాని కవులచరిత్ర తలఁచినట్లుగా, భూన*వ్యాపిత*పల్లవ &c అని యెంతమాత్రమునుగాదు- ఇదయపార్థము. మఱియును "నాకల్పవృక్షాకృతిన్" అనునది కవితప్పియుండదు- పాఠకులు తాముచదువుటలో ననేకములగు పద్యముల లక్షణశూన్యములఁ జేయుచున్నారు- వీరిమహిమచేఁ జెడిన పద్యములు భారతాదులందునుగలవు- అవియన్నియు గవిత్రయమువారివనుట యెట్లున్యాయముకాదో యిదియునట్టిదే- కవి "నాకస్థవృక్షాకృతిన్" అని వ్రాసియుండఁగా మిడిమిడిజ్ఞానము కలవారు దానిఁబఠించుటలో "నాకల్పవృక్షాకృతిన్" గా మార్చియుందురు- కాఁబట్టి కవులచరిత్ర తలఁచినట్లుగాఁ బద్యమునందు దోషములున్నవి కావుననది భీమనదికాదనుట న్యాయముకాదు- అదియటుండఁ జోక్కనృపాలుని కాలములోనివాఁడు భీమనయని తెలిసను నీచోక్కనృపాలుఁ డెప్పటివాఁడో తెలిసికొనుట కాధారములులేవు- ఎట్లుచెప్పుచున్నదో కాని కవులచరిత్ర యీతఁడు పదుమూఁడవ శతాబ్దములోనివాఁడని తెల్పుచున్నది- కాఁబట్టి మనపక్షమునకు హానిలేదు- భీమకవి పదుమూఁడవ శతాబ్దాంతమువాఁడని దానినిబట్టి త

త్కాలికుఁడగు సాహిణిమారనయు నప్పటివాఁడేయనియు నట్లయిన సోమదేవరాజీయమునందుఁ జెప్పఁబడినది రూఢిపడుచున్నదనియు వక్కాణింపవచ్చును.

మఱియు నీక్రిందిపద్యమువలన భీమకవి రాయకళింగగంగు కాలమువాఁడని తెలియవచ్చుచున్నది.

ఉ॥ వేములవాడ భీమకవి వేగమె చూచి కళింగగంగుతా
సామము మాని కోపమున సందడి దీఱిన రమ్ము పొమ్మనెన్
మోమును జూడ దోషమిఁక ముప్పది రెండు దినంబులావలన్
జామున కర్ధమందతని సంపద శత్రులఁ జేరుఁ గావుతన్.

అని భీమకవి గంగును శపించినట్లును నాశాపముతగిలి యాతఁడు రాజ్యభ్రష్టుఁడైనట్లును వాడుకకలదు కాని యీకళింగగంగెప్పటివాఁడో తెలియరాదు. రాజనరేంద్రుని తాతయగు దాననృపాలుని గళింగులు రాజ్యపదభ్రష్టునిజేసిరనియు నాకాలములో రాజ్యముచేసినవారిలో రాయకళింగగంగొక్కఁడనియుఁ గవులచరిత్ర వాకొనుచున్నదికాని యది నమ్మఁదగినదికాదు. కళింగులు దాననృపాలుని జయించినట్లెచ్చటను జెప్పఁబడియుండలేదు. దాననృపుఁడు 3 ఏండ్లు రాజ్యముచేసినతరువాత నేకారణముననో (వేఁగి) భూమి కొంతకాలము అరాజకమైనది. దానికిఁగారణము తెలియదని యీవఱకునుగలచారిత్రకులువ్రాసిరి. మఱియును గవులచరిత్ర కళింగదేశమును బరిపాలించిన చోడగంగే యీరాయకళింగ గంగేమోయని సంశయించుచున్నదికాని యదియును సరిపడియుండలేదు. కళింగదేశాధీశ్వరుఁడైన చోడగంగును భీమకవి పెద్దాపురమునకు సమీపమందున్న సజ్జనగరంబున *(సజ్జాపురము) పట్టము కట్టుకొమ్మనుట పొసఁగనేరదు కాఁబట్టి మనవేఁగిదేశమందే మనగోదావరీ మండలమందే కొంతసీమను ఈరాయకళింగగంగు పరిపాలించెను గాని కళింగదేశాధీశ్వరుఁడితఁడెంతమాత్రమును గాఁడని తలపఁవలసియున్నది. భీమనయు గోదావరీ సీమయందుఁగల రాజులనే దర్శించుచు వచ్చెను గాని దూరముపోయి యుండలేదని తోఁచుచున్నది. గంగుతండ్రి రాజరాజగుటచే నీతనికి రాజకళింగగంగను నామమువ

※ సజ్జాపురము, పెద్దాపుర సమీపమందుఁగలదని కవులచరిత్ర పలుకుచున్నది కాని యాపేరిగ్రామమా ప్రాంతముల మృగ్యము. తణుకుతాలూకాయందొక సజ్జాపురముకలదు

చ్చెనని కవులచరిత్ర నడుపుచున్నది కాని యితఁడు రాయకళింగగంగుగాని రాజకళింగగంగుగాఁడు. కాన కవులచరిత్రమాట నిరాధారమైన మాటయేకాని వేఱుకాదు, కాని యీక్రిందిపద్యమునుబట్టి యీకళింగగంగు ఎప్పటివాఁడో తెలిసికొనుటకుఁ గొంతయవకాశము చిక్కుచున్నది- భీమకవి శపించినతరువాత కాకతాళన్యాయముగా రాయకళింగగంగు పరులచే జయింపఁబడఁగా నాతఁడు దీనుఁడైయున్న కాలములో మరల భీమకవి.

ఉ॥ వేయిగజంబులుండఁ బదివేల తురంగములుండ నాజిలో
రాయల గెల్చి సజ్జనగరంబునఁ బట్టము కట్టుకో వడిన్
రాయకళింగగంగుఁ గవిరాజు భయంకరమూర్తి చూడఁడాఁ
బోయిన మీనమాసమునఁ బున్నమపోయిన షష్ఠినాటికిన్.

అనిచెప్పినట్లు ప్రతీతికలదు- ఇందు “రాయల” గెల్చుకొమ్మని తెల్పినాఁడు ఈరాయలెవరని వితర్కింపవలసియున్నది- ఈరాయలె యీగంగును రాజ్యభ్రష్టునిఁ జేసినవాఁడు. రాజనరేంద్రునాటికి “రాయల” ను వ్యవహారము కలవారెవరును గానరారు- ఇట్టివ్యవహార మిటీవలగలిగినది- ఆలోచించిచూడఁగా నీరాయలు శ్రీనాథునిపద్యమందలి “చంద్రసేఖర క్రియాశక్తి రాయలయొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమబిరుదు” అను పాదమందున్న రాయలేయని తోఁచుచున్నది- శ్రీనాథునకుఁ గవిసార్వభౌమ బిరుదునిచ్చినవాఁడు “ఆంధ్రరాయలు” అయినట్లు అందఱు నంగీకరించిరి- కావునఁ గళింగగంగుతో భీమకవి రాయలగెల్చుకొమ్మని చెప్పినదీయాంధ్రరాయలననియే తోఁచుచున్నది- ఏలయన నీయాంధ్రరాయల భీమకవి స్తుతించినట్లుగా నీక్రిందిపద్యమువలన తెలియవచ్చుచున్నది.

మ॥ ఘనుఁడన్ వేములవాఁడవంశజుఁడ దాక్షారామభీమేశనం
దనుఁడన్ దివ్యవిషామృతప్రకటనానాకావ్యధుర్యుండ భీ
మన నాపేరువినంగఁ జెప్పితిఁ దెలుంగాధీశ, కస్తూరికా
ఘనసారాదిసుగంధవస్తువులు వేగందెచ్చిలాలింపురా.

ఈపద్యమువలన భీమకవి తెలుఁగురాయలు అనఁగా ఆంధ్రరాయల కాలములోనివాఁడగుట నిర్వివాదముగాఁ దెలియవచ్చుచున్నది- కావునఁ గళింగగంగు పద్యములోని “రాయలు” తప్పక యాంధ్రరాయలని గ్రహింపవలయును. భీమకవి కస్తూరినిమ్మని యాచించిన యీతెలుంగాధీశుఁడు శ్రీనాథునికాలములోని తెలుంగా

ధీశుఁడేయనుటకింకొక మంచినిదర్శనముకలదు- ఈతెలుఁగురాయఁడు కస్తూరిమొదలగు సుగంధద్రవ్యముల విశేషముగాఁ గలిగియుండెడివాఁడని తోఁచుచున్నది- ఈ క్రిందిపద్యమున శ్రీనాథుఁడుకూడ నీతెలుఁగురాయని కస్తూరినిమ్మనియే గోరినాఁడుఁ

ఉ॥ అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా
భిక్షాదానము సేయురా సుకవిరాడ్బృందారకశ్రేణికిన్
దాక్షారామపురీవిహారవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించు దత్వాసనల్.

అని శ్రీనాథుఁడు తెలుంగాధీశునితోఁ బల్కినట్లు లోకమునవాఁడుకకలదు- భీమనయు, శ్రీనాథుఁడును తెలుంగాధిశుని సభకేగుటయు కాక యిద్దఱును కస్తూరినిఁగోరిరి- ఈయాంధ్రిరాయలు కస్తూరికిఁ బ్రసిద్ధికెక్కిన వాఁడనుటకు నీక్రింది శ్రీనాథుని “రంభఁగూడెఁ దెనుంగు రాయరాహుత్తుండు కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు” అను పద్యపాదము రూఢిపఱచుచున్నది- దీనినిబట్టియీ తెలుఁగురాయఁడొక్కఁడేయని కనుంగొనవచ్చును. భీమకవి సాహిణిమారునకును లేక హళక్కిభాస్కరునకును శ్రీనాథునకును మధ్యకాలములోని వాఁడనఁగా సాహిణిమారుని తుదికాలమునందును శ్రీనాథుని యుదయకాలమునందును నున్నవాఁడు- మనకిప్పుడు వీరేశలింగము పంతులవారు మొదలగువారెట్టివారో శ్రీనాథునకు భీమకవియట్టివాఁడు- శ్రీనాథుఁడు కవిత్వమారంభించునాటికి భీమకవి ‘యుద్దండలీలను’ గవిత్వముచెప్పువాఁడను ప్రసిద్ధికలవాఁడైయున్నాఁడు- కావుననేయితఁడు కాశీఖండమున నిట్లు చెప్పియున్నాఁడు:—

సీ॥ వచియింతు వేములవాఁడభీమనభంగి నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టుమార్గంబున నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తుఁ దిక్కయజ్వప్రకారము రసాభ్యుచితబంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని తెవసూక్తివైచిత్రి నొక్కొక్కమాటు
నైషధాదిమహాప్రబంధములు పెక్కు। చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడవనఘ
యిపుడు చెప్పఁదొడంగినయీప్రబంధ। మంకితము చేయువీరభద్రయ్యపేర.

అని ఇందు వేములవాఁడ భీమకవి యుద్దండకవిత్వమునకుఁ బ్రసిద్ధికెక్కినట్లు చెప్పియున్నాఁడు- ఈపద్యమునే యాధారముచేసికొని కొందఱు భీమకవి నన్నపార్యునకుఁ బూర్వుఁడనియు నందుమూలముచేతనే శ్రీనాథుఁడు నన్నయకంటె ముదుం భీమకవినిస్తుతించెననియుచెప్పుచున్నారు- కాని యదినిరాకరము- భీమకవి శ్రీనాథునకు

పూర్వకవి యెంతమాత్రమునుగాఁడు- కావుననే యీపద్యమునందు నాతనిముందు డినను బూర్వకవిస్తుతులలో నితనినిఁ జేర్చియుండలేదు. ఈపద్యము పూర్వకవి స్తుతిచే యునప్పుడు చెప్పినదికాదు- ఈతఁడు తనగ్రంథము లన్నిటియందును బూర్వకవి స్తుతిచేసినాఁడు- కాని వానియందెచటను నితనిస్మరింపలేదు- వానియందుఁ దఱచుగా నన్నయతిక్కనలను గొన్నిటియందుఁగవిత్రయమువారిని స్తుతించియున్నాఁడు-శ్రీనాథు నకు ఎఱ్ఱాప్రగ్గడయు నాథునికుఁడేయైనను సమకాలికుఁడుఁ కాఁడు-భీమకవిపేరెత్తిన కాశీఖండమునందుఁగూడ;—

గీ॥ శబ్దశాసనునన్నపాచార్యవర్యు । సత్కవిశ్రేష్ఠుదిక్కయజ్వనుభజించి
సత్ప్రబంధపరమేశ్వరు శంభుదాసు । నధికతరభక్తిసంయుక్తినాదరించి.

అని గవిత్రయమువారినే పూర్వకవులనుగా స్తుతించె- ఇదతయు నాలోచించిచూడఁగా భీమన శ్రీనాథునకుఁ బూర్వుఁడు కాఁడనియుఁ దనకాలముననే సుప్రసిద్ధుఁడనియు నమ్మఁదగియున్నది- శ్రీనాథుఁడు తనప్రజ్ఞావిశేషమును బ్రచ్ఛుటించుచు భీమకవి పేరెత్తినంతమాత్రమున నతని పూర్వుఁడనఁజనదు- ఇట కవుల వరుసనుబట్టి వారికాలముల నిర్ధారణము చేయుటతగదు-అట్లుచేయుదుమేని శ్రీనాథుఁడు తనప్రజ్ఞ నుగూర్చి పైపద్యము చెప్పుకొనినట్లె గణపవరపు వేంకటకవి తనప్రజ్ఞనుగూర్చి యిట్లు వ్రాసికొనినాఁడు.

సీ॥ అలవిన్నకోటపెద్దనలక్షణజ్ఞత శబ్దశాసనకవిశబ్దశుద్ధి
ప్రాబంధికపరమేశ్వరు నర్థమహిమంబు భయకవిమిత్రునిపదలలితత &c.

ఇందు విన్నకోట పెద్దన్నను కవిత్రయము వారికంటెను వేంకటకవి ముందుఁ జెప్పియున్నంతమాత్రమునఁ బెద్దన్నను గవిత్రయము వారికంటెను బూర్వుఁడని చెప్పవచ్చునా? అట్లెభీమకవినిఁగూడఁ జెప్పరాదు- శ్రీనాథుఁడు పూర్వసుకవులలో నీతనిచెప్పలేదుకావున నీతఁడు శ్రీనాథునకాధునికుఁడనియే యెంచవలయును.

ఇంకను భీమకవి యించుమించుగా శ్రీనాథుని కాలమువాఁడని తెలిసికొనుట కు నీక్రింది భీమనపద్యము సాహాయ్యంబొసంగుచున్నది.

సీ॥ గడియలోపలఁదాడి కడఁగిముత్తునియఁగా దిట్టినమేధావి భట్టుకంటె
రెండుగడెలబ్రహ్మదండి ముండ్లన్నియు డుల్లదిట్టిన కవిమల్లుకంటె
మూఁడుగడియలకు మొలసియెత్తినగండి పగలఁదిట్టిన కవిభానుకంటె
నరజాములోపలఁ జెఱువునీళ్ళింకంగ దిట్టిన బడబాగ్నిభట్టుకంటె

గీ॥ నుగ్రకోపివేను నోపుదు శపియింపఁ । గ్రిమ్మరింపశక్తి గలదు నాకు
వట్టిమ్రానఁ జిగురు పుట్టింపఁగిట్టింపఁ । బిరుద వేములాడ భీమకవిని.——

ఇది భీముని పద్యమని లోకమున వాడుకకలదు- ఇందలి పురుషులందఱును దిక్కనకుఁ దరువాతివారును బదునాలవ శతాబ్దాంతము నాఁటివారును నైయున్నారు- ఇందు "వేములాడ" అను నపప్రయోగముండుటచే నిది భీమకవి పద్యము కాదని కవులచరిత్ర నుడువుచున్నది కాని యది సమాదరణీయమగు మాట కాదు- లోకవ్యవహారమున గ్రామనామములం గల వాడశబ్దము యొక్క వకారమునకు లోపము వచ్చుటయును గలదు- పొన్న*వాడ=పొన్నాడ, పెద్ద*వాడ=పెద్దాడ మొదలగువాని నూహించుకొనునది- లక్ష్మణకవి తన భర్తృహరిలో:——

ఉ॥ కూడికచెంది కొన్నతమ కూరిమికీరమ దెట్లు పల్కునట్
వేడుక సేయు చందమున నీదయఁ గాంచిన నాకవిత్వమే
జాడ వహించియున్నఁ గడు సమ్మదమే ఘటియించు నీకుఁ బె
ద్దాడపురీనివాస నిజదాస శివంకర సోమశంకరా.

అని "పెద్దవాడ"ను "బెద్దాడ" యని వాడినాఁడు- ఈరీతినే వేములాడయును సాధువే యగును- లోకమున వేములాడయను వ్యవహారమును గలదు- మఱియు నాంధ్రరాయలు త్రవ్వించిన చెఱువును దిట్టిన బడబాగ్ని భట్టు రాయల కాలములోనే యనఁగా భీమన కాలమందే యుండవచ్చును- కవులచరిత్ర తలఁచినట్లుగా వారికి తరువాత నుండవలసిన యవసరము లేదు- కవిమల్లు ప్రౌఢకవిమల్లన కాకపోవచ్చును- మల్లుభట్టను కవియొకఁడు కలఁడు- అతఁడే యితఁడు కావచ్చును- సాళువతిమ్మరాజును బదునైదవ శతాబ్దారంభము నాటివాఁడని చెప్పవచ్చును- ఇది భీమన పద్యము కాదనుట కవకాశ మించుకయును లేదు.

మఱియును గవిత్రయమును బ్రయోగించిన పదములనే కాని వేఱుపదములను కవులు ప్రయోగింపఁగూడదని వీరికి వెనుక కవిరాక్షసుఁడు నియమము చేసెనని కవులచరిత్ర నుడువుచున్నది- అంతియ కాక మఱియొకచోట కవిరాక్షసుఁడనఁగా భీమకవియని యాకవులచరిత్రయే తలఁచుచున్నది. కాఁబట్టి యిదియే నిజమగునేని భీమన కవిత్రయము వారికిని దరువాతివాఁడని తేలి మనము వ్రాసినదానిని రూఢిపఱచుచున్నది- అది నిజమైనను గాకున్నను భీమకవి "కవిజనాశ్రయము" అను వ్యాకరణమును జెప్పెనని లోకవదంతి కలదు. ఈలక్షణగ్రంథము తిక్కనకు పూర్వపుదైన మొదల

ఆంధ్రశబ్దచింతామణికివచ్చిన యాక్షేపణమే దీనికినివచ్చును- ఎట్లన నీకవిజనాశ్రయము తిక్కనకన్నఁగాఁ గేతనకుఁ బూర్వపుదైనయెడల, కేతనతన, యాంధ్రభాషాభూషణమందు.

క॥ మున్ను తెలుఁగునకులక్షణ । మెన్నఁడు నెవ్వరును జెప్పరేఁ జెప్పెదవి
ద్వన్నికరముమదిమెచ్చఁగ । నన్నయభట్టాదికవిజనంబులకరుణన్.

సీ॥ సంస్కృతప్రాకృతాదిలక్షణము చెప్పి । తెలుఁగునకులక్షణము మున్న తెలుపకునికి
కవిజనంబులనేరమి కాదునన్ను । ధన్యుఁగావింపఁదలఁచినతలఁపుగాని.

అని యెట్లుచెప్పఁగలుగును? కావునఁ గవిజనాశ్రయము తిక్కనాపల కీవల దని యెంచుటసముచితము- అట్లెంచిన మనముచెప్పినది వ్యర్థమైనది- ఊరకనిగా నెంచిచూచిన భీమకవి, హాళక్కిభాస్కరుఁడు, సాహిణిమారుఁడు మొదలగువారు తిక్కనకుఁ దరువాతివారైనట్లు స్పష్టమై మొదట మనముచెప్పినది బలపడుచున్నది

భీమనరాఘవ పాండవీయమను ద్వ్యర్థికావ్యమును జేసియున్నాఁడు- కావున నీతఁడు ఆంధ్రవాణియొక్క ప్రారంభదశలోనివాఁడు కాఁడనియు నామెయొక్క యౌవనదశలోనివాఁడనియుఁ దేలుచున్నది- ఈతనినాటికి మనవారిచే మిక్కిలి గౌరవింపఁబడు భారతరామాయణములు రెండును దెనిఁగింపఁబడి యుండుటచేతనే యీతఁడు రెంటినిజోడించి రాఘవపాండవీయమును రచించియుండును.

మఱియును "గరళపుముద్దలోహము" అనుపద్యము ఖడ్గతిక్కనదికాక మైలమభీమనదనియు మైలమభీమన నన్నపార్యుని కాలములోనివాఁడు కావున నాపద్యమును జెప్పిన భీమకవియు నాటివాఁడేయనియుఁ గొందఱు చెప్పుచున్నారు కాని దీనికి విఘాతములనేకములు కలవు- ఆపద్యము ఖడ్గమును గూర్చిన విపరీతవర్ణనము కలదైయున్నది- మైలమభీమన పరాక్రమవంతుఁడేయైనను గత్తికిని ఖ్యాతికలవాఁడను ప్రత్యేకపువాడుకలేదు- తిక్కనకన్నో యట్టిఖ్యాతికలదు- ఖడ్గతిక్కఁడను నతనిపేరే యీరహస్యమును దెల్పఁగలదు- కావున నీఖడ్గవర్ణనము ఖడ్గతిక్కన ఖడ్గముదననొప్పును- అదిగాక ఖడ్గతిక్కనను భీమనదీవించినట్లు ప్రతీతికలదు- వీనినన్నిటిని బట్టిచూచిన తిక్కకవికి తమ్ముని (పెదతండ్రికుమారుని) కొడుకను వాడుకగల యీతిక్కనకాలములో భీమనయుండెననిన మనపక్షమునకే బలముకలుగుచున్నది- ఈపద్యము మైలమభీమనను గూర్చినదైనయెడల భీమన చాటుధారయనఁగా

భీమన చెప్పినదిగాక (మైలమ) భీమననుగూర్చిన చాటుధారయని ※భావము కావచ్చును గాన దానివలన బాధలేదు.

ఏవిధమునఁ జూచినను భీమన తిక్కనామాత్యుల కిటీవలఁబడుచున్నాఁడు- కాఁబట్టి భీమనకాలమందున్న సాహిణిమారుని కంకితముగా తిక్కనకుఁ బూర్వుఁడగు మంత్రిభాస్కరుఁడు రామాయణమును వివరించెననుట యసంగతము.

ఇట్లు తలంచుటచేఁ గవులచరిత్రయొక్క చిక్కొకటికూడఁ దీరిపోవును- కవులచరిత్ర సాహిణిమారుని మంత్రిభాస్కరుని సమకాలికులఁ జేసినదని యిదివఱకే వ్రాసితిమి- ఇప్పుడు భీమనను సాహిణిమారుని కాలమువానిని జేసినదికాఁబట్టి భీమకవి మంత్రిభాస్కరుని కాలములోని వాఁడైనాఁడు- అనఁగాఁ బండ్రెండవ శతాబ్దాదియందలి వాఁడైనాఁడు- ఇట్లుండ మరల నాకవులచరిత్రయే భీమునిగూర్చి యిట్లు వ్రాయుచున్నది.

“ రామవిలాసములో:—

క॥ ఆమాచనృపతి సుతుఁడుమ । హామహుఁడై యపోత సచివమాధీశ్వరుఁడా
శ్రీమంతుసుతులు జగదభి । రాములు శ్రీతెలుఁగురాయఁ రామనరేంద్రుల్.

అని గుడిమెట్టరాజగు నేఁ అపోతరాజుకొడుకు తెలుఁగురాయఁడొకఁడు చెప్పఁబడియున్నాఁడు- ఈ తెలుఁగురాయఁడు పదుమూఁడవ శతాబ్దమధ్యమునందుండిన వాఁడు కవి యీతెలుఁగురాయనిగూర్చియే యీపద్యమును జెప్పినయెడల ఇతఁడు తిక్కనకాలములోనో తిక్కనకుఁ గొంచెముముందో యుండియుండును- తిక్కన పేరైనను తనగ్రంథములోఁ జేర్కొనకుండుటకూడ నితఁడు తిక్కనకు మిక్కిలి పూర్వపువాఁడు కాఁడేమోయను సంశయము పుట్టించుచున్నది ”

చూచితిరా భీమన తాతకాలమువాఁడని యొకచోటను మనుమని కాలమువాఁడని మఱియొకచోటను నుడువుచున్నది- అదిగాక పదుమూఁడవ శతాబ్దమధ్యమునున్న తెలుఁగురాయని కాలములో భీమకవియుండినయెడల నతఁడు తిక్కనపుత్రుని కాలమువాఁడగును గాని తిక్కన కాలములోని వాఁడే కాఁడు- తిక్కన పదుమూఁడవ శతాబ్దమధ్యమువఱకును లేనేలేఁడు- పదుమూఁడవ శతాబ్దమధ్యమున రెండవ

※ఇట్లర్థము చెప్పుట లోకమునఁ దఱచువాడుక లేకపోయినను నిట్టిచోట్ల నిట్టియర్థము చెప్పుకొనుట కభ్యంతరముండదు.

ప్రతాపరుద్రుఁడు రాజైయుండెనుగాన నీవిధమునఁజూచినను భీమనయు సాంబనితో మారనాదులును తిక్కనతరువాతివారును 2 వ ప్రతాపరుద్రుని కాలమువారునునైనను వాదమును బలపఱచుచున్నారు- ఇట్లుండఁ దిక్కనుండి కవులచరిత్ర యెట్లు తప్పించుకొనినది? ఎంతమాత్రమును దప్పించుకొనలేదు- వలలోఁబడిన పురుగువలె గిలగిలఁ గొట్టుకొనుచున్నది కాఁబట్టి యన్యాయముగా రామాయణముతోఁ గలుపఁబడిన మంత్రిభాస్కరుని సంబంధమును సరిసఁ దప్పింపుఁడు- అప్పుడు చిక్కువిడి పైటంబడును- అప్పుడు తిక్కనకీవలివాఁడుగాఁ గాన్పించు భీమకవిని తిక్కనకుఁ బూర్వమునఁ జేర్పవలసిన యవసరము లేకుండఁబోవును- భీమన తిక్కనకుఁ దరువాతివాఁడగును- అప్పుడు తిక్కన భీమకవిని స్తుతింపకుండుటకుఁ గారణము విస్పష్టముగాఁ దెలియును.

ప్రతిపక్షులు రంగనాథరామాయణము భాస్కరరామాయణము కంటె ముందుగా విరచింపఁబడినదని తలఁచుచున్నారు- మఱియు రంగనాథ రామాయణమందు బుద్ధరాజు 'కవిలోకభోజుఁడ' ని చెప్పఁబడెననియు నందుమూలమున శ్రీరంగనాథరామాయణమును కృతినందిన బుద్ధరాజు, లోకమున భోజుఁడు మిగులఁ బ్రసిద్ధికెక్కిన తరువాత నుండెననియుఁ దలఁచుచున్నారు- భోజుఁడు పదునొకండవ శతాబ్దాంతమునను (పండ్రెండవ శతాబ్దాదియందును) నున్నట్లు శాసనములవలనఁ దెలియవచ్చుచున్నదని కవులచరిత్రయే వాకొనుచున్నది- ఇది నిజమైనచో మంత్రిభాస్కరునకును రామాయణమునకును సంబంధము కలుపుటకువీలులేదు- ఏలయన మంత్రిభాస్కరుఁడు పండ్రెండవ శతాబ్దారంభమునందున్నాఁడు- అనఁగా భోజుని కాలమందున్నాఁడు- అంతకుఁబూర్వమే బుద్ధరాజుండిన నతనికిఁ గవిలోకభోజుఁడనుట తటస్థముకాదు- కావునఁ గవులచరిత్రకుఁ గలిగిన యీచిక్కెట్లు తొలఁగును? న్యాయదూరముగా రామాయణముతో మంత్రిభాస్కరునకుఁ గలిగిన సంబంధమును లాఁగివేయుఁడు- అప్పుడు భాస్కరరామాయణమువచ్చి పదునాలవ శతాబ్దమందుఁ బడును- అంతకుఁబూర్వమందు విరచింపఁబడిన రంగనాథరామాయణమందుఁ గవిలోకభోజుఁడను వాడుక యుండుటకు వీలుండును.

మఱియును మంత్రిభాస్కరుఁడు రాయనభాస్కరుఁడేయని కవులచరిత్ర నుడువుచున్నది- రాయనభాస్కరుఁడు శంభుదాసున కాశ్రయుఁడగు అనవేమారెడ్డి కాలమువాఁడని పైన నుదాహరింపఁబడిన చింతకొంట కోదండరామకవి పద్యమువల

నఁ దెలియవచ్చుచున్నది. కావున రాయనభాస్కరుఁడే మంత్రిభాస్కరుఁడగునెడల నీతఁడు తిక్కనకుఁ దరువాతివాఁడు కావలయును. తాత మనుమనికిఁ దరువాతివాఁడు కావలసివచ్చినది. ఇంతకన్న వింతకలదా! ఇంకను రాయనభాస్కరుఁడు కృష్ణదేవరాయల కాలములోనివాఁడని మఱికొందఱు తలఁచుచున్నారు. అట్లయినఁ బ్రతిపక్షులవాదము మఱింతసొగసుగ నుండును. అంతియకాక కవులచరిత్ర రాయనభాస్కరుఁడు వేఱు మంత్రిభాస్కరుఁడు వేఱునని యొకచోటను అట్లు కాదు, ఇద్దఱునొకరేయని మఱియొకచోటను నీరీతిగా విరుద్ధము గాఁబలుకుచున్నది. ఈచిక్కులెట్లు తొలఁగును? అన్యాయమగు మంత్రిభాస్కరుని సంబంధము రామాయణమునకు లేకుండఁజేయుఁడు. అప్పుడు రాయనభాస్కరుఁడే మంత్రిభాస్కరుఁడన నవసరములేకపోవును. అన్నియును జక్కఁబడును.

పైదానివలెనే తిక్కనతండ్రియగు కొమ్మన, రాయనభాస్కరుని కొడుకగు కొండనయగునెడల మరల మంత్రిభాస్కరుఁడు పదునాలవ శతాబ్దమువాఁడై మనుమనికిఁ దరువాతవాఁడగును. ఈయాపద యెట్లుతొలఁగును? న్యాయేతరమగు మంత్రిభాస్కరుని సంబంధమును రామాయణమునుండి త్రోసివేయుఁడు. అప్పుడు ఈచిక్కులన్నియు విడిపోవును. అన్నియు ననుకూలపడును.

మఱియును "సరిబేసైరికివుడేల" యనుపద్యమును జెప్పిన రావిపాటి తిప్పరాజును మంత్రిభాస్కరుఁడును సమకాలికులని కవులచరిత్ర యిందుఁ దలఁచుచున్నది. ఈరావిపాటి తిప్పరాజును రామయభాస్కరుఁడును బదునాఱవ శతాబ్దములోనివారు. రామయభాస్కరుఁడు రాయనభాస్కరుఁడు కాఁడని తోఁచుచున్నది. ఇతఁడచ్యుత దేవరాయని కాలములోనుండినట్లు కొండవీటిలోని గోపినాథస్వామివారి యాలయద్వారమందలి యీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

సీ॥ నిర్మించెనేమంత్రి నిరుపమప్రాకార నవకంబుగాగోపి నాథపురము
గెలిచినాఁడేమంత్రి లలితవిక్రమమునఁ బ్రబలుడైయవనుల బలమునెల్ల
నిలిపినాఁడేమంత్రి నియతవైభవమున గోపికావల్లభుఁ గూర్మివెలయఁ
బాలించెనేమంత్రి ప్రకటధర్మఖ్యాతి మహిమమీఱఁగనాంధ్ర మండలంబు
నతఁడుభూపాలమంత్రీంద్ర సతతవినుత । ధీవిశారదుఁడచ్యుత దేవరాయ
మాన్యహితవర్తనుఁడు శౌర్యమహితయశుఁడు । భానుతేజుండు రామయభాస్కరుండు.

కావున మంత్రిభాస్కరుఁడు పదునాఱవ శతాబ్దములోనివాఁడు గావలసిన

చ్చుచున్నది- ఇదియంతయును నన్యాయముగా రామాయణముతో సీతనకి సంబంధ
ము కలుపుటవలన తటస్థమైనదే కావున నదితొలఁగించిన నన్నియుఁ జక్కఁబడును.

నన్నయతిక్కనలను సమకాలికులఁ జేయఁజూచుచున్న కవిజీవితములఁ బరి
హసింపఁబోవు కవులచరిత్ర రెండుమూఁడు వందలయేండ్ల యెడముకలవారి నెంద
ఱి “ఇండియారబ్బరు” బంతులవలె సాగఁదీసి సమకాలికులఁజేయఁ జూచుచున్నదో
చూడుఁడు! ఇవియన్నియు మంత్రిభాస్కరున కన్యాయముగా రామాయణమున భా
గమును బంచిపెట్టఁజూచుటవలన వచ్చినవి- ఆయసంబద్ధసంబంధమును దొలఁగించిన
ననేకములగు నసందర్భములన్నియుఁ దొలఁగిపోవును- పలువిషయము లనుకూలము
గాఁదేలి కవులచరిత్ర బైటఁబడును- రాయన్ననే రాయనభాస్కరుఁడన నక్కఱలే
దు- రాయనభాస్కరునే మంత్రిభాస్కరుఁడన నవసరములేదు- కొమ్మన్నవే కొండన
యన నావశ్యకములేదు రామయభాస్కరునే రాయనభాస్కరుఁడన నగత్యములేదు-
గ్రంథముల దిద్దఖుండఁ బదునాలవ శతాబ్దమునఁ బ్రతాపరుద్రునిసభలో హళక్కి-
భాస్కరుఁడును సాహిణిమారన్నయు నుండిరని నమ్మవచ్చును

ఇఁక మనముచెప్పిన పద్ధతియే సమంజసమని తలఁపవచ్చునుగాని మన యూ
హాలనింకను మఱికొన్ని యుక్తులఁదెల్పిఁ బలపరుపవలెను.

ప్రజలచేఁ దమ యిష్టమువచ్చిన చోట్లనెల్ల నుంచఁబడిన కవులను నాయా
యన్యాయస్థలములనుండి పెకలించితెచ్చి వారివారి యథాస్థానము లందిప్పుడు మన
ముంచినారముకాని యింతమాత్రముచే వారాస్థలములఁ గదలక నిలువఁజాలరు- ప్ర
జలిటునటు నూచపకమానరు- కావున మనముంచినతావులనే వీరునిలుచుటకై స
ద్యుక్తులను అష్టబంధనమునువేసి బిగించవలెను- మనయేర్పాటిప్పుడుగాని నిల్వఁజాల
దు- మనపూర్వులు చారిత్రముల వ్రాయనలవాటు లేనివారైనను దైవవశమునఁ గవు
లవిషయములో మాత్రమొక సదుపాయమును మనకుఁ గలిగించియున్నారు- ఆయే
ర్పాటునుబట్టియే యేకవులెవరెవరి తరువాతనున్నారో చాలవఱకు గనుఁగొనవచ్చు
ను- ఇదిచాలవఱకు న్యాయమగునాధారము- అదియేదియన, మనకవులు తమగ్రంథ
ములలో నదివఱకున్న సుప్రసిద్ధమహాకవుల స్తుతించుట- ఆదికవి మొదలిప్పటివఱకు
ను నీపద్ధతి ననుసరించుచునే యున్నారుకావున దీనినిబట్టి పైన మనముచేసిన యేర్పా
టును స్థిరపఱుపవలసి యున్నది.

	కవి	కాలము	
(1)	ఆదికవియగు నన్నయభట్టారకుఁడు	11 వ శతాబ్దము	
(2)	ద్వితీయ ,, తిక్కనసోమయాజి	13 ,,	
(3)	కవిత్రయములోని యెఱ్ఱాప్రగ్గడ	14 ,,	ఆది
(4)	(హుళక్కి) భాస్కరుఁడు	14 ,,	,,
(5)	(నాచనసోముఁడు)	14 ,,	మధ్యము
(6)	భీమన	14 ,,	,,
(7)	శ్రీనాథుఁడు	14 ,,	అంతము

ఇఁక దీనిఁ గవిస్తుతులమూలముగా స్థాపింపవలసి యున్నది.

ఆదికవియగు నన్నయభట్టారకుఁడు పద్యవిద్యకు నాద్యుఁడైన వాల్మీకిని మాత్రము స్తుతించె- తరువాతివాఁడైన తిక్కన యాదికవీంద్రులను (సంస్కృతమునకు వాల్మీకిని, తెలుఁగునకు నన్నపార్యుని,) (బయ్యనాది) నూత్నకవులను వినుతించె- నన్నయతిక్కనలకు నడుమ పెద్దవివరము కలదు- వివరించిచూడ వీరిద్దఱినడుమను నెన్నఁదగినకవి యొకఁడైన గానరాఁడు అందుమూలముచేతనే వీరిద్దఱిని ఆదికవులుగా మనవారు పరిగణింతురు- ఎఱ్ఱాప్రగ్గడాదులుకూడ.

ఉ॥ భాసుర భారతార్థముల భంగుల నిక్కమెఱుంగ నేరమిన్
గాసటబీసటల్ చదివి గాథలఁద్రవ్వ తెనుంగువారికిన్
వ్యాసమునిప్రణీత పరమార్థము తెల్లఁగఁ జేసినట్టియ
బ్జాసనకల్పులందలతు నాద్యులనన్నయ తిక్కనార్యులన్.

అని ఆదికవులనుగా స్తుతించియున్నారు- వీరిరువురకును నడుమ పావులూరి మల్లన కలఁడందురు గాని యాతఁడొకకవిగా నెన్నఁబడఁదగినవాఁడు కాఁడు- ఆతఁడుచేసినది గణితము- తిక్కనకు సమీపకాలములో మంత్రిభాస్కరుఁడొకఁడున్నట్లు తిక్కన పుస్తకమువలనఁ దెలియవచ్చుచున్నది-కాని యితఁడేపాటి కవియో తెలిసికొనుటకు వీనిగ్రంథమేదియును గానరాదు- సామాన్యకవియనియు నందుమూలముచేతనే ప్రసిద్ధిలేక యీతనిగ్రంథములడుగంటెననియుఁ దోఁచుచున్నది- నన్నయనాఁడు పుట్టిన కవితాలతిక యీనడుమ యెట్లెట్లో సజీవమాత్రమైయుండి తిక్కనకాలములో చిగిరించి యల్లిబిల్లిగా నలుగడల వ్యాపింపమించినది- ఈతనికాలమున, కేతన బయ్యన మొదలగువారు పెక్కండ్రుకవులు కలరు- బయ్యన గ్రంథములు కాన

రావు- కేతన నన్నయ్యను మాత్రమే యుగ్గడించియున్నాఁడు.

తరువాత తిక్కనశిష్యుఁడగు మారన యీక్రిందిపద్యముతో నన్నయతిక్కనలను మాత్రమే స్తుతించియున్నాఁడు

ఉ॥ సారకథాసుధారస మజస్రము నాగళపూరితంబుగా
నారఁగఁ గ్రోలుచున్ జనులు హర్షరసాంబుధిఁ దేలునట్లుగా
భారతసంహితన్ మును త్రిపర్వములెవ్వఁడొనర్చెనట్టి వి
ద్యారమణీయు నంధ్రకవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్.

చ॥ ఉభయకవిత్వతత్త్వవిభవోజ్జ్వలు సన్నిహితాధ్వరక్రియా
ప్రభు బుధబంధు భూరిగుణబంధుర భారతసంహితక్రియా
విభుఁ బరతత్త్వకోవిదు నవీనపరాశరసూను సంతత
త్రిభువనకీర్తనీయ యశుఁ దిక్కకవీశ్వరుఁ గొల్తు భక్తితోన్.

కవిత్వమున కాదియై కవులరుదుగానున్న దినములలో మంత్రిభాస్కరుఁడు గాని మఱియేభాస్కరుఁడు గాని మిక్కిలి ప్రసిద్ధిగల యాదికావ్యమగు రామాయణమును దెనిఁగించియుండిరేని, అది పదునాలవ శతాబ్దము మొదలుకొని స్తుతినందుచున్న యీభాస్కరరామాయణమే యగునేని, విశేషించి యది తనగురువుగారు గొప్పతోఁ జూచుకొనుచున్న తమతాతగారి కవిత్వమేని మారన యామహాకవిని కవిస్తుతిలోఁ జేర్కొనకుండునా? ద్వ్యర్థికావ్యమును రచించిన భీమనయేయుండిన నాతనిని స్తుతింపఁడా?

మారనకు సమీపకాలమందున్న మడికి సింగనయు నీక్రిందిపద్యముల నన్నయతిక్కనలను మాత్రమే వినుతించెను.

ఉ॥ భారతవేదవాక్యరసభారము లజ్ఞులెఱుంగలేక ని
స్సారమనస్కులై తెనుఁగు చందముఁ జూచి తెనుంగుబాసఁ బెం
పారరచించియుండఁగ కృతార్థులఁ జేసిన పుణ్యమూర్తులన్
సారమతిన్ భజింతు ననిశంబును నన్నయతిక్కనార్యులన్.

పద్మపురాణము.

గీ॥ వ్యాసవాల్మీకి శుకకాళిదాసబాణ। హర్షణాదుల నార్యుల నాత్మనిలిపి
సకలభాషారసజ్ఞుల సములనన్న। యార్యతిక్క కవీంద్రుల నభినుతింతు.

భాస్కర, భీమ, రంగనాథాదు లితనికిఁ బూర్వులైయుండి పూజ్యమగు నాది

కావ్యమును తెనిఁగించినవారే యైనయెడల వారినేల గొండాడఁడు?

ఈతనికిఁ దరువాతివాఁడగు ఎఱ్ఱాప్రెగ్గడ తనగ్రంథములందు నీక్రిందిరీతిగా నన్నయతిక్కనలను మాత్రమే పూర్వకవులనుగా స్తుతించినాఁడు- మఱియు నీతఁడు వీరిరువురును నాదికవులని వ్రాసినపద్యము నిదివఱకే యుదాహరించియుంటిమి. కావున వీరినడుమ మహాకవులు లేరని తేలుచున్నది- భీమన, భాస్కరాదిమహాకవు లున్నయెడల నిట్లేల చెప్పును?

ఉ॥ ఉన్నతగోత్రసంభవము నూర్జితసత్త్వము భద్రజాతిసం
పన్నము నుద్ధతాన్యపరిభావిమదోత్కటము న్నరేంద్రపూ
జోన్నయనోచితంబునయి యొప్పెడు నన్నయభట్టకుంజరం
బెన్న నిరంకుశోక్తిగతి నెందును గ్రాలుటఁ బ్రస్తుతించెదన్.

మ॥ తనకావించిన సృష్టి తక్కరుల చేతం గాదు నా నేముఖం
బునఁ దాఁ బల్కిన పల్కు లాగమములై పొల్పొందు నా వాణిన
త్తనునీతం డొకరుండ నాఁ జనుమహత్త్వాప్తిం గవిబ్రహ్మ నా
వినుతింతుం గవితిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్.

హరివంశము.

తరువాత నించుమించుగా నీ ఎఱ్ఱాప్రెగ్గడ, భాస్కరుఁడు, మొదలగువారి కాలములోనివాఁడైన శ్రీనాథుఁడు ఈక్రిందివిధముగా నన్నయతిక్కనలను మాత్రమే స్తుతించెను.

క॥ నెట్టుకొని కొలుతు నన్నయ । భట్టోపాధ్యాయ సార్వభౌము నిఁ గవితా
పట్టాభిషిక్తు భారత । ఘట్టోల్లంఘన పటిష్ఠ గాఢప్రతిభున్.

ఉ॥ పంచమవేదమై పరగ భారతసంహిత యాంధ్రభాషఁ గా
వించెఁ బదేను పర్వములు విశ్వజగద్ధిత బుద్ధి నెవ్వఁడ
క్కాంచనగర్భతుల్యు నకఖండితభక్తి నమస్కరింతు ని
ర్వంచితకీర్తివైభవ విరాజికిఁ దిక్కన సోమయాజికిన్.

భీమఖండము.

ఈతఁడు మొదట వీరిద్దఱినే స్తుతించినను దరువాత కవిత్రయములోని వాఁడగు ఎఱ్ఱాప్రెగ్గడనుగూడఁ గొన్నికృతులందు స్తుతించెను.

మఱియు నితనికాలములోని వాఁడేయని చెప్పఁదగిన జక్కయకవితన విక్రి

మార్కచరిత్రంబునఁ గవిత్రయమువారిని మాత్రమే యిట్లు స్తుతించె-

ఉ॥ వేయివిధంబులందుఁ బడివేవురు పెద్దలు సుప్రబంధముల్
వాయక చెప్పిరట్లు రసబంధుర భావభవాభిరామధా
రేయులు శబ్దశాసన వరేణ్యులు నాఁగఁ బ్రశస్తికెక్కరే
యేయెడ నన్నపార్యుగతి నిద్ధరనట్టి మహాత్ముఁ గొల్చెదన్.

చ॥ పరువడి దేవభాషఁ గల పంచమవేదము నాంధ్రభాషను
స్థిరతరచించుచోఁ గృతిపతిత్వముఁ గోరి ప్రసన్నుఁడైన యా
హరిహరనాథుచేఁ బడసె నవ్యయసౌఖ్యపదంబు నెవ్వఁడా
పురుషవరేణ్యుఁ దిక్కకవిఁ బూనినుతింతుఁ గృతాధ్వరోత్సవున్.

ఉ॥ ఈత్రియిఁ దాఁ బ్రబంధపరమేశ్వరుఁడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వమున శేషము శ్రీనరసింహ రామచా
రిత్రములున్ బుధవ్రజగరిష్ఠత నెఱ్ఱయశంభుదాసుఁడా
చిత్రకవిత్వవాగ్విభవజృంభితుఁ గొల్చెద భక్తియుక్తితోన్.

ఇంతవఱకును భాస్కరుఁడుగాని, భీమనగాని, రంగనాథుఁడుగాని కవిస్తుతులలోఁ జేరలేదు- శ్రీనాథాదులకు ఎఱ్ఱాప్రగ్గడయును భాస్కరాదులవలెనే యాధునికుఁడేయైనను వీరి స్తుతులందెక్కినాఁడు- సలక్షణమై యత్యుత్తమమగు కవిత్వముకలిగి యించుమించుగా నాదికవులగు నన్నయతిక్కనల శైలిని బోలియుండు శైలితో భారతమును బూరించి యాఘనుల యుద్యమమును నెరవేర్చి వారి యిద్దఱినడుమను బడినవాఁడగుటచే నీతఁడు మొదటినుండియు సుప్రసిద్ధుఁడై యాదికవులలోఁ జేరినాఁడు- ఈమువ్వురను లోకులు కవిత్రయమందురు- సాధారణముగా వీరి స్తుతింపని కవిలేఁడు- శ్రీనాథాదులీకవిత్రయము వారినేగాని స్తుతింపకపోయినను నించుమించుగా నీకాలమందేయున్న మఱికొందఱు భాస్కరాదుల స్తుతించిరి కావున నించుమించుగా నీకాలమునుండియు వీరు కవుల స్తుతులందెక్కిరని చెప్పవచ్చును- పదునాల్గవ శతాబ్ద మధ్యమువఱకును వీరు కవిస్తుతులందు లేరు- తచ్ఛతాబ్దాంతము మొదలుకొని యున్నారు- కావున వీరు (భాస్కరుఁడు, భీమన, రంగనాథుఁడు నాచనసోముఁడు ము॥) ఎప్పటివారని తలఁచుట న్యాయమో బుద్ధిమంతులూహించుకొందురుగాక.

ఇంతటినుండియు భాస్కరాదుల పేరులున్న కవిస్తుతి పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాఁడను.

అనంతామాత్యుఁడు తన భోజరాజీయమునందు:—

ఉ॥ నన్నయభట్టు దిక్కకవి నాయకు భాస్కరు రంగనాథుఁ జే
రెన్నిక కెక్కినట్టి యమరేశ్వరు నెఱ్ఱన మంత్రి నాదిగాఁ
జన్నకవీంద్రులన్న పరసన్నుతవాణుల నంగధాత్రిలో
నున్నకవీంద్రులందఱఁదు నుల్లమెలర్పఁగ వాగ్విభూతికిన్.

భీమకవియును శ్రీనాథుఁడును నీతనికి మిక్కిలి యాధునికులగుటచే సంస్తుతింపలేదని తోఁచుచున్నది.

తరువాత వెన్నెలకంటి సూరన్న తన విష్ణుపురాణమునందు.

ఉ॥ మున్నిటి కాళిదాస కవిముఖ్యులకుం బ్రణమిల్లి వారిలో
నెన్నికగాఁ బ్రబంధ పరమేశ్వరుఁ దిక్కనసోమయాజినిన్
నన్నయభట్టు భాస్కరుని నాచనసోముని రంగనాథునిన్
వెన్నెలకంటిసూర్యుఁ బలువేలవిధంబులఁ గొల్చి భక్తితోన్.

పిమ్మట ప్రౌఢకవి మల్లన్న తన రుక్మాంగద చరిత్రయందు.

ఉ॥ నన్నయభట్టు దిక్కకవి నాచనసోముని భీమనార్యుఁ జే
రెన్నిక జిమ్మపూడి యమరేశ్వరు భాస్కరు శంభుదాసునిన్
సన్నుతిచేసి వాక్యసరసత్వము నీమల కింపుమీఱన
త్యున్నతిగా నొనర్తు నెఱయోధులు మేలనఁ గావ్యమిమ్ములన్.

అటుతరువాత సింగన్న తన భాగవత షష్ఠస్కంధమునందు.

సీ॥ .... నన్నపార్యు వర్ణనలఁ బొగడి
గీ॥ తెలియఁ దిక్కనసోమయాజుల భజించి। యెఱ్ఱనామాత్యు భాస్కరు నిచ్చ నెంచి
సుకవిసోముని నాచనసోము నెఱిఁగి। కవిమనోనాథు శ్రీనాథు ఘనత మెచ్చి.

ఆపైన నూతనకవి సూరన్నయును.

చ॥ అలఘుని శబ్దశాసనపదాంకితుఁ దిక్కనసోమయాజిని
శ్చలమతి శంభుదాసు బుధసన్నుతు నాచనసోమనార్యుఁ జె
న్నలరిన జిమ్మపూడి యమరాధిపు భాస్కరు రంగనాథునిం
దలఁతు నపూర్వదివ్యకవితామహనీయ సమగ్రచిత్తులన్.

ఈరీతిగాఁ బదేనవ శతాబ్దమునుండి మాత్రము భాస్కరుఁడు, భీముఁడు, రంగనాథుఁడు, నాచనసోముఁడు మొదలగువారు కవిస్తుతులందుఁ గాన్పించుచున్నారు

కాని యంతకంటెఁ బూర్వము కేరు- దీనికిఁ గారణము వారంతకంటెఁ బూర్వము లేకపోవుట యే యని చెప్పనొప్పగును- కవులకాలమును దెలిసికొనుటకిది యొకమంచిపద్ధతిగాఁ దోఁచెడిని- భీమనకాలమునువట్టి చాటుధారలవలనఁ గనుఁగొనఁ బ్రయత్నించుటకం టె నిదియే మంచిమార్గము.

ఈవిధముగా సమస్తవిధములచేతను రామాయణమును విరచించిన హుళక్కి భాస్కరుఁడును దానికృతినందిన సాహిణిమారనయు దత్కాలికులుగా నెంచఁబడు భీమనాదులును బదునాల్గవ శతాబ్దమందున్నట్లు తెలియవచ్చుచున్నది కావునఁ బం డ్రెండవ శతాబ్దమందున్న మంత్రిభాస్కరుని కీరామాయణముతో సంబంధమునుగ లుపుట కేవలము నన్యాయమని చదువరులెంచకపోరని నమ్మెదను.

రామాయణకాలమును దెలిసికొనుటకుఁ బైఁజెప్పఁబడిన పద్ధతులే మంచివై నను, వానినిబట్టియే విషయము చక్కఁగాఁ దేలుచున్నను వానికి పబలముగా నుండు టకై మఱికొన్ని చిన్నయుక్తులఁగూడఁ దెల్పెదను.

ఈరామాయణమునకు భాస్కరరామాయణమని పేరువచ్చినది- భాస్కరరా మాయణ మనభాస్కరునివలననైన రామాయణము కదా, ఇట్లు కవిపేరితోఁ గూడిన నామము గ్రంథమునకు సామాన్యముగా రాదు- కావున నిందొక విశేషమున్నది. అ దిచేమిదియన నదివఱకొక రామాయణమున్నదని సూచించుట- భారతముండఁగాఁ దరువాత జైమినికృతభారతము బయలువెడలుటచే జైమినిభారతమని దానినిబిలిచిన ట్లు మనవారొక గ్రంథముండఁగా మరల రెండవదిపుట్టిన దానిసంజ్ఞకుఁ గవిపేరును గూడఁజేర్చుట వాడుక- ఈరామాయణమునకు ముందున్న రామాయణమేదియన ఎఱ్ఱ నకృతరామాయణము ఇది ముందుపుట్టినదని నాతాత్పర్యము- పింగళిసూరనార్యుఁడు భారతరామాయణముల జోడించివ్రాసిన రాఘవపాండవీయములో :—

ఉ॥ ఏయెడనర్థగౌరవ సమృద్ధియు శబ్దవిశుద్ధియుం దిరం
బైయనవద్యతం బరఁగ నంధ్రవచస్థితి భారతంబు రా
మాయణమున్ రచించిన మహాత్ముల నాత్మఁదలంచెదన్ జగ
ద్గేయుల నన్నపార్యుని, దిక్కసుధీమణి, నెఱ్ఱసత్కవిన్.

అని రామాయణమును భారతమును గూడ రచించిన పూర్వకవులు వీరుమువ్వు రే యని తెల్పియున్నాఁడు- ఈపద్యము తిక్కనకుఁ బూర్వము మంత్రిభాస్కరునిచే రామాయణము రచింపఁబడియుండలేదని తోపింపఁజేయుటయె కాక భాస్కరరా

రామాయణముకూడ నాదిదికాదని సూచించుచున్నది కాని ప్రతాపరుద్రునికాలమందు న్న భాస్కరుఁడు తరువాతనున్న యనవేమారెడ్డి కాలములోని యెఱ్ఱాప్రగడకుఁ దరువాతనుండుట యెట్లుపొసఁగును అని వితర్కింపవలసియున్నది. ప్రతాపరుద్రుని కాలములో భాస్కరుఁడున్నను నప్పుడు రామాయణము రచింపఁబడలేదు. ప్రతాపరుద్రుని తరువాత సాహిణిమారన రాజుకాఁగా నప్పుడు రచింపఁబడినది. ప్రతాపరుద్రుఁడు కారాబద్ధుఁడైన తరువాత తత్సేనానాయకులు తామస్వతంత్రరాజులై వినుకొండకు బోలయ వేమారెడ్డియును బహుశః కొండవీడునకు సాహిణిమారనయు రాజులైరి. మొదటిపోలయ వేమారెడ్డి స్వల్పకాలము రాజ్యముచేసి మృతుఁడాయె. తరువాత ననవేమారెడ్డి రాజయ్యె. కావున కొండవీడును సాహిణిమారుఁడును, వినుకొండను అనవేమారెడ్డియు పాలించుచుండఁగా భాస్కరరామాయణము పుట్టినది. ఇదిపుట్టినప్పటికి భాస్కరపుత్రుఁడుగూడ గొప్పకవియై యున్నందునను భాస్కరుఁడు కొంతభాగమునే విరచించియుండుటను నీగ్రంథము భాస్కరుని వృద్ధత్వమున రచింపఁబడెనని యెంచవలసియున్నది. ఇఁక అనవేమారెడ్డికడనున్న యెఱ్ఱని రామాయణమన్ననో యాతని యౌవనకాలమున నిర్మింపఁబడినది. అనవేమారెడ్డి కంకితము చేయఁబడిన హరివంశమునకుఁ బూర్వమే రామాయణము విరచింపఁబడినట్లు హరివంశమువలనఁ దెలియవచ్చుచున్నది. ఇతని గ్రంథములలో నిదియే మొదటిదని తోచుచున్నది. కావున నీరెండు రామాయణములలో నెఱ్ఱనది ముందు పుట్టి యుండవచ్చును. లేదా యించుమించుగా సమకాలమందయినఁ బుట్టియుండవచ్చును అప్పుడైనను "భాస్కర" రామాయణమను సంజ్ఞకలుగుట కవకాశమున్నది.

మల్లికార్జున భట్టారకాదులు "అష్టభాషాకవిమిత్రుల" మని వ్రాసికొనుటకూడ నీరామాయణము మనదేశమున అష్టభాషా వివరణమైనతరువాతఁ గలిగినదని తెల్పుచున్నది. ఆదికవులుభయ భాషలనియే వాడిరిగాని యష్టభాషలని వాఁడలేదు. అష్టభాషావివరణ మిటీవలవచ్చినది. లక్షణశూన్యమగు నీయాంధ్రమును నన్నయతిక్కనాదులు సంస్కరించి కావ్యములు దీన వ్రాసినతరువాత నీభాషకూడ ప్రాకృతముగాఁ దరువాతివారిచే నెంచఁబడినది. ఇంచుక తిక్కనకుఁ దరువాతి కాలమునసున్న యథర్వణుఁడు దీని ప్రాకృతమని పిలిచినాఁడు. అప్పటినుండియుఁ బ్రాకృతము లేదును సంస్కృతమును గలసి "యష్టభాష" లైనవి. (ఈవిషయమై యస్మదీయములోని "భాషాష్టకోత్పత్తి వివరణమును జూడఁదగును.) కావున "స

భయకవిమిత్రు" సి తరువాతివాఁడు- "అష్టభాషాకవిమిత్రుఁడు" గాని యీతని తరువాతివాఁడాతఁడు కాఁడని గ్రహింపవలయును-

ఆదినుండి తిక్కనసోమయాజి వఱకుఁగల కవులందఱును దమగ్రంథముల కాదిని నొక సంస్కృతశ్లోకము నుంచుట వాడుకయై యున్నదనియు నీవాడుక తిక్కననాటినుండియుఁ బోయినదనియు భాస్కరరామాయణాదినిగూడ శ్లోకములు న్నవి కాఁబట్టి యీగ్రంథము నన్నయతిక్కనలకు మధ్యకాలమందు విరచింపఁబడినదనియుఁ గవులచరిత్ర వక్కాణించుచున్నది కాని యది నిర్మూలము- ఏలయన భాస్కర రామాయణకవులు, గ్రంథాదిని శ్లోకమును జెప్పియుండలేదు- ముద్రితగ్రంథమున మొదట నుంచఁబడిన శ్లోకము లితరసంస్కృత గ్రంథములనుండి తీసి గ్రంథమును ముద్రింపించినవారు వేసిరి- వానినిజూచి భ్రమపడి కవులచరిత్ర యీ వెఱ్ఱివ్రాఁత వ్రాసినది- గ్రంథముయొక్క కాలమును దెలిసికొనుటకు నిదియొక నిజమైన యాధారమేయగునెడల నిది మనకే వినియోగించుచున్నది- ఈ రామాయణాదిని శ్లోకము లేదు కాఁబట్టి యిది తిక్కనకుఁ దరువాత విరచింపఁబడినదనియే గ్రహింపవలెను.

మఱియును నాదికవులు వాడిన మధ్యాక్కరాది పద్యములేవియును నిందులేవు- ఇవి మనోహరములగు వృత్తములు కాకపోవుటచేఁ గవిత్రయమువారికిని దరువాతివారు వీనిని వాడుటమానివేసిరి- కాఁబట్టి యీగ్రంథము ఆదికవులగు నన్నయతిక్కనలకు మధ్యకాలములోనిదని నుడువఁదగినది కాదు.

ఇతరగ్రంథ దృష్టాంతము.

(5) కేతనకృతమైన దశకుమారచరిత్ర * తిక్కనసోమయాజి కంకితము చేయఁబడినది కాన నందుఁ దద్వంశము వర్ణింపఁబడుటలో మంత్రిభాస్కరుఁడును వర్ణింపఁబడెనుగాని యందు నాతఁడు రామాయణమును వ్రాసినట్లుగాని, గొప్ప కవియైనట్లుగాని, మంత్రిత్వాది గొప్పయుద్యోగములు చేసినవాఁడైనట్లుగాని చెప్పఁబడి యుండలేదు- దీనినిబట్టిచూడఁగా నితఁడు గొప్పకవి కాఁడనియు మంత్రిత్వాదికములు చేసినవాఁడు కాఁడనియుఁ దోఁచుచున్నది- అందున్న పద్యముల నీక్రింద నిచ్చుచున్నాఁడను.

---

* ఈగ్రంథము నాకిటీవల నాగ్రంథముకొంత ముద్రితమైనతరువాత లభించుటచే నీవిషయము మొదట చేర్చవలసినదేయైనను నిచట చేర్చియుంటిని.

"ఉ॥ కీర్తివిభూషణుండయిన కేతనకున్ సతి నాచమాంబకున్
మూర్తిమదాగమంబులన ముగ్గురు పుత్రులు పుట్టిరందు తో
త్కార్తిహరుండు గుండనయు, సార్యశిరోమణి భాస్కరుండు, ని
ర్వర్తితపుణ్యుఁ డిద్ధగుణరాశి మహేశ్వరుఁ డుగ్రమంబునన్.

వ॥ ఇట్లు దయించిన పుత్రత్రయంబునందు:—

శా॥ శాపానుగ్రహ శక్తియుక్తుఁడ మలాచారుండు సాహిత్యవి
ద్యాపారీణుఁడు ధర్మమార్గపథికుండర్థార్థిలోకావన
వ్యాపారవ్రతుఁడంచుఁ జెప్పసుజనవ్రాతంబు గౌరీపతి
శ్రీపాదప్రవణాంతరంగు విబుధశ్రేయస్కరున్ భాస్కరున్.

ఉ॥ ధీనిధి భాస్కరాఖ్యునకు ధీరగుణాన్విత కొమ్మమాంబకున్. &c.

అని కవి కృతిపతివంశమును వర్ణించునప్పుడు వాస్తవమును బేర్చి స్తవమును జేయుచుగానఁ బై స్తవమునందలి యదార్థము మంత్రిభాస్కరుఁడు మంచిసంసారి యని తెల్పుటయే యని తలచుట న్యాయము- గొప్పకవియైనం బ్రభుత్వాదికములు చేసినవాఁడును నైన వానిని కవిసూచించియే యుండును.

లోకప్రతీతి.

(౬) లోకప్రతీతి యొక గొప్ప ప్రమాణము కాకపోయినను దానియందుఁ గొంతటికి లక్ష్యముండును గాన దానిని గూడఁ జర్చింతము- ఈవిధమునఁ జూచినను హుళక్కి భాస్కరుని పక్షమే కుశలమై యున్నది- ఈపందొమ్మిదవ శతాబ్దము వఱకును నీ శతాబ్దము దైన మూఁడునాల్గు "పుంజీల" సంవత్సరముల క్రితము వఱకును హుళక్కి భాస్కరుఁడే రామాయణకవియైనట్లుగా లోకమున వాఁడుక కలదు- మంత్రిభాస్కరుఁడు రామాయణమును విరచించినట్లుగాఁ బ్రతీతికలదని కవులచరిత్ర పలుకుచున్నది కాని యది నమ్మఁదగినది కాదు- ఇందేదినిజమో యెట్లు తేలునందురేని ఈపందొమ్మిదవ శతాబ్దపు హిమముచే నాక్రాంతచిత్తులగు నిప్పటివారినటుంచి యిదివఱకు ముద్రితములై ప్రకటితములైయున్న గ్రంధముల సాక్ష్యముపుచ్చుకొనిన నీవిషయము న యథార్థము తేలఁగలదు- అవి నిష్కళంకమగు సాక్ష్యము నీయఁగలవు- కావున నట్లొనర్తము-

(౭) ఈవిషయమును దెలిసికొనుటకు మొదటిసాక్షి కవిస్తుతులు ఇదివఱకనేకములైన కవిస్తుతులను బైన నుదాహరించియే యున్నాము- వానియందన్నిటియం

మను "భాస్కరుఁ" అని మాత్రమున్నది- ఈభాస్కరుఁడు మనభాస్కరుఁడేకాని ప్రతిపక్షుల భాస్కరుఁడుకాఁడు- ఏలయన వీనియందెచటను నుపపదములేను- అయ్యలార్యుని పద్యమువలన మనభాస్కరునకు (భట్టాది) ఉపపదములేనట్లును దిక్కనపద్యములవలన వారిభాస్కరునకు "మంత్రి" యను నుపపదమున్నట్లును దేలినది- పైకవిస్తుతులన్నియు నుపపదము లేకయున్నవికావున నవియన్నియు హుళక్కిభాస్కరు నుద్దేశించి వ్రాయఁబడినవేయని తలఁపవలయును- దీనికేమి ఇంతియకాక కవిస్తుతులు "భాస్కరుఁడ" ని యైననున్నవి లేక హుళక్కిభాస్కరుఁడని యైనను న్నవికాని మంత్రిభాస్కరుఁడని యెచటను లేవు- కొందఱుకవులు మనసంశయము విడునట్లుగాస్పష్టముగా "హుళక్కిభాస్కరుఁ" అని వ్రాసియున్నారు- మధ్యకవులలోని వాఁడగు అంగర నృసింహకవి తన రాజరాజాభిషేకమందు:—

ఉ॥ ఇద్ధగుణుం బ్రబంధ పరమేశ్వరుసత్త్వన ప్రగ్గడఁ మనః
పద్ధతినిల్పిసూక్తిరుచి భాస్కరుఁడైన హుళక్కిభాస్కరుఁ
బుద్ధిఘటించి సంతతము పూనిభజింతు వచఃప్రసాదసం
సిద్ధునిజిమ్మపూడి కులశేఖరునయ్యమరేశసత్కవిఁ.

అని స్తుతించినాఁడు కావునఁ గవిస్తుతులందుఁగల భాస్కరుఁడీ హుళక్కిభాస్కరుఁడేయనియు నితఁడే సుప్రసిద్ధుఁడగు రామాయణకవియనియు నృసింహకవినాటికి లోకప్రతీతి హుళక్కిభాస్కరుని గూర్చియే యున్నదనియు గ్రహింపవలయును.

మఱియును మంత్రిభాస్కరుని స్తుతించిన పద్యమొకటియును గానరాదుగాని ఆధునికుఁడగు కృష్ణవిలాసకవిమాత్రము:—

సీ॥ ....

వంచేటిరంగన్న- భాస్కరమంత్రిని । వెల్లంకితాతప్ప మల్లుభట్టు

అని స్తుతించియున్నాఁడు- అయినను ఈభాస్కరమంత్రి తిక్కనసోమయాజి తాతయగు మంత్రిభాస్కరుఁడుకాఁడు- ఈతఁడు వెన్నెలకంటి భాస్కరమంత్రి యీకవి చాలగొప్పవాఁడట అనవేమారెడ్డి కాలములోనుండి యాతనికిఁదనప్రబంధములఁ గృతియిచ్చినాఁడు- ఈతనినైనను గవులంతగా స్తుతించియుండలేదుగాని వెన్నెలకంటి వంశస్థులీతని తమపూర్వుఁడగుటచేఁ దప్పకవర్ణించుకొనుచుండిరి- ప్రస్తుతమునఁ బైపద్యమును జెప్పిన వేంకటాచలకవియును వెన్నెలకంటి వంశస్థుఁడేయైయున్నాఁడు- ఈవెంకటాచలకవి తనవంశస్థుఁడగు వెన్నెలకంటి సూరన్న కా

శ్రీ దాసురితోఁ పద్యమును బ్రారంభించి తనవంశస్థుఁడగు "వెన్నెలకంటి సూర్యు" ని గూడ నందుఁ బూర్వమహాకవినిగా స్తుతించియున్నాఁడు- ఆసూర్యుఁడే యీభాస్కరుఁడు- అతనికే భాస్కరమంత్రియనియు సూర్యుఁడని రెండునామములుగలవు- ఇట్లీకవికి రెండుపేర్లున్నట్లుగా జక్కయకవి కృతవిక్రమార్కచరిత్రవలనఁ దెలియవచ్చుచున్నది- విక్రమార్కచరిత్ర యీభాస్కరమంత్రియొక్క తమ్మునికొమారుఁడగు సిద్ధమంత్రి కంకితము చేయఁబడినది. అందువంశమిట్లు చెప్పఁబడినది- మూలపురుషుఁడు సిద్ధయ- ఆతనికి (1) భాస్కరమంత్రి లేక సూర్యుఁడు (కవి)- (2) జన్నమంత్రి అని యిద్దఱుపుత్రులు- జన్నమంత్రికొడుకు సిద్ధమంత్రి- ఈతఁడే విక్రమార్కచారిత్రమును గృతినందినవాఁడు.

విక్రమార్కచరిత్రమునందలి పద్యముల నిందుదాహరించుచున్నాను-

క॥ ఆదంపతులకు సుకృత । ప్రాదుర్భావమున మంత్రిభాస్కరుఁడుదయా
పాదిత బాంధవనికరమ । హోదయుఁడగు జన్నమంత్రియనఁగల్గిరొగిన్.

చ॥ అమృతగిరీంద్ర సంయమి పదాంబుజ షట్పద నాయకుండు నా
నమిత గనిప్రణామ నికరాంచిత పుణ్యుఁడు నాఁగ నీశ్వరా
గమ పరమార్థవేదియనఁ గంజభవాన్వయ వర్ధనుండు నాఁ
బ్రముదిత కీర్తిఁ జెంపెసఁగె భాస్కరమంత్రి ప్రతాపధాముఁడై.

ఈపద్యములవలన సిద్ధమంత్రికి పెద్దతండ్రి యొక్కఁడేయైనట్లును తలనిపేరు భాస్కరమంత్రియైనట్లును తేలినదికదా? ఇఁక నీభాస్కరమంత్రి కవియైనట్లును సూర్యుఁడను పేరును గలిగియున్నట్లును ఆగ్రంథములోనే షష్ఠ్యంతములలోని యీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

ఉ॥ వెన్నెలగంటి సూర్యుఁడు వివేక గుణాఢ్యుఁడు వేదశాస్త్రసం
పన్నుఁడు రెడ్డి వేమ నరపాలకుచేత మహాగ్రహారముల్
గొన్న కవీంద్రకుంజరుఁడ కుంఠిత తేజుఁడు పెద్దతండ్రిగా
సన్నుతిగన్న సిద్ధనకు సంతత దాన కళా వినోదికిన్.

కావున వెన్నెలకంటి వెంకటాచలము తన గ్రంథమునఁ దన పూర్వుఁడగు (వెన్నెలగంటి) భాస్కరమంత్రిని స్తుతించెనని నిరాతంకముగాఁ దెలిసికొనవలయును. ఇట్లైనే యయ్యలరాజంటి కవులు తమవంశస్థుఁడగు అయ్యలరాజు భాస్కరమంత్రిని బూర్వకవినిగా స్తుతించుకొనిరి,

చదువరులకు సుబోధముగా నుండుటకై గ్రంథములం దెక్కియున్న భాస్కరుల నీక్రింద నిచ్చుచున్నాఁడను.

1. గుండూరి మంత్రిభాస్కరుఁడు:—తిక్కన సోమయాజి తాత. కవి. గ్రంథములు కానరావు. 11-12 శతాబ్దములందున్నవాఁడు.

2. భాస్కరాచార్యులు:—బీదరు కాపురస్థుఁడని పురాణనామ చంద్రిక చెప్పుచున్నది. సిద్ధాంతశిరోమణి, కరణ కుతూహలము లోనగు జ్యోతిష గ్రంథములవ్రాసి లోకప్రసిద్ధినందిన మహనీయుఁడు. సంస్కృతకవి. 12 వ శతాబ్దమందున్నవాఁడు.

3. హుళక్కి భాస్కరుఁడు:—భాస్కర రామాయణమును విరచించిన మహాకవి. 13-14 శతాబ్దముల నాటివాఁడు.

4. వెన్నెలకంటి భాస్కరమంత్రి:—అనవేమారెడ్డి యాస్థాన కవులలో నొకఁడు. గ్రంథములు కానరావు. 14 వ శతాబ్దమందలివాఁడు.

5. రాయసభాస్కరుఁడు:—గొప్పదాత. అనవేమారెడ్డిచే గౌరవింపఁబడిన మంత్రికుంజరుఁడు 14వ శతాబ్దము నాటిఁడు.

6. రామలింగ భాస్కరుఁడు:—పైభాస్కరుని మనుమఁడు. గొప్పవదాన్యుఁడు శ॥ 14-15 నాటివాఁడు.

7. రామయభాస్కరుఁడు—ఘనోదారపురుషుఁడు. అచ్యుత దేవరాయనిచే సత్కారములందినవాఁడు (ద్విపద రుక్మాంగద చరిత్రమును జేసినవాఁడితఁడే యేమో) శ॥ 16 నాటివాఁడు.

8. భాస్కరపంతులు:—కవి. కన్యకాపురాణమును జెప్పి కోమటులకు గురువైయుండు నాతఁడు శ॥ 16 నాటివాఁడు.

9. అడిదము బాలభాస్కరుఁడు:—అడిదము సూరకవి తండ్రి. కవి. అచ్చతెనుఁగు రామాయణమును రచించెనఁట. గ్రంథము కానరాదు. శ॥ 18 నాటివాఁడు.

10. అయ్యలరాజు భాస్కరుఁడు:—కెట్టిమతమను గ్రంథమును రచించినకవి శ॥ 18 నాటివాఁడు.

11. పక్కిలంక భాస్కరుఁడు:—వాసవదత్తా పరిణయమును రచించిన వీరభద్రకవి తండ్రి. కవి. గ్రంథములు లేవు శ॥ 18 నాటివాఁడు.

12 గుంటుపల్లి భాస్కరుఁడు:— ఇందఱి జాతకుల గురువు కాలాదులు తెలియరావు.

ఈ ద్వాదశ భాస్కరులును ద్వాదశ భాస్కరులభాతి ప్రతిభాతిశయంబునఁ బ్రకాశిల్లుచున్నారు. వీరిలో 2, 3, 5, 6, 12 భాస్కరులు మిక్కిలి ప్రసిద్ధులు. పల్వురు భాస్కరులిట్లు కలరు కావునఁ బరిశోధకులు గ్రంథముల జాగ్రత్తతోఁ బరిశీలించుచుండవలయును.

౨. అప్పకవీయాది ఛందస్సులవలనఁగూడఁ గవిస్తుతులందుఁ గల భాస్కరుఁడు హుళక్కి భాస్కరుఁడే యనియు లోకప్రతీతి యతని గూర్చియే కలదనియుఁ దెలుచున్నది. వీనియందు హుళక్కి భాస్కరుని ప్రశంసయే కాని మంత్రిభాస్కరుని మాట యెచటను లేదు.

3 గ్రంథముల టీకలును గవిస్తుతులందలి భాస్కరుఁడు మనవాఁడే యనియు, నతని గూర్చియే లోకప్రతీతికలదనియు ఘోషించుచున్నవి. మొన్న మొన్నటివఱకు ననఁగా నీపంథొమ్మిదవ శతాబ్దమహిమ తలచూపువఱకుఁ గల టీకలందు. భాస్కరుఁడనియైనను హుళక్కి భాస్కరుఁడని విస్పష్టముగానైనను నుండుచుండును గాని మంత్రిభాస్కరుఁడని యెచటను లేదు. వసుచరిత్రములో:—

మ॥ మహిమున్ వాగనుశాసనుండు సృజియింపం గుండలేంద్రుండు ద
న్మహనీయస్థితి మూలమై నిలువ శ్రీనాథుండు ప్రోదన్మహా
మహులై సోముఁడు భాస్కరుండు వెలయింపన్ సొంపువాటిల్లు నీ
బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమునఁ దత్ప్రాగల్భ్యమూహించెదన్.

అను పద్యమునకు టీకను వ్రాయుచు దద్వ్యాఖ్యాత "సోముఁడు భాస్కరుండు వెలయింపన్- నాచన సోముండును హుళక్కి భాస్కరుఁడును అను కవులు ప్రకాశింపఁజేయఁగా అని యర్థము" అని భాస్కరుఁడనఁగా హుళక్కి భాస్కరుఁడని విస్పష్టముగా లిఖియించియున్నాఁడు. ఈవ్యాఖ్యానము, మన యాంధ్రభాషను గూర్చియును, గవులను గూర్చియును జాలపనిచేసి విశేషముగాఁ దెలిసికొనిన బ్రౌనుదొరవారి ప్రోత్సాహమువలన విరచింపఁబడినది. కావున నిది లోకప్రతీతిని దెలిసికొనుటకు మంచి యాధారము. పై టీకనుబట్టి యప్పటికి భాస్కరుఁడు అనిన హుళక్కి భాస్కరుఁడనియే కాని మంత్రిభాస్కరుఁడను వాడుక లేదని రూఢిగా దెలియవచ్చుచున్నది.

లంకావిజయంబునందు ద్వితీయాశ్వాసమున: సీ॥ "బుధవరుల్ భాస్కర పోతవలాది కవనచారులు మఱియు ననుపమాన" అనియుండఁగాఁ దద్గ్రంథమునకు టీక వ్రాసినవారు లక్ష్మణకవి పరమైన యర్థమును వ్రాయుచు "భాస్కర అళక్కి భాస్కరుఁడును" అని వ్రాసిరి. కావున మంత్రిభాస్కరుని గూర్చినప్రతీతి వారికిఁ దెలియదనియు హుళక్కిభాస్కరుని ప్రసిద్ధిమాత్రమే వీరెఱుఁగుదురనియుఁ దేలుచున్నది.

ప్రస్తుతము రాజమహేంద్రవరమునందున్న వడ్డాది సుబ్బారాయ కవిగారు తామురచించిన భారతవచన గ్రంథమందు భాస్కరుని నుతించిరి. ఆగ్రంథమునకు వ్రాయఁబడిన టీకలో భాస్కరుఁడనఁగా హుళక్కిభాస్కరుఁడని వ్రాయఁబడియున్నది. కావున వారికిని వారిమిత్రులకును హుళక్కిభాస్కరుని గూర్చియే కాని మంత్రి భాస్కరుని గూర్చి యప్పటికిఁ దెలియదనుమాట విస్పష్టమగుచున్నది. ఈటీక వ్రాయఁబడునాటికింకను మనప్రతిబత్తులు మంత్రిభాస్కరునకు రామాయణమున భాగమును బంచిపెట్టియుండలేదు.

౪. మఱియును రామాయణమునచ్చువేయించి ప్రకటించినవారు పల్వురు కలరు. ఇదివఱకు వీరందరునుంగూడ హుళక్కిభాస్కరునే తత్కర్తగా వ్రాసిరికాని నేటివఱకెవరును మంత్రిభాస్కరు మాటనైన నెత్తియుండలేదు రామాయణాది గ్రంథముల నచ్చువేయించినవారు శ్రమచేసి పలుసంగతులు తెలిసికొని యచ్చువేయించుచువచ్చిరి కాని యూరక తమ యిష్టాను సారముగాఁ బ్రకటించి యుండలేదు. కవులచరిత్ర వీరివ్రాతలఁగూడఁగొంతసహాయముగాఁదీసికొనుచునేయున్నది కావున దీనిని బట్టి లోకప్రతీతి హుళక్కిభాస్కరుఁడు రామాయణమును రచించెనని యున్నది కాని మంత్రిభాస్కరుఁడురచించినట్లు లేదని చెప్పవచ్చును.

౫. వెండియు పురాణనామ చంద్రిక యను గ్రంథమునందు:—భాస్కరుఁడు—(౧) ఒకానొక ఆంధ్రకవి ఇతఁడు శాలివాహన శకము ౧౩ వ శతాబ్దమున ఉండినట్లు చెప్పుదురు. ఈతని ఊరు కొండవీడు. వాల్మీకి మహాముని చే రచియింపఁబడి ఆదికావ్యము అని ప్రసిద్ధికెక్కిన శ్రీమద్రామాయణము ఇతనిచే తెనుఁగున పద్యకావ్యముగా చేయఁబడెను. అందు ఇతఁడు రచియించిన భాగము ఆరణ్యకాండమును, యుద్ధకాండమునందు కొంతభాగమును. తక్కిన భాగములు రచియించినవారిని గూర్చి చూ॥ భాస్కర రామాయణము.

అని (హుళక్కి) భాస్కరుఁడే రామాయణకవి యైనట్లుగాఁ జెప్పబడియున్నది. ఇది భాస్కరుఁడు హూణశకము 14 వ శతాబ్దమువాఁడనికూడఁ దెల్పుచున్నది.

౬. ఇంకను “దక్కనుపోయిట్రీ” (దక్షిణ దేశమందలి కవులు) అను గ్రంథమునందు :—

Bhaskara :—A Telugu poet and resident of Kondavidu; he translated the Rámáyana into Telugu and dedicated it to Sáhinimára, the superintendent of the Royal steed of Ana Véma Reddi, for this he received some reward, but not of very great value. Bháskara flourished in the thirteenth century of the Sálivahana Era, and died in his native country.

అని (హుళక్కి) భాస్కరుండే శ్రీమద్రామాయణమును రచించినట్లు చెప్పంబడియుండుటయే కాక యీతండు ఎఱ్ఱాప్రగ్గడకాశ్రయుండగు అనవేమారెడ్డి కాలములోనివాండని గూడం జెప్పంబడియున్నది.

౭. మఱియు నాంధ్రకవుల చారిత్రములకు ముందుత్రోవను దీసిన శ్రీ. గురజాడ శ్రీరామమూర్తి పంతులవారు తాము మొదట వ్రాసిన కవిజీవితములను లోకప్రతీతినిబట్టి వ్రాసిరి. వీరును లోకప్రతీతి యెట్లున్నదట్లు వ్రాసిరి. అట్టివీరప్పుడు రామాయణమును విరచించిన కవి హుళక్కిభాస్కరుండనియే వ్రాసిరి కాని మంత్రిభాస్కరుని పేరునైన నెత్తియుండలేదు. దీనినిబట్టి యప్పటికి లోకప్రతీతి యెట్లుండునో చదువరులూహింతురుగాక.

ఈరీతిగా నెచ్చటనున్నను హుళక్కిభాస్కరుండు ప్రసిద్ధుండై రామాయణతో సంబంధము కలిగియున్నాండు కాని మంత్రిభాస్కరుండు కాండు. మంత్రిభాస్కరునకు రామాయణములో భాగమును బంచిపెట్టిన వారిలో మొదటివారగు బ॥ సీతారామాచార్యులవారు తమ నిఘంటువులో “భాస్కరుండనం” గా “హుళక్కి భాస్కరుండు” అనియే వ్రాసిరి కాని మరియొక లాగున వ్రాసియుండలేదు. శ్రీరామమూర్తిపంతులగారును రెండవ కూర్పునందుంగూడ “హుళక్కిభాస్కరుడు. వాల్మీక రామాయణము దెనంగించిన కవిశిఖామణి యీతండే” అనివ్రాసిరి. ఎందుచేతవీరందఱునిట్లు వ్రాసిరి? నేటివఱకును సుప్రసిద్ధుండు అతండేయగుటచేత. భాస్కరుని రెండు ముక్కలు చేసిన వారిలో నగ్రగణ్యులగు నాచార్యులవారు-

“భాస్కరుండు,—ఇతండిప్పుడు కనంబడు రామాయణమునందు యుద్ధకాండమున మొదటిభాగమును వ్రాసినవాండు- ఇతనిని హుళక్కి భాస్కరుండం

డురు, బాలకాండమును, కిష్కింధా కాండమును, సుందర కాండమును నితని పుత్త్రుఁడగు మల్లికార్జునభట్టు వ్రాసెను. అయోధ్యాకాండమును కుమార రుద్రదేవుఁడను కవి వ్రాసెను. యుద్ధకాండశేషము నీభాస్కరుని మిత్త్రుఁడగు నయ్యలార్యుఁడు వ్రాసెను. ఆరణ్యకాండమిం దెవ్వరిచేతను వ్రాయఁబడినదికాదు. అది తిక్కన సోమయాజి తాతయగు మంత్రిభాస్కర మహాకవిచే వ్రాయఁబడినది. మంత్రిభాస్కరుఁడు తిక్కనసోమయాజి తాతయగుటయు మహాకవి యగుటయు నిర్వచనోత్తర రామాయణమందలి "సారకవితాభిరామ ...." అను నీపద్యముచేతను దెల్లమగును. మంత్రిభాస్కరుఁడు భారతము తెనిఁగింపఁబడుటకు ముందే రామాయణమొకటి వ్రాసినట్లు రూఢమగుచున్నది. దానిచేతనే భాస్కర రామాయణమను పేరును గలిగియుండవచ్చును. అది యాదికావ్యమగుట చేత నట్లు మొట్టమొదట తెనిఁగింపఁబడియే యుండును. కనుకనే నన్నయభట్టారకుఁడు దాని వదలి భారతమును దెనిఁగింపఁదొరకొనుటయు రామాయణమును దెనిఁగింపఁ బూనకొన్న తిక్కనసోమయాజి యందలి పూర్వకాండములను వదలి యుత్తర కాండమును దెనిఁగించుటయు నని తెలియఁగునది. అట్లు మంత్రిభాస్కరునిచే రచియింపఁబడిన రామాయణమునందారణ్యకాండము తక్కఁ దక్కిన కాండములు కొంత కాలమునకుఁ బిదప నుత్సన్నములై పోఁగా ఆయారణ్యకాండముతోడ నీహుళక్కి భాస్కరుఁడను లోనగువారు తక్కిన కాండములను వ్రాసి చేర్చి పూర్తిఁజేసిరని తెలియవలయును మఱియు నారణ్యకాండము మంత్రిభాస్కరునిచే వ్రాయఁబడినదనుటను ఆదితక్కిన కాండములవలె నేకాశ్వాసముగాఁ జెప్పఁబడక రెండాశ్వాసములు కలదిగాఁ జెప్పఁబడియుండుట చేతను ఆయాశ్వాసములయందలి యాద్యంత పద్యముల వైలక్షణ్యములచేతను అశ్వాసాంత్య గద్య భేదములచేతను శైలిభేదము చేతను నిశ్చయింపవచ్చును." అని వ్రాసియిదివఱకు హుళక్కి భాస్కరునిదని లోకులు వాడుకొనుచున్నట్లున్న యారణ్యకాండమును నూతనముగాఁ దాము మంత్రిభాస్కరునిదైనట్లు గనుఁగొనినారమని సూచించుచుఁ బాపట్లు పలుకుటంతఁ గారణములలోకులకుఁ జూపుచున్నారు. దీనినిబట్టియే యిది నూతనముగా బయలు వెడలిన యభిప్రాయమని గ్రహింపవలయును. ఈనడుమ మూఁడు నాలు "పుంజీల" సంవత్సరముల క్రిందట తిక్కన యుత్తర రామాయణము పాఠశాలలోఁ బఠనీయ గ్రంథముగా నుంచఁబడి నలుప్రక్కల వ్యాపించిన తరువాత కొందఱు పండితులు తిక్కన వ్రాసి

స ‘‘సారకవితాభిరామా’’ అను పద్యమునుబట్టి దూరమాలోచింపక మంత్రిభాస్కరుఁడు రామాయణమును రచించిన కవి యని తలఁచిరి- ఈవిషయమై యాంధ్రభాషాసంజీవనియందును, ప్రబంధకల్పవల్లియందును గొంత ముచ్చట జరిగినది. అప్పటినుండియుఁ గొందఱు ఈనూతనాభిప్రాయము గలవారైయున్నారు- వారిలో నీసీతారామాచార్యులవారొకరైరి. ఇది లోకప్రసిద్ధము కాదు కావునను దమబుద్ధి విశేషముచేఁ దాము నూతనముగాఁ గనిపెట్టిరి కావునను ఆచార్యులవారు తమ నిఘంటువులో లోకప్రసిద్ధుఁడగు హుళక్కి భాస్కరుని ముందుచెప్పి తరువాతఁ దమ నూతన భాస్కరుని గూర్చి వ్రాసి దాని యుక్తులతో సమర్థించుకొనఁ జూచిరి- అంతియేకాని లోకమునందలివాడుక కూడ మంత్రిభాస్కరుని విషయమున నే కలదన సాహసించియుండలేను. ఇంతలోఁగవుల చరిత్ర నాటికదియు మంత్రి భాస్కరుని పరమేయైనది. ఆహా! పందొమ్మిదవ శతాబ్దమహిమ! చదువరులు, ఈమహిమలఁ జాల పరిశీలించి చూచుకొనుఁడు.

అదియుఁగాక భాస్కరుఁడు మొదట గ్రంథమును విరచించి రాజునకుఁగృతి యిచ్చుటకై యాతని కడకుఁ గొనిపోయి యచటఁ గలిగిన యగౌరవమునకుఁ గనలి దాని నచ్చోనుండు గుఱ్ఱపువానికిఁ గృతి యిచ్చెనను కథ మంత్రిభాస్కరునిదైనట్లుగాఁ గవులచరిత్రయందుఁ దెల్పఁబడినది. ఇది సాహసైక వాక్యముగాఁ గాన్పించుచున్నది- ఏలయన నట్లనుట కాధారమేదియును గానరాదు సరికదా పైఁగా నిది హుళక్కి భాస్కరునిదైనట్లుగా గ్రంథదృష్టాంతము కూడఁ గలదు- కవిజీవితములు (మొదటి కూర్పు) ఇది హుళక్కిభాస్కరునిదని ఘోషించుచున్నవి- అదియటుండ మొదట నీకథను ప్రచురించినది పురాణనామచంద్రిక అందు నీకథ నీక్రిందివిధమున నీఁబడియున్నది-

‘‘భాస్కర రామాయణము,—భాస్కరుని వలననైన రామాయణము- ఇది భాస్కరుఁడు, అతని కుమారుఁడగు మల్లికార్జునభట్టు, శిష్యుఁడగు కుమార రుద్రదేవుఁడు, స్నేహితుఁడగు అయ్యలార్యుఁడు ఈనలుగురు కవులచేతను రచియింపఁబడినది- అయినను వారిలో భాస్కరుఁడు ముసలవాఁడగుటచేత నీగ్రంథము భాస్కర రామాయణమన నెగడియున్నది- ఇది యిట్లు రచియింపఁబడుటకుఁగారణము:—ఆకాలమందతనికి నాశ్రయుఁడైయుండిన రాజునొద్ద నతని బంధువైన రంగనాథుఁడను నాతఁడు రాజుయొక్క యాజ్ఞను బొంది ద్విపదరామాయణము ర

చింపఁబూనుకొనఁగా నతని యందుఁ దనకుఁ గల సహజమత్సరము చేత రాజుతో నీ ఘనతకు ద్విపదకావ్యము తగినదికాదు- నేను పద్యకావ్యమును జేసికొనివచ్చెదను దానినిఁబరిగ్రహింపుము- అనఁగా నతఁడు చెప్పినమాట తప్పుట యుక్తము కాదు గనుక రంగనాథుని గ్రంథమునే గైకొను తలంపున నెవరు ముందు దెత్తురో వారి కృతిని గ్రహించెదను అని చెప్పెను- అప్పటికి రంగనాథుని రామాయణము మూఁడు వాళ్ళు తీరియుండును- కనుక యితఁడది ముగియుటకు ముందే తన రామాయణము ను ముగించుకొని పోవనెంచి మీఁదఁజెప్పిన మగ్గరి సహాయము చేతను త్వరితముగా ముగించుకొనిపోయెను- అప్పటికి రంగనాథుఁడు తన రామాయణమును ముగించి యాస్థానమునకుఁదెచ్చి యుండెను- అది చూచి రంగనాథుని తట్టు కుడిచేతిని భాస్కరుని తట్టెడమ చేతినిఁ జాఁచెను- అందుకు భాస్కరుఁడు కోపగించుకొని పక్షపాతముకల నీవంటిరాజునకు నిచ్చుటకంటె నాకృతి నొకగుఱ్ఱప్రవానికిచ్చుట మేలు- అనిపలుకుచు నాస్థానమునుండి వెడలి పోవుచుండఁగా నారాజు యొక్క గుఱ్ఱపు దళవాయి కవిసార్వభౌమా, యాడినమాటతప్పవద్దు అని దారికి నడ్డముగా వచ్చి మ్రొక్కెను అంత నతఁడు వానికిఁ దనకృతి నంకితముఁజేసెను కనుకనే యీ గ్రంథాదియందు సాహిణిమారా యని సంబోధించి చెప్పఁబడియున్నది ''-

అని. యీకథ హుళక్కిభాస్కరునిదైనట్లుగా వెనుకనే గ్రంథస్థమైకూడనుండినను ఏ యేకోనవింశతి శతాబ్దప్రురుషుని మంత్రమహిమముననో నేడిది మంత్రి భాస్కరునిదైనది ! అహా ! కాలమహిమ ! ఈనూతన విషయమును బహునిపుణముగా వెల్లడించిన కవుల చరిత్ర మహిమ నగ్గడించుచు నిందలి రహస్యమునుచదువరులు చక్కగాగ్రహింతురని నమ్మెదను.

కవులచరిత్ర యొక్క ప్రౌఢత యెట్టిదో కాని తన వాదమున కక్కఱకు వచ్చునంశములనేకములతో నిండియుండిన పైగాథను మంత్రిభాస్కరునిదైనను నమ్మనని నుడువుచున్నది. నమ్మననియుచు మనల నంగులోనున్నరీతిగా రాజుగ్రంథమును ద్వరగాఁ బూర్తిఁజేయ నాజ్ఞనీయఁగా నిట్లిందఱిచే నీరామాయణము విరచింపఁబడినదని నుడువుచున్నది- ఇదియుపేక్షణీయము. (క) గ్రంథమును ద్వరగా ముగించుటకే యందఱు విరచించుట తటస్థమగునెడలఁ ప్రౌఢులగు భాస్కరులు కొంచెము కొంచెము భాగములను రచించుటయును కుఱ్ఱవాఁడగు మల్లికార్జున భట్టు మూఁడుకాండముల నిర్మించుటయుఁ గలుగదు- (చ) మఱియును యుద్ధకాండమునం

డు మాఘములోని యేడవసర్గము చేర్చి గ్రంథము పెంపు చేయఁబడినట్లుగాఁ గవుల చరిత్రమే యంగీకరించుచున్నది. అతి త్వరితముగా గ్రంథమును బూర్తి చేయ యత్నించు వారట్లు చేయుట పొసఁగదు. (౪) ఇంకను గ్రంథము విశేషముగా సంగ్రహము చేయఁబడినదే నా యనిన నదియును లేదు. సంస్కృతమున నిరువది నాలుగు వేల గ్రంథము తెలుఁగునఁ బదునైదు వేలుగా దిగినదని కవులచరిత్ర పలుకుచున్నది కాని యది తప్పు. ఎట్లన భాస్కరాదులు తెనిఁగించినది యుద్ధకాండాంతము వఱకే కావున దానిని రువది నాలుగువేల గ్రంథమన జనదు——“ఉత్తరకాండకథయును గూడ నేఁడు కాండలు నేనూరు సర్గలు నిరువదినాలుగువేల శ్లోకంబులుగా వాల్మీకిమునీంద్రుఁడు రామాయణ మహాకావ్యంబు సెప్పె”——అని రామాయణమునందే యుత్తరకాండతోఁ గూడ నిరువది నాలుగువేలని చెప్పఁబడియున్నది. కాన మొదటి యారు కాండలే యిరువది నాలుగు వేలు కావు. ఉత్తరకాండము నాల్గు వేలు గ్రంథమైనను గాన షట్కాండములును నిరువది వేలుండునని చెప్పవచ్చును. ఇరువదివేల గ్రంథము పదునైదువేల లోనికి దిగుట యొక సంగ్రహము కాదు, కావున గ్రంథమును త్వరగాఁ బూర్తి చేయుటకై కవులు ప్రయత్నించిరనుమాట నమ్మఁదగినది కాదు. హుళక్కి భాస్కరుఁడు సపుత్ర మిత్రచ్ఛాత్రముగా నొక గ్రంథముం దండుటకై యట్లొనర్చెననుట న్యాయము.

కవులచరిత్ర యందెంత పొరపాటయున్నను నీకథయందు మంత్రి భాస్కరుని నిది కథాసందర్భమునంతను జెడఁగొట్టినది. కల్పితగాథలైనను సంగతులు పరస్పర సంబంధము కలిగియుండకపోవు. మంత్రిభాస్కరుని గథయందుంచినతోడనే సరసత చెడినది. మంత్రిభాస్కరుఁడు రాజునొద్ద మంత్రియఁట. హుళక్కిభాస్కరుఁడు తదాశ్రితుండఁట, రంగనాథకవి రాజబంధువఁట. ఇది కవులచరిత్ర చెప్పిన సందర్భము. ఇది జ్ఞాపకముంచుకొని కథలోనికి రండు రంగనాథకవి ద్విపద రామాయణమును జేసి రాజుచే గౌరవింపఁబడఁ జూచుచుండఁగా మంత్రి భాస్కరుఁడు దానికి సహింపఁజాలక తన మంత్రబలమును జూపెనఁట. ఇదియేమి సందర్భము? రంగనాథుండు కవిగా రాజుచే గౌరవింపఁబడిన మంత్రి కేమినష్టము? మంత్రి దానికడ్డుపడనేల? ఇఁక మంత్రి భాస్కరుఁడు కేవలము మహాత్యాగ శిరోమణి యనవలసివచ్చును. హుళక్కిభాస్కరుని విషయ మట్టిది కాదు. రంగనాథుఁడును నితఁడును రాజుకడ నాస్థాన కవులు, అనఁగా నొకవిధముగ పదవులున్నవారు. అట్టివారిలో నొకరి కెక్కుడు

గౌరవము జరుగనున్న రెండవవారు దానిసహింపలేకపోవుట లోకమందుసహజము (జ) బుద్ధరాజు తనబంధుఁడైన రంగనాథుని చేత ద్విపద రామాయణమును జేయించుచుండఁగా మంత్రియైన భాస్కరుని కాసంగతి తెలిసి యతఁడు రాజుతోఁ దానురామాయణమును పద్యకావ్యముగాఁ జేయించి కృతియిప్పించెద నని చెప్పెనని కవులచరిత్రనుడువుచున్నది- ఏమియీచమత్కృతి? రాజుస్వయముగా బంధువుచే రామాయణమును రచింపించుచుండఁగా మంత్రివచ్చి దానిఁ గృతినందుట మాను నేను పసులచే నిఁకఁ జేయించితెచ్చు పద్యకావ్యమును గృతినందుమని చెప్పునా? ఆతఁడు సిగ్గులేక చెప్పినను రాజు దానికంగీకరింపవలసినంత యవసరముండునా? మంత్రి భాస్కరుఁడు తాను స్వయముగాఁ జేసి తెచ్చెదననక చేయించి కృతి యిప్పించెదననుట యందలి సారస్యమేమి? రాజునకిట్టి మోమోట పడవలసిన యవసరమేమైనయుండునేమో చదువరులాలోచించుకొనవలయును. హుళక్కి భాస్కరుని విషయమిట్టిదికాదు. ఆస్థానకవులందు నొకఁడు ద్విపద రామాయణమును రచించెదననియు మఱియొకఁడు పద్యరామాయణము నొనర్చెదననియుఁ జెప్పిరి. మొదటి వానియందు బంధుత్వమున్నది రెండవ వానియందు నాధిక్యతయున్నది. కావున రాజు మోమోటమునకు లోనైనవాఁడు కావచ్చును. రాజు కవికి నీవిషయమున లొంగిన విద్యాభిమాని యనిపించుకొనును. మంత్రికి లొంగిన నసమర్థుఁడనిపించుకొనును (డ) రాజు రంగనాథరామాయణమును గుడిచేతను తనరామాయణము నెడమచేతను నందుకొనిన మంత్రి కోపించుకొనుట కవకాశమేది? రెండు గ్రంథములును నొక్కకాలమందు వచ్చినవి. మొదటిది బంధువు చేసినది. రెండవది మంత్రి చేయించినదియు అంతియకాక అది మొదట రాజుచేఁ జేయింపఁబడినది. ఇదిమంత్రి తరువాత చేయించినదియు నైయున్నవి. కావున వాని గౌరవము రాజుచేసినరీతినుండఁ దగినదియే. ఆస్థానకవి విషయమట్టిదికాదు- ఈకవులు రాజులయాజ్ఞానువర్తులగు మంత్రులవంటివారుకారు. వీరిగౌరవమునకును మంత్రులగౌరవమునకును జాలభేదము- వీరు రాజులందులక్ష్యముకలిగియుండరు. కావున నాస్థాన కవులిద్దఱిలోను నొకఁడు ద్విపదరామాయణమును మఱియొకఁడు పద్యకావ్యమును రచించి తెచ్చియుండఁగాఁ గవితాపటుత్వముల భేదమారసి యొసంగవలసిన గౌరవాధిక్యతను బంధుత్వమును ముఖ్యముగాఁజేసికొని బంధువుపరముచేయుటచే రెండవకవికిఁ గోపమువచ్చెననుట తగియున్నది- ఈరీతిగా నాలోచించి చూచిన నీకథయందలి మంత్రి భాస్కరుని మంత్రిమహిమయును దీనిఁ గల్పించినవారి మంత్రమహిమయును గూడఁ దేలుచు

న్నవి- కాఁబట్టి కల్పితమైన యొకటి గాథయందు నీనూతన కల్పనము చేయఁబడిన దని తెలియరాకపోదు-

కావున లోకప్రతీతిగూడ హుళక్కి భాస్కరుని విషయముననే వినియోగించు చున్నది-

కాఁబట్టి సర్వవిధముల రామాయణకవి హుళక్కి భాస్కరుఁడే కాని మంత్రిభాస్కరుఁడు కాఁడని లోకము గ్రహింపవలయును-

పైన నీరామాయణకవి చారిత్రాంశములు చాలచోట్ల చెదరిపడి వ్రాసినవే యైనను సులభముగాఁ జనవరులకుఁ దెలియుటకై మరల వాని నిచట వివరింతము-

శ్రీమద్రామాయణమును దెనిఁగించి యాంధ్రలోకోపకృతి చేసినమహానీయుఁడు హుళక్కి భాస్కర మహాకవి- ఈతని చేతనే యీరామాయణమునకు భాస్కర రామాయణమను పేరు వచ్చినది- ఈతఁడీ రామాయణములో నారణ్యకాండమును యుద్ధకాండములోఁ గొంతభాగమును మాత్రము విరచించెను. తక్కినభాగములో బాల, కిష్కింధా, సుందరకాండములను దత్పుత్త్రుఁడగు మల్లికార్జునభట్టును, అయోధ్యాకాండమును శిష్యుఁడగు కుమార రుద్రదేవుఁడును యుద్ధకాండములోని తుదిభాగమును మిత్రుఁడగు నయ్యలార్యుఁడును వ్రాసిరి- వీరుముగ్గురును భాస్కరశిక్షితులే కావచ్చును గాన నీరామాయణ కవితా యశస్సునకు మూల పురుషుండగు భాస్కరునందుట న్యాయముగా నేయున్నది- ఇందలి కవులు గ్రంథమును విరచించుటకుఁ గలకారణము తనచే శిక్షితులగు శిష్యవర్గముతోఁ గూడ నీగ్రంథమున నుండుటకు భాస్కరుఁడు తలఁచుట యనుట సమంజసము- గ్రంథము సాహిణి మారునకంకితము చేయఁబడినది, కాని కొన్ని కాండాంత్యపద్యములు ఈశ్వరు సంబోధించుచున్నవి; ఈభాస్కరుఁడు వైదికి ఆపస్తంబ సూత్రుఁడు హరిత సగోత్రుఁడు "అమరావతికిఁ జోడుకొండవీడు" అని శ్రీనాథునిచే వర్ణింపఁబడిన కొండవీడి భాస్కరకవికి నివేశపట్టు- ఈతఁడు రాజాస్థానముల మిక్కిలి గౌరవమందిన సుప్రసిద్ధమహాకవి- పదునాలవ శతాబ్దములోనివాఁడు అప్పటికి నీయాంధ్రవాఙ్మయప్రపంచము సదాకృతిఁ గలిగి జీవనవంబాసంగఁదగు స్థితియందుండెను కావున రామరాజభూషణకవి చెప్పినట్లుగా వాగనుశాసనుచే సృజింపఁబడి కుండలీంద్రుచే నుద్ధరింపఁబడిన యీ "యాంధ్రోక్తిమయప్రపంచము నీభాస్కరుఁడు వెలయించి తాజగన్మిత్రుఁడై వెలిగె.

ఓంతత్సత్.

కాశీభట్ల బ్రహ్మయ్య-

శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయము